
"నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది"

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+4 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 191

శనివారం 1-10-2022


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

చదువులను ప్రోత్సహించేందుకు జగనన్న ప్రభుత్వం వేస్తున్న మరో అడుగు..

జగనన్న ప్రభుత్వం
మేనిఫెస్టోలో చెప్పిన 98.44% హామీలు అమలు చేశాం, చేస్తాం
JAGANANNA GOVERNMENT

దసరా శుభాకాంక్షలతో..

మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని అమలు పరుస్తూ..



వైఎస్సార్ కళ్యాణమస్తు



వైఎస్సార్ షాదీ తోఫా

30 సెప్టెంబర్, 2022 న పథకం వెబ్‌సైట్ ను ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..
1 అక్టోబర్, 2022 న పథకం ప్రారంభం..

పిల్లల చదువు ఇంటికి వెలుగు - ఇల్లాలి చదువు వంశానికే వెలుగు..


శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

పేద తల్లిదండ్రులు వారి పిల్లలను చదివించి వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించి తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేందుకు అండగా నిలుస్తూ.. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు" ద్వారా, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

వధూవరులిరువురుకీ 10th క్లాస్ ఉత్తీర్ణత తప్పనిసరి..

పిల్లల చదువును ప్రోత్సహించడం.. బాల్య వివాహాలను నివారించడం.. పాఠశాలల్లో చేరికల శాతాన్ని పెంచడం.. డ్రాపౌట్ రేట్‌ను తగ్గించడం.. లక్ష్యాలుగా "వైఎస్సార్ కళ్యాణమస్తు", "వైఎస్సార్ షాదీ తోఫా".. లబ్ధిదారైన వధువు, ఆమెను వివాహం చేసుకునే వరుడు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, వివాహ తేదీ నాటికి వధువు వయస్సు 18, వరుడి వయస్సు 21 ఏళ్లు ఖచ్చితంగా నిండాలన్న నిబంధనలు పై పథకాల ద్వారా అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

గత ప్రభుత్వంలో అరకొరగా కొన్ని వర్గాలకే ఆర్థిక సాయం.. అదీ సకాలంలో అందరికీ అందని వైనం.. సాయం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దైన్యం.. అర్హులైన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ నెలల తరబడి జాప్యం చేసి 2018 నుండి ఈ పథకాన్ని ఎత్తివేసిన దుస్థితి.. 2018-19 సంవత్సరంలో ఏకంగా 17,709 లబ్ధిదారులకు రూ. 68.68 కోట్ల వివాహ ప్రోత్సాహకాలను చెల్లించకుండా ఎగ్గొట్టిన పరిస్థితి..

- మరి మన జగనన్న ప్రభుత్వంలో లంచాలకు, వివక్షకు తావు లేకుండా, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా "వైఎస్సార్ కళ్యాణమస్తు / వైఎస్సార్ షాదీ తోఫా"ల క్రింద అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి..
- పేదల ఇంట్లో పెళ్లి కూడా ఆనందాల అనుభూతులను మిగిల్చేలా, గత ప్రభుత్వంలో అందిస్తామని ఎగ్గొట్టిన సాయానికి దాదాపు రెట్టింపు ఆర్థికసాయం..

జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం వెనుక ఎంతో దూరదృష్టి ఉంది..! భవిష్యత్ గురించి ఆలోచన ఉంది..!! ప్రస్తుత అవసరాలు తీర్చడంతో పాటు భావి తరాలకూ మంచి జరగాలన్న తపన ఉంది..!!!

పాఠశాలల్లో పిల్లల నమోదు శాతం పెంచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేయడమే లక్ష్యంగా విద్యా రంగంలో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలు..

- ఒకవైపు పిల్లలను బడికి పంపించేలా తల్లులను ప్రోత్సహిస్తూనే, మరోవైపు డ్రాపౌట్ రేట్ తగ్గించడమే లక్ష్యంగా 75 శాతం హాజరు నిబంధనతో "జగనన్న అమ్మఒడి" ద్వారా తల్లులకు ఏటా రూ. 15,000 ఆర్థిక సాయం..
- "నాడు-నేడు" లో స్కూళ్ళ అభివృద్ధి చేయడమేగాక పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చిరకాలం నిలబడాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని "అమ్మఒడి" నిధుల నుండి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్(SMF), టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్(TMF) ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణ బాధ్యతల్లో తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేయడంతో వారికి ప్రశ్నించే హక్కు కల్పిస్తున్నాం..
- పాఠశాలల్లో టాయిలెట్ వసతి లేని కారణంగా బాలికల్లో డ్రాపౌట్ రేట్ ఎక్కువగా ఉండటం గమనించి దాన్ని తగ్గించడం కోసం నాడు-నేడు క్రింద పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం.. "స్వేచ్ఛ" పథకం ద్వారా 7వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న ఆడపిల్లలకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్ ల పంపిణీ..
- "జగనన్న గోరుముద్ద" ద్వారా ప్రతి రోజూ మెనూ మార్చి పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన, మెరుగైన పౌష్టికాహారం..
- తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా, దాని వల్ల డ్రాపౌట్ ల సంఖ్య పెరగకుండా ఉండేందుకు పాఠశాల తెరిచిన రోజునుండే "జగనన్న విద్యాకానుక" ద్వారా బైలింగువల్ పాఠ్యపుస్తకాలు (ఒక పేజీ తెలుగు, మరో పేజీ ఇంగ్లీషులో), నోట్ బుక్స్, యూనిఫాంతో సహా 9 వస్తువులతో కూడిన కిట్ ఉచితంగా అందజేత..
- మన విద్యార్థినీ, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రాథమిక విద్య నుంచే పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన.. సీబీఎస్ఈతో సిలబస్ అనుసంధానం..
- ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా మన పిల్లలను సన్నద్ధం చేసేందుకు 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఏటా రూ. 24 వేల విలువైన, శ్రీమంతుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉన్న బైజూస్ స్టడీ మెటీరియల్.. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే పిల్లలకు, బోధించే ఉపాధ్యాయులకు ఈ ఏడాది నవంబర్‌లో, ఇకనుంచి ప్రతి ఏడాదీ "జగనన్న విద్యాకానుక"లో భాగంగా రూ.16 వేలు విలువ చేసే ట్యాబ్ లు ఉచితంగా అందజేత...
- కాలేజీల్లో జవాబుదారీతనం పెరిగేలా, తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకంగా "జగనన్న విద్యాదీవెన", భోజన, వసతి ఖర్చుల కోసం "జగనన్న వసతి దీవెన" క్రింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసి వారి ద్వారా కాలేజీలకు చెల్లింపు.. కరికులమ్ లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను తీసుకురావడం, ఆన్ లైన్ వర్టికల్స్, ఇంటర్న్‌షిప్ లు...
- మరి ఇప్పుడు మరో అడుగు ముందుకు వేస్తూ వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా పిల్లల చదువును మరింత ప్రోత్సహించేలా చర్యలు..

సత్ఫలితాలందిస్తున్న మన ప్రభుత్వ విద్యా సంస్కరణలు

- గత పాలకుల హయాంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యంచేసిన కారణంగా 2018లో కేంద్ర మానవ వనరుల శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చేరిక (జీఈఆర్) రాష్ట్రంలో కేవలం 84.48%గా నమోదైన దుస్థితి.. మన ప్రభుత్వం విద్యా రంగంలో చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాల ఫలితంగా 2021 నాటికి మన రాష్ట్రంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరిక (జీఈఆర్) 102.97%కి చేరింది..
- 2018-19 సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు 37.21 లక్షలుగా ఉన్న విద్యార్థుల సంఖ్య 7 లక్షలు పెరిగి 2021-22 నాటికి 44.30 లక్షలకు చేరింది. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 2 లక్షలకు పైగా పెరిగి 72.47 లక్షలకు చేరడం గమనార్హం.
- సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ గవర్నెన్స్ అకౌంటబిలిటీ & సేవ్ ది చిల్డ్రన్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం 2020-21లో అంగన్ వాడీ చదువుల కోసం భారతదేశం జీడీపీ లో 0.1 శాతం, అంటే ఒక్కో చిన్నారికి దేశంలో సగటున రూ. 8,297 మాత్రమే ఖర్చు చేయగా, మన ప్రభుత్వం ఒక్కొక్క చిన్నారిపై జాతీయ సగటు కన్నా దాదాపు రెట్టింపు మొత్తం రూ. 15,152 ఖర్చు చేస్తూ దేశంలోనే అత్యధికంగా ఖర్చు చేసే రాష్ట్రాల సరసన నిలిచింది..

సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్
1902

తేడా గమనించండి..!

క్రమ సంఖ్య	కేటగిరీ	గత ప్రభుత్వం అందిస్తామని ఎగ్గొట్టిన ఆర్థిక సాయం (రూ.లలో)	వైఎస్సార్ కళ్యాణ మస్తు / వైఎస్సార్ షాదీ తోఫా క్రింద మన ప్రభుత్వం అందిస్తున్న సాయం (రూ.లలో)
1	ఎస్.సి	40,000	1,00,000
2	ఎస్.సి (కులాంతర వివాహం)	75,000	1,20,000
3	ఎస్.టి	50,000	1,00,000
4	ఎస్.టి(కులాంతర వివాహం)	75,000	1,20,000
5	బి.సి	35,000	50,000
6	బి.సి(కులాంతర వివాహం)	50,000	75,000
7	మైనార్టీలు	50,000	1,00,000
8	విభిన్న ప్రతిభావంతులు	1,00,000	1,50,000
9	భవన, ఇతర నిర్మాణ కార్మికులు.	20,000	40,000

దరఖాస్తు చేసుకునే విధానం...

- అక్టోబర్ 1వ తేదీ నుండి పథకం అమలు.. అర్హులైన పేదలందరూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వైఎస్సార్ కళ్యాణమస్తు / వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు..
- ఈ పథకం క్రింద లబ్ధి పొందడానికి వధూవరులిద్దరికీ ఇది తొలి వివాహమై ఉండాలి.. వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించేలా సదరు అక్కచెల్లెమ్మలకు ఈ నిబంధన నుండి మినహాయింపు..
- వధూవరులు వివాహమైన 60 రోజుల లోపు తమ దగ్గర్లోని గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించాలి.. వివాహ ధృవీకరణ పత్రాన్ని సచివాలయంలో దరఖాస్తు చేసుకుని పొందవచ్చు..
- గ్రామ/వార్డు సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ /వార్డు వెల్ఫేర్ & డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ లను కలిసి లేదా వాలంటీర్ సహాయంతో వివాహ ధృవీకరణ పత్రం, పెళ్లి ఫొటోలు, వధూవరుల పదవ తరగతి పాస్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తదితర అవసరమైన డాక్యుమెంట్‌లు అందజేస్తే, వారు నవశకం బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తును ప్రాసెస్ చేయడంతో పాటు అర్హులందరికీ లబ్ధి అందేలా సహకరిస్తారు.
- సంబంధిత అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి వివరాలను ధృవీకరించుకుని ప్రతి ఏడాది త్రైమాసికానికి ఒకసారి చొప్పున జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ లలో ఆ త్రైమాసికానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తారు..
- పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు నవశకం బెనిఫిషియరీస్ మేనేజ్ మెంట్ పోర్టల్ https//gsws-nbm.ap.gov.in/ వెబ్ సైట్ లో పొందవచ్చు..

శ్రీ. మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ
శనివారం ॥ 1-10-2022







ఫ్యాషన్

కలంకారీ కళ కళలు

నవరాత్రుల వేళ ..
అమ్మవారి అలంకరణ రోజుకొక హంగుగా దర్శనమిస్తుంది.
అమ్మవారి రూపంగా భావించే మహిళలూ
ఈ వేడుకల్లో తమ ఆహార్యమూ అదిరిపోవాలనుకుంటారు.
దాండియా ఆటపాటల్లో పాల్గొనడానికి
ప్రతిరోజూ ప్రత్యేకమైన దుస్తుల ఎంపిక తప్పనిసరి అనుకుంటారు.
అయితే, డ్రెస్ ఎంపిక కుదరడం లేదు అనుకున్నవారికి
మనవైన కలంకారీ ప్రింట్లు ఉన్న బ్లౌజ్ డిజైన్స్ అన్నిరకాల చీర కట్టుకు
సరైన ఎంపిక అవుతుంది.
రూపాన్ని కళగా మార్చేస్తుంది.







ప్లెయిన్, ప్రింటెడ్, పట్టు శారీ ఏ మెటీరియల్ అయినా.. రంగులు భిన్నమైనా.. ఒక్క కలంకారీ బ్లౌజ్ తీరైన కళను తీసుకువస్తుంది. దీనికి సిల్వర్ జ్యువెలరీ సరైన ఎంపిక అవుతుంది. సాధారణ మోడల్ లేదా మోడర్న్ కట్, లాంగ్ జాకెట్ అయినా.. డిజైన్ల ఎంపికలో కలంకారీకి సాటి లేదన్నది ఈ వేడుకలో కనిపిస్తుంటుంది. కళగా ఉండాలనుకునేవారు కలంకారీ ధరిస్తే చాలు నవరాత్రుల్లో నవ్యంగా వెలిగిపోతారు.









ఇంటిప్స్

- నీళ్లలో కొద్దిగా బేకింగ్ సోడా, వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమంలో ఇయర్ బడ్స్‌ను ముంచి ఇస్త్రీ పెట్టె అడుగు భాగంలో ఉన్న రంధ్రాలను తుడిస్తే లోపల పేరుకున్న దుమ్ముధూళి పోతాయి. పెట్టె అడుగుభాగాన్ని కూడా



ఈ నీటిలో ముంచి వస్త్రంతో తుడిచి, తరువాత పొడి వస్త్రంతో తుడవాలి. ఇలా చేయడం వల్ల ఇస్త్రీపెట్టె అడుగు భాగంలో నలుపు మొత్తం పోయి కొత్తదానిలా మెరుస్తుంది. అయితే ఇలా తుడిచేటప్పుడు ఇస్త్రీ పెట్టె ప్లగ్‌ను స్విచ్‌బోర్డు నుంచి తీసేయాలి.

- కళ్లజోడు రోజూ వాడడం వల్ల అద్దాల మీద చిన్నచిన్న గీతలు, దుమ్ము ధూళి పడుతుంటాయి. లెన్స్ క్లీన్ చేసే లిక్విడ్



అందుబాటులో లేనప్పుడు.. అద్దాల మీద కొద్దిగా వెనిగర్ రాసి రెండు నిమిషాలు ఆగిన తరువాత మెత్తటి వస్త్రంతో తుడిస్తే గీతలు, దుమ్ము ధూళి పోతాయి.

- ట్యాబ్లెట్స్, సిరప్ డబ్బాల మీద ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌లు ఒక్కోసారి తడితగిలి చెరిగిపోతుంటాయి. డేట్ తెలియకపోతే ఆ మందును వాడడం కష్టం. ఇలా జరగకుండా ఉండాలంటే ట్యాబ్లెట్ గానీ, సిరప్‌ను గాని తీసుకొచ్చిన వెంటనే ఎప్పటి నుంచి ఎప్పటివరకు వాడవచ్చో తెలిపే డేట్స్ మీద ట్రాన్స్‌పరెంట్ టేప్‌ను అతికించాలి. ఈ టేప్ ఉండడంవల్ల మందు అయిపోయేంత వరకు డేట్ చెరిగిపోకుండా ఉంటుంది.



- నెయిల్ పెయింట్ తీసి వేసుకునేటప్పుడు మూత అంచుల మీద కారి గాలికి గట్టిపడి పోతుంది. దీంతో .. తీసిన వెంటనే రాకుండా మూత స్ట్రక్ అయిపోతుంది. మూత పెట్టే ముందు పెయింట్ సీసా మూతి చుట్టూ ఉన్న పెయింట్‌ను శుభ్రంగా తుడిచి, ఇయర్ బడ్‌తో కొద్దిగా నెయ్యి లేదా నూనెను రాసి మూతపెట్టాలి. అప్పుడు మూత బిగుసుకు పోకుండా చక్కగా వస్తుంది.



- వాషింగ్ మెషిన్‌లో పెద్దవాళ్ల బట్టలతో పాటు, సాక్సులు, కర్చీఫ్‌లు, చిన్న చిన్న బట్టలు వేయాలనుకున్నప్పుడు..కూరగాయలు, పండ్లకు ఇచ్చే నెట్ బ్యాగ్‌లో చిన్నచిన్న బట్టలను వేసి రబ్బర్ బ్యాండ్ మూటకట్టి వాషింగ్ మెషిన్‌లో వేయాలి. అప్పుడు చక్కగా క్లీన్ అవ్వడంతోపాటు, మిగతా బట్టల్లో కలిసిపోకుండా ఉంటాయి.



- టొమాటో తొడిమ తీసిన ప్రాంతంలో రెండు చుక్కలు నూనె రాసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వచేస్తే ఎక్కువ రోజులపాటు రంగు మారకుండా తాజాగా ఉంటాయి.



బ్యూటిప్స్

బాదం నూనెకు ఇవి కలిపితే..

- మీడియం సైజులో ఉన్న ఉల్లిపాయను తీసుకుని సన్నగా తురిమి రసం తియ్యాలి. ఈ రసాన్ని రెండు టేబుల్ స్పూన్ల బాదం నూనెలో వేసి కలిపి, కుదుళ్ల నుంచి చివర్లవరకు పట్టించి ఇరవై నిమిషాలపాటు మర్దన చేయాలి. నలభై నిమిషాల తరువాత తలస్నానం చేయాలి. వారానికి రెండు సార్లు ఈ విధంగా చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గి, ఒత్తుగా పెరుగుతుంది.





- బాదం నూనెలో ఉసిరిపొడి లేదా రెండు టీస్పూన్ల తాజా నిమ్మరసం వేసి కలిపి జుట్టుకు పట్టించి మర్దన చేసి అర గంట తరువాత తల స్నానం చేయాలి. వారానికి రెండు సార్లు ఈవిధంగా చేస్తే వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. కురులకు పోషణ అంది నల్లగా నిగనిగలాడుతూ పెరుగుతాయి.



ముఖానికి తేనె... పన్నీరు

రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, టీస్పూను రోజ్ వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదిహేను నిమిషాల పాటు అలాగే ఉండనివ్వాలి. బాగా ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేసుకోవడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన ట్యాన్ తగ్గుముఖం పడుతుంది. రోజ్ వాటర్ ముఖానికి సహజసిద్ధ నిగారింపుని ఇస్తే, తేనె చర్మానికి తేమనందిస్తుంది.



విన్నర్

గ్రేట్ ఛేంజ్‌మేకర్

ఆ వార్త చదివిన తరువాత తన కన్నీళ్లు కట్టలు తెంచుకున్నాయి. 'నేనేం చేయలేనా!' అని భారంగా నిట్టూర్చింది. అంతమాత్రాన శ్రిష్టి బక్షీ బాధలోనే ఉండిపోలేదు. బాధ్యతతో ముందడుగు వేసింది...

కొన్ని సంవత్సరాల క్రితం...'ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో తల్లీకూతుళ్ల సామూహిక అత్యాచారానికి గురయ్యారు' అనే వార్త చదివిన తరువాత శ్రిష్టి బక్షీ మనసు మనసులో లేదు. కళ్ల నిండా నీళ్లు. బాధ తట్టుకోలేక తాను చదివింది కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకుంది.

'ఇలాంటివి మన దేశంలో సాధారణం' అన్నారు వాళ్లు. ఈ స్పందనతో శ్రిష్టి బాధ రెట్టింపు అయ్యింది. ఇలా ఎవరికి వారు సాధారణం అనుకోవడం వల్లే పరిస్థితి దిగజారిపోతుంది. ఒక దుస్సంఘటన జరిగితే దానిపై ఆందోళన, ఆవేదన వ్యక్తం అవుతుంది తప్ప నిర్దిష్టమైన కార్యాచరణ మాత్రం కనిపించడం లేదు' అనుకుంది.

ఆరోజంతా శ్రిష్టి అదోలా ఉంది.

ఈ నేపథ్యంలోనే తన వంతుగా ఏదో ఒకటి చేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. మహిళలకు సంబంధించిన భద్రత, హక్కుల గురించి అవగాహన కలిగించడానికి పాదయాత్ర చేయాలని నిర్ణయించుకుంది. దీనికి ముందు రకరకాల కేస్‌స్టడీలు, పరిశోధన పత్రాలు చదివింది. ఆధునిక సాంకేతిక జ్ఞానంతో అపూర్వ విజయాలు సాధించిన సాధారణ మహిళల గురించి అధ్యయనం చేసింది.

బెంగాల్‌లోని ఒక పనిమనిషి సరదాగా యూట్యూబ్‌లో వంటలకు సంబంధించిన రకరకాల వీడియోలను పోస్ట్ చేసేది. కొద్దికాలంలోనే ఆమె



అవార్డు అందుకుంటూ...

యూట్యూబ్ స్టార్‌గా ఎదిగి ఆర్థికంగా బాగా సంపాదించడాన్ని స్ఫూర్తిగా తీసుకుంది.

తమిళనాడు గ్రామీణ ప్రాంతానికి చెందిన తల్లీకూతుళ్లు వాట్సాప్ కేంద్రంగా దుస్తుల వ్యాపారం మొదలుపెట్టి ఘన విజయం సాధించారు... ఇలాంటి ఎన్నో స్ఫూర్తిదాయక విజయాల గురించి తెలుసుకుంది. ఇలాంటి ఎన్నో విజయగాథలను తన పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనుకుంది.

'టెక్నాలజీతో సులభంగా అనుసంధానం అయ్యే ఈరోజుల్లో చాలామంది మహిళలు దానికి దూరంగా ఉంటున్నారు. దీనికి కారణం డిజిటల్ నిరక్షరాస్యత. వారికి డిజిటల్ నాలెడ్జ్‌ను దగ్గర చేస్తే ఎన్నో అద్భుతాలు సాధించగలరు' అనుకుంది శ్రిష్టి బక్షీ.

దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల గుండా 3,800 కి.మీల పాదయాత్ర చేసింది. ఈ యాత్రలో ఎంతోమంది మహిళలు ఎన్నో సమస్యలను తనతో పంచుకున్నారు. పరిష్కార మార్గాల గురించి లోతైన చర్చ జరిగేదే. ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

> **టెక్నాలజీతో సులభంగా అనుసంధానం అయ్యే ఈరోజుల్లో చాలామంది మహిళలు దానికి దూరంగా ఉంటున్నారు. దీనికి కారణం డిజిటల్ నిరక్షరాస్యత. వారికి డిజిటల్ నాలెడ్జ్‌ను దగ్గర చేస్తే ఎన్నో అద్భుతాలు సాధించగలరు.**

తాజా విషయానికి వస్తే...

హక్కుల నుంచి సాధికారత వరకు వివిధ విషయాల్లో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన శ్రిష్టి బక్షీని ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠాత్మక 'ఛేంజ్‌మేకర్' అవార్డ్ వరించింది. 150 దేశాలకు చెందిన 3000 మంది మహిళల నుంచి ఈ అవార్డ్‌కు శ్రిష్టిని ఎంపికచేశారు.

'యూఎన్ ఎస్‌డీజీ యాక్షన్ అవార్డ్‌ల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సోషల్ ఛేంజ్‌మేకర్స్‌తో మాట్లాడే



ఆశీర్వాదం తీసుకుంటూ...

అవకాశం లభిస్తుంది. వారి అనుభవాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. వ్యక్తిగతంగానే కాదు సమష్టిగా కూడా సమాజం కోసం పనిచేయడానికి అవకాశం దొరుకుతుంది' అంటుంది శ్రిష్టి.

'సమీకరణ, స్ఫూర్తి, ఒకరితో ఒకరు అనుసంధానం కావడం ద్వారా సుందర భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చు. మనం ఎలా జీవిస్తే మంచిది అనే విశ్లేషణకు ఇవి ఉపయోగపడతాయి. పునరాలోచనకు అవకాశం ఉంటుంది' అంటుంది ఎస్‌డీజీ యాక్షన్ క్యాంపెయిన్ కమిటీ.

ఇ-కామర్స్ స్ట్రాటజిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకున్న శ్రిష్టి హాంకాంగ్‌లో పెద్ద ఉద్యోగం చేసేది. 'నా జీవితం ఆనందమయం' అని ఆమె అక్కడే ఉండి ఉంటే 'ఛేంజ్‌మేకర్'గా యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించేది కాదు.

డ్యాన్స్ ఇండియా డ్యాన్స్

లక్షల వర్షం

ఆకలి రుచిని, నిద్ర సుఖాన్ని ఎరగవు అంటారు. ఇదేవిధంగా టాలెంట్‌కు.. బీద, గొప్ప, వయసుతో సంబంధం ఉండదని అనేక సందర్భాల్లో ఎంతోమంది నిరూపించి చూపిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలో చేరిన వర్షా బుమ్రా కూడా ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. పొట్ట కూటికోసం కూలిపని చేసుకుంటూనే, తనకెంతో ఇష్టమైన డ్యాన్స్‌ను ఎంతో కష్టపడి స్వయంగా నేర్చుకుని 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ సూపర్ మామ్స్ సీజన్-3' విజేతగా నిలిచింది.

ఇటీవల ముంబైలో జరిగిన జీ టీవీ డ్యాన్స్ రియాల్టీషో..'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ సీజన్-3' ఫినాలేలో టైటిల్ విన్నర్‌గా నిలించింది వర్షా బుమ్రా. అనేక మందితో వివిధ రౌండ్లలో కఠినమైన పోటీని ఎదుర్కొని ఐదు లక్షల రూపాయల ప్రైజ్ మనీతోపాటు, షో న్యాయనిర్ణేతలను మెప్పించి కొంత, స్పాన్సర్స్ నుంచి కొంత ఇలా మొత్తం పది లక్షల రూపాయలు గెలుచుకుంది. కూలి పనిచేసుకుని కేవలం వందల్లో సంపాదించే వర్షకు ఇది చాలా పెద్దమొత్తం. అందరిలా కాకుండా అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ ఆమె ఈ స్టేజి మీద విజేతగా నిలవడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది.

హర్యానాకు చెందిన వర్షా బుమ్రాది నిరుపేద కుటుంబం. పదిహేడేళ్ల వయసులో పెళ్లి అయ్యింది. భవన నిర్మాణ రంగంలో రోజువారి కూలీగా పనిచేస్తున్న భర్తతో కలిసి తను కూడా పనికి వెళ్లి భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. వీరికి ఐదేళ్ల బాబు ఉన్నాడు. వర్షకు డ్యాన్స్ అంటే ఎనలేని మక్కువ. పెళ్లికి ముందు డ్యాన్స్ చేస్తూ అనేక పోటీల్లో పాల్గొంది. అయితే ఆ విషయం ఎప్పుడూ బయటకు చెప్పలేదు. బాబుకు ఐదేళ్లు వచ్చాక ఓ రోజు డ్యాన్స్‌పై ఉన్న ఇష్టాన్ని భర్తకు చెప్పింది. అతను కూడా వర్షను ప్రోత్సహించడంతో తనకు సమయం దొరికినప్పుడల్లా డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండేది.


వీడియోలు చూసి...

భర్త ఇచ్చిన ప్రోత్సాహం, మరోపక్క కొరియోగ్రాఫర్ వర్తికా ఝా వీడియోలను సోషల్ మీడియాలో చూసిన వర్షకు డ్యాన్స్ నేర్చుకోవాలన్న కసి పెరిగింది. దీంతో రోజూ ఆన్‌లైన్‌లో వీడియోలు చూసి ఒక్కో పాటను పదిసార్లు సాధన చేసేది. ఇలా అనేకరోజులపాటు క్రమం తప్పకుండా సాధన చేసి చాలా రకాల డ్యాన్స్ స్టెప్స్‌ను త్వరత్వరగా నేర్చేసుకుంది. డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ సూపర్ మామ్స్‌కు ఆడిషన్స్ జరుగుతున్నాయని తెలుసుకుని ఆడిషన్స్‌కు వెళ్లి, వారిని మెప్పించి పోటీలో పాల్గొనడానికి ఎంపికైంది. దీంతో కూలిపనికి వెళ్లడం మానేసి పూర్తి సమయాన్ని డ్యాన్స్ ప్రాక్టీస్‌కే కేటాయించింది. టైటిల్ గెలవడమే లక్ష్యంగా కఠోర సాధన చేసింది. ఈ షోలో పన్నెండుమంది డ్యాన్సర్‌లు పోటీపడగా, ఆరుగురు ఫైనల్స్ కు చేరుకున్నారు. వర్ష అందర్నీ ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. సిమెంటు, ఇటుకలు మోసిన ఆమె నేడు సూపర్ మామ్స్ ట్రోఫీని మోసుకురావడంతో ఆమె గురించి తెలిసిన హర్యాణావాసులు బ్యాండు మేళాలతో ఘనస్వాగతం పలుకుతున్నారు.



వర్షా బుమ్రా





లక్ష సంపాదిస్తానని కలలో కూడా అనుకోలేదు

"జీవితంలో లక్షరూపాయలు సంపాదిస్తానని ఎప్పుడూ కలలో కూడా అనుకోలేదు. కానీ డ్యాన్స్ సాధన చేయడం వల్ల ఈరోజు నేను ఇన్ని లక్షల రూపాయలు గెలుచుకోగలిగాను. ఇలాంటి షోల వద్ద సెక్యూరిటీ గార్డులతో కనీసం మాట్లాడే అర్హత కూడా లేని నేను నాకొడుకుకు మంచి జీవితం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకోగలిగాను. నేను పడ్డ కష్టాలు మా అబ్బాయి పడకూడదు. వాడికి మంచి జీవితం ఇవ్వాలన్న లక్ష్యంతో సాధన చేసాను. అదే ఈరోజు నన్ను ఈ టైటిల్ విన్నర్‌గా నిలబెట్టింది. షోకు వచ్చిన అతిథులు సైతం నా కొడుకు చదువుకయ్యే ఖర్చుని భరిస్తామని చెప్పడం చాలా పెద్ద విషయం. ఇప్పటిదాకా మాకంటు సొంత ఇల్లు లేదు. వచ్చిన మొత్తంలో కొంత వెచ్చించి చిన్న ఇల్లు కొనుక్కుంటాను" అని వర్ష ఆనందం వ్యక్తం చేసింది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 191

శనివారం 1-10-2022

'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అపోహ- వాస్తవం

సొరకాయ జలుబు చేస్తుందని చాలామంది తినరు. కాని అది వట్టి అపోహ మాత్రమే. ఇది జలుబుతో పాటు, కఫాన్ని కూడా తగ్గిస్తుంది. ● సొరకాయలో ఒంటికి చలువ చేసే గుణం ఉంది. ● కడుపులో మంటని, అతి దాహాన్ని సొరకాయ తగ్గిస్తుంది. ● అరికాళ్ళు పగిలినచోట సొరకాయగుజ్జును రాసి మృదువుగా మర్దన చేస్తే ఉపశమనం కలుగుతుంది. ● సొరకాయ ముక్కలను తింటే దగ్గు రాకుండా, కఫం లేకుండా చేస్తుంది.

కాళ్లూ చేతులూ తిమ్మిర్లా?

నరాల బలహీనత కావచ్చు!

కాళ్లూ చేతులు తిమ్మిర్లు రావడం, ఒక్కొక్కసారి కాళ్ళు చేతులు ఎత్తలేకపోవడం, పట్టేసినట్టుగా ఉండడం, చేతులలో ఒక్కొక్కసారి వణుకు వస్తుంటుంది. ఇది నరాల బలహీనతకు సంకేతం. ఇంతకూ నరాల బలహీనత ఎందుకు వస్తుందో, రాకుండా ఏం చేయాలో చూద్దాం...

● నరాల బలహీనత అనేది ఒత్తిడి కారణంగా, పని మీద శ్రద్ధ లేకపోయినా ఒత్తిడి వల్ల చెయ్యడం వంటి కారణాల వల్ల వస్తుంది. ● ముఖ్యంగా చెప్పాలంటే నరాలలో రక్తం సరిగ్గా సరఫరా కాకపోవడం, మెదడులోనూ, వెన్నెముకలోనూ రక్త సరఫరా తగ్గిపోవడం, కుంగుబాటు వల్ల నరాల బలహీనత వస్తుంది. ● వ్యాయామం చేయడం, సరైన పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ఇలాంటివి చెయ్యాలి. పోషకాలు ఎక్కువగా ఉన్న కూరలు తీసుకోవాలి. ● అలాగే మాంసాహారం తినని వాళ్ళు పప్పు దినుసులు పనీర్ లాంటివి తీసుకోవడం మంచిది. ● మద్యపానానికి దూరంగా ఉండాలి. ● ముఖ్యంగా ఖాళీగా కూర్చోకుండా ఏదో ఒక పని కల్పించుకుని చెయ్యడం అవసరం.



● 6 నుంచి 8 గంటలు నిద్రపోవడం, వ్యాయామం చెయ్యడం. ● సరైన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన నరాల బలహీనతను మందులు వాడకుండా మొదట్లోనే నివారించుకోవచ్చు. ● 'అతి సర్వత్ర వర్జయేత్' అనే సూత్రాన్ని పాటించాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలి. సమస్య శ్రుతి మించుతున్నట్లు అనిపిస్తే వైద్యుణ్ణి సంప్రదించడం ఉత్తమం.

హెల్త్ టిప్



మొటిమలను తగ్గించుకోవాలంటే.. కొబ్బరి నూనెలో ఆవాలు వేయించి చల్లారిన తర్వాత ఆ నూనెను వడగట్టి రాత్రి నిద్ర పోవడానికి ముందు నీటితో ఈ నూనెను కలిపి ముఖానికి పట్టించి ఉదయాన్నే కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఆవాల నుంచి తీసిన నూనెలో విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తుంది. ఇది జుట్టు బాగా పెరగడానికి దోహదం చేస్తుంది. అంతేకాదు, చుండ్రు నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. కానీ ఆవాలను మోతాదుకు మించి ఒకేసారిగా ఎక్కువగా వాడితే టాక్సిక్ కారణంగా ఇబ్బందులు తప్పవని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.





తన కోపమె తన మిత్రుడు!

ప్రేమ, అభిమానం, ఈర్ష్య, ద్వేషం లాగే కోపం కూడా ఓ సహజ, సహజాత ఉద్వేగం. యాంగర్ మేనేజ్ మెంట్ అని దాన్ని చంపుకోవడం కంటే... ఎలా ఛానలైజ్ చేస్తే, దాన్నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందవచ్చో తెలుసుకుంటే మంచిదంటున్నారు మానసికవేత్తలూ, ప్రవర్తన శాస్త్రవేత్తలు. నిజానికి కోపం అన్నది పట్టుదలకు మొదటిమెట్టు. భయం ప్రాణరక్షణకు ఉపయోగపడినట్టే... కోపం పట్టుదలకు కారణమై, ఎట్టకేలకు సక్సెస్‌ను సాధించి పెడుతుంది. అంటారు సైకాలజిస్టులు. అదెలాగో చూద్దాం.

చాణక్యుడి చతురత మొదలుకొని, ఫ్రెంచి విప్లవం వరకు తొలి దశలోని కోపం... తొలుత పట్టుదలగా మారి... తర్వాత వివేచనతో కూడిన వ్యూహం వల్ల మంచి ఫలితాలను ఇచ్చిన సంగతి చరిత్ర చూసిందే. ఇక్కడ ఓ మంచి మార్పు కోసం ప్రజలు తమ యాంగర్‌ను మోటివేటింగ్ అంశంగా చేసుకున్నారన్నది మానసిక విశేషజ్ఞుల విశ్లేషణ. ఎప్పటి చాణక్యాలో, మరెక్కడి ఫ్రెంచి విప్లవాలో కాదు... ఉప్పు సత్యాగ్రహాలూ, దండి యాత్రలతో మన స్వాతంత్ర్యం కూడా ఈ శతాబ్దపు మన ఆగ్రహ విజయ ఫలితమే. 'ఆగ్రహం నుంచి ఆనందానికి దారి తీసే మంచి దారే మన కోపం' అని చెబుతున్న ఓ సైకాలజిస్ట్... ఆగ్రహం ప్రభావాన్ని ఇలా వివరిస్తున్నాడు. ''కోపం మొదట మనసుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రేరేపించి స్ఫూర్తిని పుట్టిస్తుంది. పట్టుదల పెంచి విజయం సాధింపజేస్తుంది. చివరగా సంతోషాన్నిస్తుంది. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే యాంగర్ క్రియేట్స్ ఇంపాక్ట్. ఇట్ మొబిలైజెస్, లీడ్స్ టు విక్టరీ దేర్ బై గివ్స్ హ్యాపీనెస్''.

ఆశావహ దృక్పథానికి ఆగ్రహమే మార్గం... 'యాంగ్రీ పీపుల్ ఆర్ ఆప్టిమిస్టిక్' అన్నది మనోవిశ్లేషకుల మరో మాట. నలుగురు స్టుడెంట్స్ ఒకే రూమ్‌లో చదువుకుంటూ ఉండేవారు. వాళ్లలో ఒకడికి ఓ రేంజ్ మంచి ర్యాంకే వచ్చింది. ఆ ర్యాంకుకు ఆనందించిన ఆ తండ్రి, కొడుక్కి అదే రాష్ట్రంలో సీట్ వచ్చే అవకాశం లేకపోయినా... పక్కరాష్ట్రంలోని ఓ మోస్తరు మంచి కాలేజీలో మెడిసిన్‌లో చేర్పించాడు. దాంతో తమ మీద తమకే కోపం వచ్చిన ఆ ముగ్గురూ... లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేరారు. బాగా చదివారు. దాంతో ఆ ముగ్గురూ సొంతరాష్ట్రంలోనే ఫ్రీ సీట్ సాధించారు. కాస్త ధనవంతుడైన తండ్రికి పుట్టిన మొదట సీటు సాధించిన మిత్రుడి కంటే... తమ కోపం కారణంగా ఇంకా మంచి కాలేజీల్లో, ఇంకా కాస్త చవకగా చదువుకుంటున్నారా మిగతా ముగ్గురు మిత్రులు.

అనేక విజయ వ్యూహాలకు కోపమే కీలకం... కోపాన్ని ఓ ప్రతికూల ఉద్వేగంగా భావిస్తారు. కానీ విజయం సాధించాలనే పట్టుదలకు కావాల్సిన వ్యూహాలను ఆలోచించేలా చేస్తుంది ఆగ్రహం. అయితే కత్తికి లాగే కోపానికీ రెండు అంచులుంటాయి. వివేకం కోల్పోయిన క్రోధం... పన్నాగాలకు దిగుతుంది. వివేచనతో కూడిన కోపం వ్యూహాలతో విజయాలందిస్తుంది. ఉగ్రతకు ఆస్కారమివ్వకుండా ఆగ్రహాన్ని జాగ్రత్తగా ఛానెలైజ్ చేసుకుని గెలుపెలా సాధించాలో తెలుస్తుంది.

తనలోకి తాను చూసుకునేందుకు ఓ సాధనం: తనలోకి తాను తొంగి చూసుకుని, అంతర్మథనంతో, ఆత్మపరిశీలనకు తావిచ్చేది కూడా కోపమే అంటారు జెరెమీ డీన్ అనే సైకాలజీ స్కాలర్. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్ నుంచి డాక్టరేట్ పొందిన ఆయన ''మేకింగ్ హ్యాబిట్స్, బ్రేకింగ్ హ్యాబిట్స్'' అనే పుస్తకం రాశారు. మానసిక అంశాలపై బ్లాగ్ కూడా నిర్వహిస్తుంటారు. ఓ సంఘటన మనలో కోపానికి కారణమైందనుకోండి. అప్పుడు మన ఆగ్రహం సహేతుకమైనదేనా?, మన చేతగానితనం వల్ల కోపం వచ్చిందా?... ఇలా ఆత్మపరిశీలన చేసుకోవడం మానసిక ఔన్నత్యానికీ కారణమవుతుందంటారాయన.

మరి అంతా మంచేనా... ఇలా చూసుకున్నప్పుడు ఆగ్రహం వల్ల అంతా మంచే జరుగుతుందా? చెడు జరగదా అంటే... కోపం వల్ల చెరుపు జరిగే అవకాశమూ ఉంది. అయితే ఆగ్రహంతో కూడిన ఉన్మాద స్థితిలో మంచికీ, చెడుకూ మధ్య తేడా గుర్తించలేనంత వివేచన కోల్పోయినప్పుడు మాత్రమే ఆగ్రహం వల్ల అనర్థం జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు మానసికవేత్తలు. అందువల్ల వివేచన కోల్పోనంత వరకు కోపం కూడా మిత్రుడే!

లైఫ్@360

సాధారణంగా చాలామంది స్త్రీలు ముఖ్యంగా గృహిణులు కుటుంబ సభ్యులందరి ఆరోగ్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ తమ గురించి తాము ఏమాత్రం పట్టించుకోరు. ఫలితంగా నిండా నాలుగు పదులు కూడా రాకుండానే వయసు మీద పడ్డట్టు కనిపిస్తారు. అయితే కొన్ని రకాల పదార్థాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అందంగా... ఆరోగ్యంగా.. ఉన్న వయసు కంటే తక్కువగా కూడా కనిపిస్తారు. అవేంటో తెలుసుకుందాం..

ఇవి తినండి... వయసు తగ్గించుకోండి


పాలు: స్త్రీలు పాలు తాగడం ఎంతో మంచిది. ఎందుకంటే పాలలో ప్రోటీన్ ఎక్కువ మొత్తంలో ఉంటుంది. అయితే కొవ్వు శాతం తక్కువగా ఉండే పాలనే తాగాలి. పాలలో ఎముకలను బలంగా ఉంచే కాల్షియం, విటమిన్ డి, విటమిన్ సి లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి.

పెరుగు: కొవ్వు తక్కువగా ఉండే పెరుగు స్త్రీలకు ఎంతో హితకరమైనది. ఈ రకమైన పెరుగును తినడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలతో బాధ పడేవారికి పెరుగు ఔషధంలా పనిచేస్తుంది. స్త్రీలకు వచ్చే కొన్ని రకాల ఇన్ఫెక్షన్లను, అల్సర్‌ను కూడా తగ్గిస్తుంది.





టొమోటాలు: స్త్రీలకు టమాటాలు ఔషధంతో సమానం. ఎందుకంటే దీనిలో పుష్కలంగా ఉండే లైకోపీన్ రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని చాలా అధ్యయనాలు నిరూపించాయి. ఇక టొమాటాల్లో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెజబ్బులను తగ్గించడానికి సహాయపడతాయి. టొమోటాలను రోజూ తినడం వల్ల ఎంత వయసు వచ్చినా యవ్వనంగానే కనిపిస్తారు. ఎందుకంటే ఇవి చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచుతాయి.



పోషకాల సోయా: పోషకాలు పుష్కలంగా ఉండే సోయాను తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన ఎన్నోరకాల పోషకాలు అందుతాయి. వీటిలో విటమిన్స్, ఐరన్ వంటి పోషకాలకు కొదవే ఉండదు. ఇవి అతివలను అన్ని విధాలా ఆరోగ్యంగా ఉంచుతాయి.


బలాన్నిచ్చే డ్రై ఫ్రూట్స్: రోజూ గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల శరీరానికి అవసరమైన ఎన్నోరకాల పోషకాలు అందుతాయి. అందుకే వీటిని స్త్రీలు తప్పకుండా తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిలో విటమిన్ బి12, విటమిన్ ఇ ఎక్కువ మొత్తంలో ఉంటాయి. రోజూ డ్రై ఫ్రూట్స్‌ను తింటే బలంగా ఉంటారు.

క్యాన్సర్‌ను అడ్డుకునే బెర్రీలు: బ్లూబెర్రీలు, బ్లాక్ బెర్రీలు, రాస్ బెర్రీలు, స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలను రోజూ తింటే మీరు ఎలాంటి రోగాల బారిన పడే అవకాశమే రాదంటారు నిపుణులు. ఎందుకంటే వీటిలో ఎన్నో రకాల పోషకాలుంటాయి. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల పెద్దపేగు క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. ఎందుకంటే వీటిలో క్యాన్సర్‌తో పోరాడే ఔషధ గుణాలుంటాయి.

చూశారుగా... ఎక్కువ వయసు ఉన్నవారిలా కనిపిస్తున్నామని బాధపడకుండా పైన చెప్పుకున్న వాటిని రోజువారీ తీసుకుంటూ అందంగా.. ఆరోగ్యంగా... యవ్వనంగా కనిపించేందుకు ప్రయత్నించడం మంచిది కదా!



సినిమా



● ప్రభాస్

విల్లు ఎక్కుపెట్టి...

ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వంలో టీ సిరీస్, రెట్రో ఫైల్స్ సంస్థలు నిర్మించిన ఈ సినిమాకు యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ భాగస్వాములు. జనవరి 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీరాముడిగా ఆకాశం వైపు బాణం ఎక్కుపెట్టిన ప్రభాస్ లుక్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ఓం రౌత్ స్పందిస్తూ– ''శ్రీరాముడు జన్మించిన ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్యలో అక్టోబర్ 2న సాయంత్రం 7.11 నిమిషాలకు 'ఆదిపురుష్' టీజర్ విడుదల వేడుక జరగనుంది. మీరూ (అభిమానులు) భాగమయ్యేందుకు అయోధ్యకు విచ్చేయండి'' అన్నారు. రామాయణ ఇతిహాస నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సీతగా కృతీ సనన్, రావణాసురుడిగా సైఫ్ అలీఖాన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్ కీలక పాత్రలు చేశారు.

నా కల తీరింది

– డైరెక్టర్ వీవీ రుషిక



● రుషిక, రామ్ అగ్నివేష్

''ఇక్షు' సినిమాలో మా అబ్బాయి రామ్ అగ్ని వేష్‌ను డైరెక్ట్ చేయడం హ్యాపీగా ఉంది. చాలా మంది నాకు ఫోన్ చేసి, 'రామ్ బాగా నటించాడు' అంటుంటే నటుడిగా నిరూపించుకున్నాడనిపిస్తోంది. ఈ సినిమాతో నా కల తీరింది'' అన్నారు వీవీ రుషిక. రామ్ అగ్నివేష్ హీరోగా నటించిన చిత్రం 'ఇక్షు'. గౌతమ్ నాయుడు సమర్పణలో హన్మంత్‌రావు నాయుడు నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 9న విడుదలైంది. డైరెక్టర్ వీవీ రుషిక మాట్లాడుతూ– ''మా సినిమా ఇప్పటికీ థియేటర్స్‌లో ప్రదర్శింపబడుతుండటం హ్యాపీ'' అన్నారు. చిత్రవిజయం పట్ల హన్మంత్ రావు, రామ్ అగ్నివేష్ ఆనందం వ్యక్తం చేశారు.



● సునీల్ నారంగ్, జాన్వీ, నాగార్జున, సోనాల్, ప్రవీణ్ సత్తారు, అదిత్ మరార్

నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయి – నాగార్జున

'ది ఘోస్ట్' చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా గొప్ప నిర్మాణ విలువలతో, ఒక కసితో తీశాం. ఇందులో సాంకేతిక విలువలు నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయి'' అని హీరో నాగార్జున అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో నాగార్జున, సోనాల్ చౌహాన్ జంటగా నటించిన చిత్రం 'ది ఘోస్ట్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలకానుంది. తాజాగా ఈ చిత్రం రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ– ''నారాయణ్‌దాస్ నారంగ్‌గారికి నాతో సినిమా తీయాలని కోరిక. అలా 'ది ఘోస్ట్' మొదలయింది. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది. ఈ సినిమా విడుదల కోసం చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. మా సినిమాకి బెస్ట్ విశెష్ అందించిన చిరంజీవి గారికి కృతజ్ఞతలు. 5న విడుదలవుతున్న అన్ని సినిమాలు బాగా ఆడాలి'' అన్నారు. కాగా రాజకీయాల గురించి నాగార్జున మాట్లాడుతూ– ''వచ్చే ఎన్నికల్లో నేను విజయవాడ ఎంపీగా పోటీ చేస్తాననే ప్రచారం అవాస్తవం. ఎన్నికలొస్తున్న ప్రతిసారీ నేను పోటీ చేస్తాననే ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం నేను రాజకీయాలకు దూరంగా ఉన్నాను.. ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయను. అయితే మంచి కథ వస్తే పొలిటికల్ లీడర్‌గా నటిస్తాను'' అన్నారు. ''ది ఘోస్ట్'తో నాగార్జునగారు ఒక యాక్షన్ విజువల్ ఫీస్ట్‌ని ఇవ్వబోతున్నారు. ఫైనల్ కాపీ చూసి మేము ఎంత ఎగ్జయిట్ అయ్యామో, సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా అదే అనుభూతికి లోనవుతారు'' అన్నారు ప్రవీణ్ సత్తారు.

● దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న ఆశా పారేఖ్
● ఉత్తమ నటులు సూర్య, అజయ్ దేవగన్
● 'సూరరై పోట్రు' సినిమాకు ఐదు అవార్డులు

పుట్టినరోజుకి ముందు అవార్డు అందుకున్నాను

– నటి ఆశా పారేఖ్



● రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆశా పారేక్, అజయ్ దేవగన్, సుధ, తమన్ ● కుమారుడు దేవ్, కుమార్తె దియాలతో జ్యోతిక, సూర్య

68వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం ఢిల్లీలో జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ అవార్డులను ప్రదానం చేశారు. 2020కి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును నటి ఆశా పారేఖ్ అందుకున్నారు.

''నా 80వ పుట్టినరోజుకు ముందు ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది'' అన్నారు ఆశా పారేఖ్.

జాతీయ ఉత్తమ నటులుగా సూర్య ('సూరరై పోట్రు'), అజయ్ దేవగన్ (తన్హాజీ) అవార్డులు అందుకున్నారు. తమిళ 'సూరరై పోట్రు' ఉత్తమ సినిమా అవార్డుతో పాటు ఐదు అవార్డులు గెలుచుకుంది. ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డును ఈ చిత్రదర్శకురాలు సుధ కొంగర, బెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అవార్డును జీవీ ప్రకాష్ కుమార్, ఉత్తమ నటిగా అపర్ణా బాలమురళి అవార్డులు అందుకున్నారు. 'అల వైకుంఠపురములో..'కి గాను జాతీయ ఉత్తమ సంగీతదర్శకుడిగా ఎస్ఎస్ తమన్, బెస్ట్ తెలుగు ఫిలిం 'కలర్ ఫొటో'కు దర్శకుడు అంగిరేకుల సందీప్ రాజు, నిర్మాత సాయి రాజేశ్ అవార్డులు అందుకున్నారు. 'నాట్యం' సినిమాకు బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డును నటి సంధ్యారాజు, బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ అవార్డును రాంబాబు అందుకున్నారు.



● అపర్ణ, సంధ్యా రాజు, రాంబాబు, సాయి రాజేష్, సందీప్ రాజు

● సినీ రంగంలో ప్రస్తుతం సృజనాత్మకతకు స్వేచ్ఛ ఉంది. సినీ నిర్మాణం, కథా రచయితలు సినిమాను చూసే విధానానికి ఇది స్వర్ణ యుగంలాంటిది.
– సుధ కొంగర

● 'అల వైకుంఠపురములో..' అనుకున్న మొదటి రోజు నుంచి త్రివిక్రమ్, బన్నీ (అల్లు అర్జున్) ఇచ్చిన ఎనర్జీ వల్లే ఈ అవార్డు సాధ్యమైంది. ఈరోజు ఇక్కడ అవార్డు అందుకోవడం గ్రేట్‌గా అనిపిస్తోంది. ఇదంతా దేవుడి దయ.
– ఎస్.ఎస్. తమన్

● వర్ణ వివక్ష గురించి తీసిన మా 'కలర్ ఫొటో'కు అవార్డు రావడం ఆనందంగా ఉంది. కోవిడ్ వల్ల థియేటర్లలో సినిమా విడుదల చేయలేదు. ఆ బాధ ఈ జాతీయ అవార్డు రావడంతో పోయింది.
– నీలం సాయి రాజేష్

● ప్రతీ మూడు నెలలకోసారి మా సినిమాకు ఏదో ఒక రూపంలో అవార్డులు రావడం హ్యాపీగా ఉంది.
– సందీప్ రాజు

● లాక్‌డౌన్ కారణంగా రెండేళ్ల సినిమా కోసం కష్టపడ్డాం. మా కష్టానికి తగ్గ ఫలితం దక్కింది.
– రాంబాబు

– సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ



● తిరువీర్, సంగీత

హారర్.. థ్రిల్

'మళ్లీ రావా', 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' వంటి హిట్ చిత్రాల తర్వాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ మూడో చిత్రంగా 'మసూద'ని నిర్మిస్తోంది. సంగీత, తిరువీర్ ముఖ్య తారలుగా సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. నవంబర్ 11న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా రాహుల్ యాదవ్ మాట్లాడుతూ– ''మా బేనర్ నుంచి వచ్చిన తొలి చిత్రం 'మళ్ళీ రావా' లవ్‌స్టోరీ, రెండో సినిమా 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' మంచి డిటెక్టివ్ థ్రిల్లర్. ఇప్పుడు నిర్మిస్తున్న 'మసూద' హారర్ డ్రామాతో సాగుతుంది. ఇప్పటివరకూ వచ్చిన మంచి హారర్ చిత్రాల్లో 'మసూద' ఒకటిగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళంలో ఒకేసారి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. కావ్య కల్యాణ్ రామ్, శుభలేఖ సుధాకర్, అఖిలా రామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ ఆర్. విహారి, కెమెరా: నగేష్ బానెల్.

వర్క్ షాప్‌లో...



● పవన్ కల్యాణ్


పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీర మల్లు'. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ హీరోయిన్. ఏయమ్ రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా తర్వాతి షెడ్యూల్‌లో పాల్గొనే ప్రధాన నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్వహిస్తున్న ప్రీ షెడ్యూల్ వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ''వర్క్‌షాప్ ముగిశాక ఈ నెల రెండో వారం తర్వాత నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ వర్క్‌షాప్‌లో పవన్ కల్యాణ్, నిధీ, సునీల్, సుబ్బరాజు, రఘుబాబు, ఏయమ్ రత్నం, ఎ. దయాకర్ రావు, సంగీత దర్శకుడు కీరవాణి, కెమెరామేన్ వీఎస్ జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొంటున్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ



● డాలీ ధనంజయ, సత్యదేవ్


సత్యదేవ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం షురూ అయింది. ఈ చిత్రానికి ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. 'పుష్ప'తో తెలుగులో గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటుడు డాలీ ధనంజయ ఓ ప్రధాన పాత్ర చేస్తున్నారు. బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ''క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న మల్టీస్టారర్ చిత్రమిది. సత్యదేవ్, ధనంజయల కెరీర్‌లో ఈ సినిమా ఇరవై ఆరవది కావడం విశేషం. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మణికంఠన్ కృష్ణమాచారి, సంగీతం: చరణ్ రాజ్.



● కిరీటి

జూనియర్ ప్రేమ

కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయమవుతున్నారు. రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. జెనీలియా, డాక్టర్ రవిచంద్ర .వి ముఖ్య పాత్రలు చేస్తున్నారు. సాయి కొర్రపాటి నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం కిరీటి రెడ్డి పుట్టినరోజుని పురస్కరించుకుని, ఈ చిత్రానికి 'జూనియర్' అనే టైటిల్ ఖరారు చేసి, గ్లింప్స్ విడుదల చేశారు. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. కిరీటిని పరిచయం చేస్తూ గతంలో విడుదల చేసిన గ్లింప్స్‌కి మంచి స్పందన వస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేకే సెంథిల్ కుమార్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 191

శనివారం 1-10-2022



ఫేవరెట్‌గా భారత్

నేటి నుంచి మహిళల ఆసియా కప్ టోర్నీ
శ్రీలంకతో తలపడనున్న భారత్ -IVలో



5జీ.. నేడే షురూ!


భారత్‌లో నేడు 5జీ సేవలను
ప్రారంభించనున్న ప్రధాని మోదీ -IVలో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




యాత్ర తప్ప మాకు మార్గం లేదు

ప్రతిపక్షాల గొంతును అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుండటంతో తమకు పాద యాత్ర తప్పలేదని రాహుల్‌గాంధీ అన్నారు.
వివరాలు 6లో



దేశ భవితను తీర్చిదిద్దేది నగరాలే

దేశ భవిష్యత్‌ను నగరాలే తీర్చుదిద్దుతాయని ప్రధాని మోదీ అన్నారు. గాంధీనగర్‌- ముంబై సెమీ హైస్పీడ్ రైలును ఆయన ప్రారంభించారు.
వివరాలు 6లో



కాంగ్రెస్ అధ్యక్ష బరిలో ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక ఊహించని మలుపు తిరిగింది. దక్షిణాది నాయకుడైన మల్లికార్జున ఖర్గే వైపు అధిష్టానం మొగ్గు చూపుతోంది.
వివరాలు 6లో



విద్యాసంస్థపై ఆత్మాహుతి దాడి

ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో ఓ విద్యా సంస్థలో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో 19మంది మృతి చెందారు.
వివరాలు 6లో

న్యూస్‌రీల్

సర్వభూపాల వాహనంపై శ్రీనివాసుడు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమలలో మలయప్పస్వామి వారు ఉదయం కల్ప వృక్ష వాహనంపై, రాత్రి సర్వ భూపాల వాహనంపై ఊరేగారు. విజయవాడ ఇంద్ర కీలాద్రిపై దుర్గమ్మ వారు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.
వివరాలు 10లో ▸

గ్రూప్‌-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రాష్ట్రంలో గ్రూప్‌- 1 కేడర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే నోటిఫికేషన్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించింది.
వివరాలు 9లో ▸

చదువుకు సరి 'జోడు'

ఇటు బాల్య వివాహాల నిరోధం.. అటు విద్యకు ప్రోత్సాహం

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాతో జంట లాభాలు
- పథకం పొందాలంటే వధూవరులు కచ్చితంగా టెన్త్ పాస్ కావాలి.. ఈ నిబంధనతో పిల్లలను కచ్చితంగా పదో తరగతి చదివిస్తారు
- యువతుల కనీస వయసు 18 ఏళ్లు కాబట్టి ఇంటర్ కూడా పూర్తవుతుంది.. ఈతరం కోసమే కాదు.. దూరదృష్టితో ఈ పథకాలను తెచ్చాం
- గత సర్కారు పెళ్లి కానుకంటూ ఎన్నికల కోణంలో తెచ్చి ఎగ్గొట్టింది
- ఇప్పుడు పారదర్శకంగా రెట్టింపు ప్రోత్సాహకాలు
- చదువులకు లింక్ చేయడంతో విద్యాభ్యాసానికి ఊతం
- చదువులు తరగని ఆస్తి.. పేదరికాన్ని జయించేది విద్యే
- రెండు పథకాలను ప్రారంభించి వెబ్ సైట్ ఆవిష్కరించిన సీఎం జగన్
- నేటి నుంచి సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం


వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా వెబ్‌సైట్లను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పిల్లల చదువులను ప్రోత్సహించడం–బాల్య వివాహాల నిరోధం లక్ష్యంగా వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను ప్రవేశపెట్టి మరో విప్లవాత్మక అడుగు వేశామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మిక కుటుంబాల్లో పేద యువతుల వివాహాలకు ఆర్థిక సాయం అందించే 'వైఎస్సార్ కళ్యాణ మస్తు' పథకంతోపాటు ముస్లిం మైనారిటీ యువతుల కోసం 'వైఎస్సార్ షాదీ తోఫా'ను సీఎం శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. 2 పథకాల వెబ్ సైట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆ వివరాలివీ..

పేదరికాన్ని గట్టెక్కించే అస్త్రం

పిల్లలంతా కచ్చితంగా చదువుకోవాలని అడుగులు వేస్తూ మూడేళ్లుగా విద్యారంగంపై

మిగతా 2వ పేజీలో ▶

ఆరోగ్య సేవలకు రూ.3,200 కోట్లు

- 3,254కి పెరగనున్న చికిత్సల సంఖ్య: సీఎం జగన్
- ఆస్పత్రుల్లో తగినంత మంది వైద్య సిబ్బంది ఉండేలా ప్రతి నెలా ఆడిట్.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైట్ చార్జీ రూ.100
- కొత్త వైద్య కళాశాలల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

2లో

రుణాలు మరింత భారం!

- ఆర్‌బీఐ రెపో రేటు మరో 50 బేసిస్ పాయింట్లు అప్
- 5.9 శాతానికి కీలక రేటు; మూడేళ్ల గరిష్టం.. మే తర్వాత వరుసగా నాలుగో వడ్డింపు



-IVలో

■ ధరలను చల్లార్చడమే లక్ష్యంగా ఆర్‌బీఐ మరోసారి వడ్డీరేట్ల కొరడా ఝుళిపించింది. కీలక వడ్డీరేటు అయిన రెపోను మరో అర శాతం పెంచడమే కాకుండా, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు.. అవసరమైతే మరిన్ని రేట్ల పెంపులు ఉండొచ్చన్న సంకేతాలూ ఇచ్చింది. ఆర్‌బీఐ పాలసీ నిర్ణయం వెలువడిన వెంటనే.. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బీవోఐ, హెచ్‌డీఎఫ్‌సీ రుణ రేటును అర శాతం పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఇతర బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సైతం ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది. ఇప్పటికే రెక్కలొచ్చిన రుణ రేట్లు మరింత రివ్వున దూసుకెళ్లనున్నాయి. గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్.. ఇలా అన్ని రకాల రుణాలపైనా ఈఎంఐలు భారం కానున్నాయి.

నేటి నుంచి విశాఖలో
ఇన్ఫోసిస్ సేవలు



- తొలి దశలో 1,000 మందికి ఉపాధి
- జనవరి నుంచి పూర్తిస్థాయిలో పని
- ఇన్ఫోసిస్ రాక.. విశాఖ అభివృద్ధికి సంకేతం
- మీడియాతో మంత్రి అమర్‌నాథ్

9లో

హరీష్..మీరు ఎవరి మనిషి?

- మీ మేనమామ కేసీఆర్‌తో ఏదైనా గొడవ ఉంటే మీరిద్దరూ చూసుకోండి
- మా రాష్ట్రానికి నీతులు, సూచనలు చెప్పాల్సిన అవసరం లేదు

తీరు మార్చుకోని తెలంగాణ జెన్‌కో

- శ్రీశైలం, సాగర్‌లలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి.. శ్రీశైలంలో 884.4 నుంచి 881.3 అడుగులకు తగ్గిన నీటి మట్టం
- సాగర్ ఎడమ కాలువ కింద నీటి అవసరాలు లేకున్నా విద్యుదుత్పత్తి
- వృథాగా సముద్రంలోకి కృష్ణా జలాలు
- తక్షణమే విద్యుదుత్పత్తి నిలిపి వేయించాలని కృష్ణా బోర్డుకు ఏపీ లేఖ
- లేదంటే సీజన్ చివర్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులొస్తాయని ఆందోళన
- సాగునీటికే ప్రథమ ప్రాధాన్యమన్న బోర్డు సమావేశం నిర్ణయాన్ని గుర్తుచేసిన ఏపీ

2లో

క్లుప్తంగా

62.53 లక్షల మందికి రూ. 1,590.50 కోట్లు

పింఛన్ల పంపిణీకి అన్ని సచివాలయాల ఖాతాల్లో నగదు జమ

సాక్షి, అమరావతి/దేవరాపల్లి: అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 62,53, 370 మందికి ప్రభుత్వం సామాజిక పింఛన్లను పంపిణీ చేయనుంది. పింఛన్ల పంపిణీకి గాను రూ.1,590.50 కోట్ల మొత్తాన్ని ఇప్పటికే ఆయా గ్రామ వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమచేయగా.. శుక్రవారమే దాదాపు అన్ని చోట్లా సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి.. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా వలంటీర్లకు కూడా అందజేయడం పూర్తయింది. శనివారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేస్తారని గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ అధికారులు చెప్పారు. సాంకేతిక కారణాలతో ఏ ఒక్కరికీ పింఛన్ అందలేదన్న ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఐదు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాలని వలంటీర్లను ఆదేశించినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం విధానం ఏడాది పొడిగింపు

ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మద్యం విధానాన్ని యథాతథంగా మరో ఏడాది పొడిగించింది. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నిర్వహించేందుకు మరో ఏడాదిపాటు అనుమతినిచ్చింది. ఈమేరకు ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 2,934 మద్యం దుకాణాలను 2023 సెప్టెంబరు 30 వరకు కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దశలవారీగా మద్య నియంత్రణ అమలు చేస్తోంది. అందులో భాగంగా అప్పటివరకు ఉన్న బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించింది. ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూమ్‌ల అనుమతులు రద్దుచేసింది. మద్యం దుకాణాలను పూర్తిగా ప్రభుత్వమే నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మద్యం దుకాణాలసంఖ్యను 33 శాతం ఇప్పటికే తగ్గించింది. 2021–22లో నిర్వహించిన మద్యం దుకాణాలనే 2022–23లో కూడా కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. తిరుపతిలోని రైల్వే స్టేషన్ నుంచి అలిపిరి రోడ్డులో మద్యం దుకాణాలకు అనుమతిలేదని స్పష్టంచేసింది.

ఏకపక్ష నిర్ణయం కాదు..

- కేంద్రం మార్గదర్శకాల మేరకే ఆర్‌పీవోను ప్రకటించాం
- ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి

సాక్షి, అమరావతి: వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించాలనే లక్ష్యంతో సౌర, పవన, జల విద్యుత్ వాడకంపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు చేసిన దిశానిర్దేశం ప్రకారమే రాష్ట్రంలో డిస్కంలకు రెన్యూవబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్(ఆర్‌పీఓ) 2022ను ప్రకటించినట్టు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) తెలిపింది. రాష్ట్ర అవసరాలకు వినియోగించే విద్యుత్‌తో దాదాపు 25 శాతం విద్యుత్‌ను సౌర, పవన, జల విద్యుదుత్పత్తి నుంచే తీసుకోవాలని కేంద్రంతో పాటు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(సీఈఆర్‌సీ) ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకునే.. ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2023–2030 మధ్య 24.61 శాతం నుంచి 43.33 శాతం వరకూ ఆర్‌పీవోను పెంచుకుంటూ వెళ్లాలని కేంద్రం గత జూలైలో తెలిపింది. దీనిలో పవన విద్యుత్ ఆర్‌పీవో లక్ష్యం 0.81–6.94%, జల విద్యుత్ 0.35–2.82%, సౌరవిద్యుత్ 23.44–33.57 శాతంగా విభజించింది. ఈ లక్ష్యానికి తగ్గట్టుగా పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించలేకపోయిన రాష్ట్రాలకు యూనిట్‌కు 25 పైసల నుంచి 30 పైసల వరకూ తొలి ఏడాది జరిమానా విధించాలని కేంద్రం భావిస్తోంది. అనంతరం దానిని యూనిట్‌కు 35 పైసల నుంచి 50 పైసలకు పెంచుతామని చెప్పింది. 2030 చివరి నాటికి ఆర్‌పీవోను 43 శాతానికి పెంచుతామని కేంద్రం వెల్లడించింది. ఈ మార్గదర్శకాల ప్రకారమే ఆర్‌పీవో నిబంధనలు ప్రకటించినట్టు ఏపీఈఆర్‌సీ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తీసుకునేముందు బహిరంగ విచారణ చేపట్టలేదనేది అవాస్తవమని, తాము అన్ని వర్గాల ప్రజలు, సంస్థల అభిప్రాయాలను స్వీకరించామని వెల్లడించింది.

● తెలంగాణ

మైలవరం కాల్వకు మరమ్మతులు జరపండి

తెలంగాణకు కృష్ణా బోర్డు సూచన

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయం కింద ఏపీలోని ఆయకట్టుకు సాగునీరందించే మైలవరం బ్రాంచ్ కెనాల్‌కి సంబంధించి తెలంగాణ భూభాగంలో మరమ్మతులు జరపాలని ఏపీ నీటిపారుదలశాఖ చేసిన విజ్ఞప్తిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ నీటిపారుదలశాఖను కృష్ణానది యాజమాన్య బోర్డు సూచించింది. ఈ మేరకు బోర్డు గురువారం తెలంగాణ నీటిపారుదలశాఖకు లేఖ రాసింది. కాల్వకి 36.7 కి.మీల వద్ద ఉన్న అండర్ టన్నెల్(యూటీ)తో పాటు 37.34 కి.మీల వద్ద ఉన్న క్రాస్ రెగ్యులేటర్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఖమ్మం సీఈకి ఏపీ అధికారులు చేసిన విజ్ఞప్తిపై ఇంత వరకు చర్యలు తీసుకోలేదని, సత్వరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. లేని పక్షంలో కాల్వకింద చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించలేమని ఏపీ ఆందోళన వ్యక్తం చేసిందని లేఖలో కృష్ణా బోర్డు తెలిపింది.

శ్రీరస్తు.. శుభమస్తు.. 'కళ్యాణమస్తు'

- వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వ దీవెన
- నేటి నుంచి దరఖాస్తు ప్రక్రియ
- మార్గదర్శకాలు విడుదల
- గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఏడాదిలో నాలుగు విడతలుగా నేరుగా నగదు బదిలీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదోళ్ల ఆడ బిడ్డల కళ్యాణానికి ప్రభుత్వం నగదు దీవెనలు అందించనుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు(బీవోసీ డబ్ల్యూడబ్ల్యూబీ) కుటుంబాలకు చెందిన ఆడ బిడ్డల పెళ్లికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది.

మూడు నెలలకోసారి నగదు

పేద ఆడ బిడ్డల పెళ్లికి ఆర్థిక సాయం కోరుతూ ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రతి మూడు నెలలకోసారి(క్వార్టర్లీ) పరిశీలించి అప్పటి వరకూ నిర్ణయించిన అర్హులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పిల్లలు తమ జీవిత భాగస్వామిగా తమ కులానికి చెందిన వారిని ఎంచుకుంటే నిర్దేశిత మొత్తం, ఇతర కులాలకు చెందిన వారిని ఎంపిక చేసుకుంటే అంతకంటే అధిక పారితోషికం వస్తుంది. దివ్యాంగులకు సంబంధించి ఇద్దరూ వైకల్యం ఉన్నవారైనా, ఒక్కరే వైకల్యం ఉన్నావారైనా సరే ఆడపిల్లకు మాత్రమే నగదు ప్రోత్సాహం అందుతుంది.

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్దేశించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారులు తగిన ధ్రువపత్రాలు, వివరాలు తీసుకెళితే.. డిజిటల్ అసిస్టెంట్(డీఏ)/వార్డు వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ(డబ్ల్యూడీపీఎస్)లు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేస్తారు. పెళ్లి అయిన 60 రోజుల్లోపు నవశకం లబ్దిదారుల మేనేజ్‌మెంట్ పోర్టల్ http://gsws-nbm.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పలు దశల్లో అధికారులు పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయిలోనూ విచారించి అర్హులను నిర్ధారిస్తారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వధువు వయస్సు 18 ఏళ్లు నిండాలి

ప్రభుత్వ నగదు ప్రోత్సాహం పొందే వివాహాల్లో వధువుకు 18 ఏళ్లు, వరుడుకి 21 ఏళ్లు వయస్సు నిండాలి. కనీసం పదో తరగతి పాస్ అయ్యి ఉండాలి. ఆడపిల్లకు మొదటి పెళ్లికి మాత్రమే నగదు ప్రోత్సాహం అందుతుంది. భర్త చనిపోయిన సందర్భంలో వితంతువుకు మినహాయింపునిచ్చారు. గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలు నెలసరి ఆదాయం కలిగిన వారు అర్హులు. మూడెకరాల్లోపు మాగాణి, పదెకరాల మెట్ట, మాగాణి మెట్ట కలిపి 10 ఎకరాలున్న వారు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లకు చెందిన కుటుంబాలకు ఇది వర్తించదు. పారిశుధ్య కార్మిక కుటుంబాలకు మినహాయింపు ఉంది. సొంతంగా నాలుగు చక్రాల వాహనం ఉంటే ఈ పథకానికి అర్హత లేదు. ట్యాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లున్న వారికి మినహాయింపునిచ్చారు. నెలకు విద్యుత్ వినియోగం 300 యూనిట్లలోపు ఉండాలి. లబ్ధి పొందాలనుకునే కుటుంబంలో ఏ ఒక్కరూ కూడా ఆదాయ పన్ను చెల్లించేవారై ఉండకూడదు. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించిన నిర్మాణ ఆస్తి కలిగి ఉండకూడదు.

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా లబ్ధిదారులకు ఇలా..

ఎవరికి	ఎంత
ఎస్సీ	రూ.లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	రూ.1.20 లక్షలు
ఎస్టీ	రూ.లక్ష
ఎస్టీ కులాంతర వివాహం	రూ.1.20 లక్షలు
బీసీ	రూ.50 వేలు
బీసీ కులాంతర వివాహం	రూ.75 వేలు
మైనారిటీ	రూ.లక్ష
దివ్యాంగులు	రూ.1.50 లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.40 వేలు

జీవీఎంసీకి 'స్వచ్ఛతా లీగ్' అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): యువత, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించినందుకు ఇండియన్ స్వచ్ఛతా లీగ్ (ఐఎస్ఎల్)లో 'టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' పేరిట కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కి అవార్డు ప్రకటించింది. ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛ శహర్ సంవాద్ అండ్ టెక్నాలజీ ప్రదర్శన కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్ జోషి, కేంద్ర స్వచ్ఛభారత్ డైరెక్టర్ రూపామిశ్రా, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రతినిధి కౌశల్ కిషోర్ చేతుల మీదుగా జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అవార్డు అందుకున్నారు. ఆయనతో పాటు ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ జి.లక్ష్మీశ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, అదనపు కమిషనర్ సన్యాసిరావు ఉన్నారు.

పొదిలిని వరించిన అవార్డు

పొదిలి: ప్రకాశం జిల్లా పొదిలి నగర పంచాయతీ చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలకు స్వచ్ఛతా అవార్డు వరించింది. కమిషనర్ డేనియల్ జోసెఫ్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

ఆరోగ్య సేవలకు రూ.3,200 కోట్లు

3,254కి పెరగనున్న చికిత్సల సంఖ్య: సీఎం జగన్

- ఆస్పత్రుల్లో తగినంత మంది వైద్య సిబ్బంది ఉండేలా ప్రతి నెలా ఆడిట్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైట్ చార్జీ రూ.100
- కొత్త వైద్య కళాశాలల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల సంఖ్యను త్వరలో 2,446 నుంచి 3,254కు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ, అనుబంధ సేవలకు ఏటా రూ.3,200 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. గత సర్కారు హయాంతో పోలిస్తే మూడు రెట్లు అదనంగా ఖర్చు చేస్తున్నామని, ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని చెప్పారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. వైద్య శాఖలో నియామకాలు, ఆరోగ్యశ్రీలో చికిత్సల పెంపు, కొత్త వైద్య కళాశాలల నిర్మాణం సహా పలు కార్యక్రమాల్లో పురోగతిని పరిశీలించారు.

15 నుంచి ప్రారంభం!

ఆరోగ్యశ్రీలో కొత్తగా చేర్చే చికిత్సలను దాదాపు ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే కొన్ని సంప్రదింపుల దృష్ట్యా కొత్తగా చేర్చిన చికిత్సలను అందుబాటులోకి తెచ్చే కార్యక్రమాన్ని అక్టోబర్ ఐదో తేదీ నుంచి 15వ తేదీకి వాయిదా వేసినట్లు వెల్లడించారు. అదే రోజు 'ఫ్యామిలీ డాక్టర్' పైలట్ ప్రాజెక్టును కూడా ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం వచ్చే నవంబర్ నెలాఖరుకు పూర్తవుతుందని చెప్పారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ సమీర్‌శర్మ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శులు కృష్ణబాబు, ముద్దాడ రవిచంద్ర, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.గుల్జార్, వైద్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్‌రెడ్డి, సీఎఫ్‌డబ్ల్యూ నివాస్, డీఎంఈ, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, డ్రగ్ కంట్రోల్ డీజీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

ఆరోగ్యశ్రీ పథకం కోసం ఏటా రూ.2,500 కోట్లు, ఆరోగ్య ఆసరా కోసం సుమారు రూ.300 కోట్లు, 108 అంబులెన్స్‌లు, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల (ఎంఎంయూ) కోసం మరో రూ.400 కోట్లు ఖర్చు పెడుతున్నాం. మొత్తంగా ఏటా రూ.3,200 కోట్లు ఆరోగ్యశ్రీ, అనుబంధ సేవలకు వెచ్చిస్తున్నాం. వచ్చే డిసెంబర్ నాటికి 104 ఎంఎంయూ కొత్త వాహనాలు 432 అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 676 వాహనాల ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నాం. కొత్త వాహనాలతో ఎంఎంయూల సంఖ్య 1,108కి పెరుగుతుంది. వీటికి తోడు 108 అంబులెన్స్‌లు 748 ఉన్నాయి. 104, 108 వాహనాల నిర్వహణ, ఆరోగ్యశ్రీ పథకం అమలులో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మన లక్ష్యం.

12 వైద్య పరీక్షలు.. 67 రకాల మందులు

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో 12 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు 67 రకాల మందులు పుష్కలంగా అందుబాటులో ఉండాలి. కరోనా నిర్ధారణ కిట్‌లు కూడా సమకూర్చాలి.



రాష్ట్రానికి వచ్చిన అవార్డులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తదితరులు

ప్రతి నెలా ఆడిట్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మానవ వనరుల కొరత సమస్య తలెత్తడానికి వీల్లేదు. వేల సంఖ్యలో వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ చేపట్టాం. ప్రతి చోటా సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. దీనిపై ప్రతి నెలా ఆస్పత్రుల వారీగా ఆడిట్ నిర్వహించాలి. ఆడిట్ నివేదికలు ప్రతి నెలా ఉన్నతాధికారులకు చేరాలి. నివేదికలు పరిశీలించి ఎక్కడైనా ఖాళీ ఉంటే తక్షణమే వేరొకరిని నియమించాలి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు యోచన చేయాలి. జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెంపుపై చర్యలు తీసుకోవాలి.

డైట్ చార్జీలు రూ.100

ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు మంచిమెనూతో ఆహారం అందించాలి. డైట్‌చార్జీని రోజుకు రూ.100కు పెంచాలి. మంచి మెనూతో డైట్ సమకూర్చాలి.

రాష్ట్రానికి ఆరు అవార్డులు

ప్రజలకు డిజిటల్ వైద్య సేవలు అందించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం అందచేసిన అవార్డులను సమీక్ష అనంతరం సీఎం జగన్ తిలకించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో ఉత్తమ పనితీరుకు జాతీయ స్థాయిలో 10 అవార్డులు ఇవ్వగా ఆరు రాష్ట్రానికే దక్కాయని మంత్రి రజిని, అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై సంతోషం వ్యక్తం చేసిన సీఎం జగన్ వారిని అభినందించారు.

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 17 కొత్త వైద్యకళాశాలలను నిర్మిస్తున్నాం. సకాలంలో వీటి నిర్మాణాలు పూర్తయ్యేలా దృష్టి సారించాలి.

చదువుకు సరి'జోడు'



వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

అత్యధిక శ్రద్ధ తీసుకున్నాం. విద్యావ్యవస్థలో గొప్ప మార్పులు తెచ్చాం. పిల్లలకు చదువులన్నవి ఒక ఆస్తి. పేదరికం నుంచి బయటపడేసే ఏకైక అస్త్రం చదువులే. ఆ దిశగా మనసా వాచా కర్మణా అడుగులు వేస్తున్నాం. పిల్లలను బడికి పంపిస్తున్న తల్లులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యాకానుకతోపాటు ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, బైజూస్‌తో ఒప్పందం చేసుకున్నాం. నాడు –నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాం. వాటి నిర్వహణ కోసం టీఎంఎఫ్ (టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్), ఎస్ఎంఎఫ్ (స్కూలు మెయింటెనెన్స్ ఫండ్) ఏర్పాటు చేశాం. పెద్ద పిల్లల చదువుల కోసం విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలు చేపట్టాం. కరిక్యులమ్‌లో మార్పులు, జాబ్ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలు తీసుకొచ్చాం.

కచ్చితంగా టెన్త్ చదివించేలా..

పిల్లలు చదువుకునేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలనే తపన, తాపత్రయంతో ఇవాళ వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రారంభిస్తున్నాం. ఈ రెండు పథకాల ద్వారా లబ్ధి పొందే పిల్లలు కచ్చితంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన విధించాం. ఇది తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా పదో తరగతి చదివించేలా దోహదం చేస్తుంది.

చదువులతో పథకాలకు లింక్

- ఇవన్నీ కూడా చదువులతో కనెక్ట్ అయిన పథకాలు. ఎందుకు ఇలా చేస్తున్నామంటే... అమ్మ ఒడి ద్వారా చదువుల బాట పట్టే పిల్లలు ఎక్కడా డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోకూడదు.
- ఈ పథకాలు అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తాయి. పెళ్లయిన 60 రోజుల్లో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వలంటీర్ల సహకారంతో సంబంధిత డాక్యుమెంట్లు, పత్రాలు సమర్పించాలి. వివాహ సర్టిఫికెట్ సచివాలయాల్లో జారీ చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అర్హులైన వారికి ప్రతి మూడు నెలలకోసారి ఈ పథకాన్ని వర్తింపచేస్తాం. అక్టోబరు, నవంబర్, డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు జనవరిలో ప్రోత్సాహకం అందుతుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి లబ్ధిదారులకు ఏప్రిల్‌లో ప్రయోజనం చేకూరుతుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి జూలైలో ప్రోత్సాహకం అందుతుంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు లబ్ధిదారులకు అక్టోబరులో ప్రోత్సాహకం అందిస్తాం. ఇలా ప్రతి మూడు నెలలకు ఒకసారి వెరిఫికేషన్ పూర్తి చేసి అర్హులకు ప్రోత్సాహకాలు అందచేస్తాం.

ఇంటర్ కూడా చదువుకునే అవకాశం

పెళ్లి నాటికి అమ్మాయి వయసు 18 ఏళ్లు, అబ్బాయి వయసు 21 సంవత్సరాలు దాటి ఉండాలి. ఇది రెండో నిబంధన. దీనివల్ల పిల్లలంతా చదువుకునే పరిస్థితి వస్తుంది. టెన్త్ పాసైన తర్వాత 18 ఏళ్ల వరకూ పెళ్లి చేసుకోలేరు కాబట్టి తదుపరి విద్యాభ్యాసంపై దృష్టి సారిస్తారు. 18 ఏళ్లు దాటకుంటే ఈ పథకాలు వర్తించవు కాబట్టి ఇంటర్ చదువుకునే అవకాశం వస్తుంది. ఇలా మార్పులు తేవడంతో పిల్లలు తప్పనిసరిగా చదివే పరిస్థితి వస్తుంది. తద్వారా గొప్ప మార్పు వస్తుంది.

దూరదృష్టితో.. ఎంతో ఆలోచనతో

తల్లిదండ్రులు విద్యావంతులైతే వారి పిల్లలకూ చదువుల విలువ తెలియచేసే పరిస్థితి ఉంటుంది. ఈ తరాల కోసం మాత్రమే కాకుండా దూరదృష్టితో, ఎంతో ఆలోచనతో ఈ పథకాలను తెచ్చాం. ప్రతి ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్ కళ్యాణమస్తుతో మంచి జరుగుతుంది. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ప్రయోజనం చేకూరుతుంది.

జంట పథకాలు.. రెట్టింపు ప్రోత్సాహకాలు

- గత ప్రభుత్వం ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు ఇస్తామని ప్రకటిస్తే.. ఇప్పుడు రూ.లక్ష ఇస్తున్నాం.
- ఎస్సీ, ఎస్టీల్లో కులాంతర వివాహాలకు గత ప్రభుత్వం రూ.75 వేలు ప్రకటిస్తే.. ఇప్పుడు రూ.1.20 లక్షలు ఇస్తున్నాం.
- గతంలో బీసీలకు రూ.30 వేలు ఇస్తామని ప్రకటిస్తే.. ఇప్పుడు మనం రూ.50 వేలు ఇస్తున్నాం. బీసీల కులాంతర వివాహాలకు నాడు రూ.50 వేలు ప్రకటిస్తే.. ఇప్పుడు రూ.75 వేలు ఇస్తున్నాం.
- మైనార్టీలకు గత ప్రభుత్వం రూ.50 వేలు ప్రకటిస్తే.. ఇప్పుడు రూ.లక్ష ఇస్తున్నాం.
- విభిన్న ప్రతిభావంతులకు గత ప్రభుత్వం రూ.లక్ష ప్రకటిస్తే.. రూ.1,50,000 ఇస్తున్నాం.
- భవన, ఇతర నిర్మాణరంగ కార్మికులకు గత సర్కారు రూ.20 వేలు ప్రకటిస్తే.. ఇప్పుడు రూ.40 వేలు ఇస్తున్నాం.

నాడు.. 17,709 మందికి రూ.68.68 కోట్లు ఎగ్గొట్టారు

గత ప్రభుత్వ హయాంలో పెళ్లికానుక అనే పథకాన్ని ప్రకటించి 2018లో నిలిపివేశారు. అది ఎన్నికల్లో ఓట్లు సాధించాలనే తాపత్రయంతో పెట్టిన పథకమే తప్ప పిల్లల చదువుల గురించి వారికి ఆలోచనే లేదు. తర్వాత పథకానికి పూర్తిగా ఎగనామం పెట్టారు. 17,709 మంది లబ్ధిదారులకు రూ.68.68 కోట్లు వివాహ ప్రోత్సాహకాలను చెల్లించకుండా ఎగ్గొట్టారు.

నేడు.. రెట్టింపు ప్రోత్సాహకాలు

ఇప్పుడు మనందరి ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఈ పథకాలు వర్తించేలా అన్ని చర్యలూ తీసుకుంది. వివక్ష, లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా అమలులో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నాయి. గత సర్కారు ప్రకటించిన దానికన్నా దాదాపు రెట్టింపు ప్రోత్సాహాలు ఇప్పుడు ఈ పథకాల ద్వారా అందుతాయి. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నాగార్జున, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనురాధ, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, సచివాలయాల శాఖ డైరెక్టర్ మోహన్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు.. ప్రభుత్వ పేస్కేల్ నేటి నుంచే

- 52వేల మంది ఆర్టీసీ సిబ్బందికి మరింత ప్రయోజనం
- ప్రభుత్వంపై ఏటా అదనపు ఆర్థికభారం రూ.360 కోట్లు
- జీతాల కోసం ప్రభుత్వం ఏడాదికి చెల్లించేది రూ.3,960 కోట్లు

సాక్షి, అమరావతి : ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) ఉద్యోగులకు నేటి (అక్టోబరు 1) నుంచి ప్రభుత్వ పే స్కేల్ ప్రకారం జీతాలు చెల్లించనున్నారు. ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేరుస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని గతంలోనే ప్రభుత్వంలో విలీనం చేశారు. ఫలితంగా ఆర్టీసీపై ఉద్యోగుల జీతాల చెల్లింపు భారం తొలగిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వ పే స్కేల్‌ను కూడా వర్తింపజేయడంతో దాదాపు 52వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు మరింత ప్రయోజనం కలగనుంది. పే స్కేల్ నిమిత్తం ఆర్టీసీ ఉద్యోగుల కేడర్‌ను కూడా ఇప్పటికే ఖరారుచేశారు.

ఇక దర్జాగా ప్రభుత్వ జీతాలు

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు ప్రతినెలా ఉద్యోగుల జీతాల చెల్లింపు కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండేది. ఆ అప్పుల మీద వడ్డీ భారమే ఏడాదికి రూ.350 కోట్లు చెల్లించాల్సి రావడంతో ఆర్టీసీ ఖర్చులు తడిసిమోపెడయ్యేవి. ఈ నేపథ్యంలో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్టీసీని 2020, జనవరి 1 నుంచి ప్రభుత్వంలో విలీనం చేసింది. అప్పటి నుంచి దాదాపు 52 వేల మంది ఉద్యోగుల జీతాలను ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇందుకు ప్రభుత్వం నెలకు రూ.300 కోట్ల చొప్పున ఏడాదికి రూ.3,600 కోట్లు వెచ్చించింది. ఇలా ఇప్పటికి రెండేళ్ల 9 నెలల్లో రూ.9,900 కోట్లను ప్రభుత్వం జీతాల కింద చెల్లించింది. ప్రభుత్వ కొత్త పే స్కేల్ ప్రకారం జీతాల చెల్లింపుతో సర్కారుపై ఏడాదికి రూ.360 కోట్ల అదనపు భారం పడుతుంది. అలాగే, మొత్తం మీద రూ.3,960 కోట్ల ఆర్థికభారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది. మరోవైపు.. ప్రభుత్వంలో సంస్థను విలీనం చేయడంతో ఆర్టీసీ ఉద్యోగులు ఇప్పటికే పలు ప్రయోజనాలూ పొందుతున్నారు.

తీరు మార్చుకోని తెలంగాణ జెన్‌కో

సాక్షి, అమరావతి : తెలంగాణ జెన్‌కో తీరు మారలేదు. కృష్ణా నదిలో వరద ప్రవాహం కనిష్ట స్థాయికి చేరింది. దిగువన సాగు, తాగు నీటి అవసరాలు లేవు. అయినా, తెలంగాణ జెన్‌కో శ్రీశైలం, సాగర్‌లలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తోంది. దాంతో శ్రీశైలం, సాగర్‌లలో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. కృష్ణా నది నికర జలాలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి. ఇదే అంశాన్ని వివరిస్తూ, తక్షణమే విద్యుదుత్పత్తిని నిలిపివేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి కృష్ణా బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్‌కు శుక్రవారం లేఖ రాశారు. లేదంటే రిజర్వాయర్లలో నీరు తగ్గిపోయి, సీజన్ చివర్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మే 27న జరిగిన బోర్డు సమావేశంలో తాగు, సాగు నీటికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యుత్తుకు కాదని తీసుకున్న నిర్ణయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇవీ..

శ్రీశైలం, సాగర్‌లలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి

- ఈ నెల 24 నాటికి శ్రీశైలం ప్రాజెక్టులో 884.4 అడుగుల్లో 213.401 టీఎంసీలు నిల్వ ఉండేవి. వరద కనిష్ట స్థాయికి చేరడంతో స్పిల్ వే గేట్లు మూసేశాం. తెలంగాణ జెన్‌కో, ఏపీ జెన్‌కోలు విద్యుదుత్పత్తిని కొనసాగిస్తూ.. దిగువకు నీటిని వదిలేస్తుండటం వల్ల గురువారం ఉదయం 6 గంటలకు శ్రీశైలంలో నీటి మట్టం 881.3 అడుగుల్లో 195.21 టీఎంసీలకు తగ్గిపోయింది. అంటే.. 18 టీఎంసీలను శ్రీశైలం నుంచి దిగువకు వదిలేశారు.
- గురువారం ఉదయం 6 గంటలకు నాగార్జునసాగర్‌లో 589.7 అడుగుల్లో 311.150 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. దిగువన ఎలాంటి తాగు, సాగునీటి అవసరాలు లేకున్నా.. తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని దిగువకు వదిలేస్తోంది. ఆ జలాలు నదిలో కలుస్తున్నాయి.
- పులిచింతల, ప్రకాశం బ్యారేజ్‌లో గరిష్ట స్థాయిలో నీటి నిల్వ ఉంది. దాంతో.. ఎగువ నుంచి విడుదల చేస్తున్న నీటిని సముద్రంలోకి వదిలేయాల్సి వస్తోంది.
- ఈ ఏడాది మే 27న జరిగిన బోర్డు సమావేశంలో దిగువన సాగు, తాగునీటి అవసరాలు ఉన్నప్పుడే.. బోర్డు అనుమతితో విద్యుదుత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ అవసరాలు లేకపోతే విద్యుదుత్పత్తి నిలిపివేయాలని నిర్ణయించారు.
- బోర్డు నిర్ణయాన్ని, విభజన చట్టాన్ని తెలంగాణ జెన్‌కో ఉల్లంఘించి యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తోంది. దాంతో కృష్ణా నికర జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయి.


Hero
అద్భుతమైన స్టైల్
అసమానమైన
టెక్నాలజీ
GLAMOUR
XTEC
LEAD THE GAME
LED
హెడ్‌ల్యాంప్
నెవిగేషన్
అసిస్ట్
సైడ్ స్టాండ్
ఇంజన్ కట్-ఆఫ్
బ్లూటూత్
కనెక్ట్
బిల్ట్-ఇన్
మొబైల్ ఛార్జర్
ఆకర్షణీయమైన పండుగ ఆఫర్లు
0% వడ్డీ రేటు
2022లో కొనండి, 2023లో చెల్లించండి
క్యాష్ బెనిఫిట్ ₹3000/- వరకు
తక్కువ డౌన్ పేమెంట్ ₹9999/-*
ఎక్స్-షోరూమ్ ధర ₹83,488/-##
WORLD'S NO.1 21 YEARS IN A ROW
70116 70116
MISSED CALL TO CONNECT 8367796950
HeroMotoCorp.com
100 MILLION
CALL TOLL-FREE 1800 266 0018
Hero GoodLife
Enroll for benefits ₹6500 T&C apply
5% EXTRA CASHBACK SBI card
*Min. Trxn.: ₹20,000; Max. Cashback on one Trxn. per card during the offer period: ₹5,000. per card. Valid only on EMI Trxn. Validity: 01 Oct - 31 Dec 2022. T&C Apply.
Wheels of Trust^^
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or call our toll-free no.: 1800 266 0018 or visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. **As per cumulative dispatch numbers till 31st January, 2021. Highest Two-wheeler sales in a year by a single corporate entity. Data source: DNA Consult Advisory and Society of Indian Automobile Manufacturers. Based on Two-Wheeler Market Reports for CY2021 published by DNA Consult Advisory; and SIAM's Auto Industry Sales figures for CY2021 ^^Based on offers from empaneled dealers on Wheels of Trust platform. Available at select dealerships. An SBI offer, subject to its exclusive T&Cs. Finance scheme is at the sole discretion of financiers & subject to its respective terms & conditions. Offer is for limited period or till stock lasts. Offers amount & combination of offers may vary for model/variant & states. For more details please visit your nearest authorised Hero outlet. Offer is in association with Hero Fincorp Ltd. T&C apply. Finance scheme is at the sole discretion of financiers & subject to its respective terms & conditions. Products are also available without the schemes/offers. ##Ex-Showroom price, Glamour XTEC (Drum Variant) in Andhra Pradesh. *T&C apply.
HeroFinCorp.
Authorized Dealers: Vijayawada: R.M HERO, Ph: 9289922430, Bhavanipuram Ph: 8790994368, Machavaram Ph: 9100066470.KANURU: SAI SWARNIKA MOTORS – 9289923145, PAYAKAPURAM Ph: 9542812341.Gudivada: Sri Lakshmi Hero, Ph: 9289922604.Guntur: Associated Hero, Ph: 9289922516. Yerramsetty Hero, Ph: 9289923812. Gautham Hero, Ph: 77997 66369. Narasaraopeta: Yerramsetty Hero, Ph: 9289922535. NEAR RTC BUS STAND – 9666406405 , Chilakaluripet : 7095270874, Macherla : 8497946696. Ongole: Associated Hero, Ph: 9289922517. Chirala: Srinivasa Hero, Ph: 9289922707. Nellore: A.M Reddy Hero, Ph: 9289922154. Sarayu Hero, Ph: 9289922630. Kavali: Sree Devi Motors, Ph: 9289923008. Gudur: Viswa Sai Hero, Ph: 9289922776.Tanaku: V. Somasundara Rao Hero, Ph: 9289922423. Eluru: Sai Swarna Hero, Ph: 9289922629. Bhimavaram: Reddy and Reddy Hero, Ph: 9289922520. Jangareddygudem: Sai Satyan Hero, Ph: 9289923017. TANGELLAMUDI: SAI SWASTHA MOTORS 9642123492, 08812-242123.Visakhapatnam: Sree Siva Sankar Hero, Ph: 9289922144. Sri Harsha Hero, Ph: 9289922149. Madhurawada: Mango motors, 9289923075. Vizianagaram: Varalakshmi Hero, Ph: 77997 66353. Anakapalli: Lakshmi Srinivasa Hero, Ph: 9289922562. Gajuwaka: Siva Sankar Hero, Ph: 9289922569. Srikakulam: Varam Hero, Ph: 9289922587. Visakhapatnam: Sree Siva Sankar Hero, Ph: 9289922144. Sri Harsha Hero, Ph: 9289922149. Vizianagaram: Varalakshmi Hero, Ph: 77997 66353. Rajahmundry: Reddy Babu Hero, Ph: 9289922157. C.P Reddy Hero, Ph: 9289922605. Kakinada: Jayaram Hero, Ph: 9289922152. Jagadeeswari Hero, Ph: 9289922641. Amalapuram: Sri Jayaram Hero, Ph: 9289922709.Anantapur: C. Thippaiah Hero, Ph: 9289922764. Narasimha Hero, Ph: 9289922753. Hindupur: Sai Teja Motors, Ph: 9289923016.Kurnool: Sasya Hero, Ph: 9289922631. Shariff Hero, Ph: 77997 66394. Nandyal: Sowjanya Hero, Ph: 9289922417.Adoni: Tarun Motors, Ph: 9289923009.Tirupati: Prudhvi Hero: 9289923060. Sri Gopal Hero, Ph: 9289922151. Sri Gopal Hero (Branch), Ph: 2261105. Chitoor: Sri Gopal Hero, Ph: 9289922160. Cuddapah: Sri Gopal Hero, Ph: 9289922158. Wings On Wheels Hero, Ph: 9289924210. Proddutur: Sri Gopal Hero, Ph: 9289922434. Madanapalle: Siddhi Hero: 9289923813.
WT.5066.2022TEL

స్వాధీనమైన మనస్సు బంధువు.
స్వాధీనంలో లేని మనస్సు శత్రువు.
– భగవద్గీత

సాక్షి

శనివారం, అక్టోబర్, 1

మహిళకు 'సుప్రీం' భరోసా

గర్భవిచ్ఛిత్తి విషయంలో మహిళకు స్వేచ్ఛనీయని సమాజం కపటత్వంలో బతుకుతున్నట్టేనని నార్వే మాజీ ప్రధాని బ్రంట్‌లాండ్ ఒక సందర్భంలో అన్నారు. అభివృద్ధి చెందిన, వర్ధమాన దేశాలన్న తేడా లేకుండా చాలా సమాజాలు స్త్రీలకు ఉండాల్సిన పునరుత్పాదక హక్కుల సంగతి వచ్చేసరికి వెనకబాటుతనాన్ని ప్రదర్శిస్తున్న వేళ గురువారం మన సర్వోన్నత న్యాయస్థానం వైద్యపరమైన గర్భవిచ్ఛిత్తి (ఎంటీపీ) చట్టాన్ని విస్తృతపరుస్తూ ఇచ్చిన తీర్పు స్వాగతించదగ్గది. సురక్షిత అబార్షన్ వారి వారి వైవాహిక స్థితిగతులతో సంబంధం లేకుండా మహిళలందరికీ ఉండే తిరుగులేని హక్కని ఈ తీర్పు తేల్చిచెప్పింది. అవాంఛిత గర్భం పొందిన సందర్భాల్లో గర్భస్రావం చేయించుకునే హక్కు వివాహితతోపాటు సహజీవన సంబంధంలో ఉండే మహిళలకు సైతం ఉంటుందని తెలిపింది. వైవాహిక సంబంధాల్లో మహిళ ఇష్టం లేకుండా లైంగిక సంపర్కంలో పాల్గొనటం అత్యాచారంగా పరిగణించాలా లేదా అనే అంశం మరో ధర్మాసనం పరిశీలనలో ఉండగానే అటువంటి సందర్భాల్లో సైతం అబార్షన్‌కు మహిళకు అవకాశమీయడం కొనియాడదగింది. 'మహిళ' నిర్వచనాన్ని కూడా విస్తృతీకరించటం ఈ తీర్పు విశిష్టత. జన్మతహా గుర్తించే జెండర్‌ని మాత్రమే పరిగణించే పద్ధతిని మార్చి 'గర్భం ధరించగల వ్యక్తులందరికీ' పునరుత్పాదక హక్కులు సమానంగా వర్తిస్తాయని తీర్పు విశదీకరించింది. ఇందువల్ల లింగనిర్ధారణ చట్రంలో ఇమడని ట్రాన్స్‌జెండర్, నాన్ బైనరీ జెండర్‌లకు సంబంధించిన వ్యక్తులకు కూడా గర్భవిచ్ఛిత్తి హక్కులు సమకూరుతాయి. 24 వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతించాలంటూ చేసుకున్న వినతిని ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ ఒక అవివాహిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ చరిత్రాత్మక తీర్పునిచ్చింది.

నైతిక విలువల మాటెలా ఉన్నా మారుతున్న సమాజ పోకడల వల్ల పెళ్లికాకుండా తల్లులవుతున్నవారి సంఖ్య గణనీయంగానే ఉంటున్నది. పర్యవసానాలు తెలియని అమాయకత్వం వల్లనో లేదా ఆప్తులనుకున్నవారి లైంగిక నేరాల వల్లనో, అపరిచిత వ్యక్తుల అఘాయిత్యాలవల్లనో బాలికలు గర్భవతులవుతున్నారు. అలాంటివారు వేరే దారిలేక నాటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇక వైవాహిక బంధానికి వెళ్లకుండా ఒంటరిగా ఉందామనుకునేవారికి సైతం ప్రస్తుత చట్ట నిబంధనలు పెద్ద ఆటంకంగా మారాయి. గర్భస్రావానికి సిద్ధపడాలో లేదో తేల్చుకోవాల్సింది సంబంధిత మహిళే తప్ప ఆమె కుటుంబం కాదని అనటం, డాక్యుమెంట్లు, న్యాయపరమైన అనుమతి అవసరమనటం సరికాదని ధర్మాసనం చెప్పటం ఎందరికో ఊరటనిస్తుంది. పితృస్వామిక భావజాల చట్రం పరిధిలోనే ప్రభుత్వాలూ, కింది కోర్టులూ ఆలోచించిన కారణంగా అవాంఛిత గర్భాలను తొలగించుకోవటం మహిళలకు కష్టంగా మారింది. 2003లో వచ్చిన ఎంటీపీ నిబంధనలు సహజీవన సంబంధంలో ఉన్న మహిళ గర్భవిచ్ఛిత్తి చేసుకోవటం విషయంలో మౌనం వహించాయి. ఢిల్లీ హైకోర్టు ఆ నిబంధనలను ప్రాతిపదికగా తీసుకుని ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చింది. చట్టాలు, నిబంధనలు చేసినప్పుడు ప్రస్తావనకు రాని అంశాలు ఆచరణలో సమస్యాత్మకం కావటం విడ్డూరమేమీ కాదు. అటువంటప్పుడు సృజనాత్మకంగా అన్వయించటం, చట్టం లేదా నిబంధనల పరిధిని విస్తృతపరచటం న్యాయస్థానాల బాధ్యత. సుప్రీంకోర్టు తాజా తీర్పు ఆ పని చేసింది. అంతేకాదు... పునరుత్పత్తి హక్కుల విషయంలో ప్రభుత్వాల బాధ్యతను కూడా గుర్తుచేసింది. అందరికీ సురక్షిత లైంగిక విధానాలు, గర్భనిరోధక సాధనాల ప్రాముఖ్యతను తెలియజేయటం ప్రభుత్వాల విధి అనీ, తగిన వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ఉంచటం అవసరమనీ సూచించటం మెచ్చదగింది. తాను శారీరకంగా, మానసికంగా గర్భస్రావాన్ని తట్టుకోగల స్థితిలో ఉన్నానో లేదో నిర్ణయించుకునే స్వేచ్ఛ మహిళకే ఇచ్చి, మెడికల్ బోర్డుల పెత్తనాన్ని తొలగించటం ఈ తీర్పులోని మరో కీలకాంశం. ఏ మహిళైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే మెడికల్ బోర్డు ఏర్పాటుచేయటం ఆనవాయితీగా మారింది. ఆ బోర్డు సభ్యులు రకరకాల పరీక్షలతో కాలయాపన చేయటం, చివరకు గర్భం కొనసాగించక తప్పకపోవటం రివాజయింది.

ఎంతో ప్రజాస్వామిక దేశమని చెప్పుకునే అమెరికాలోని సుప్రీంకోర్టు అబార్షన్ హక్కుల విషయంలో ఈమధ్య ఎంతటి సంకుచితమైన తీర్పునిచ్చిందో అందరికీ తెలుసు. 1973, 1992 కేసుల్లో మహిళలకు లభించిన అబార్షన్ హక్కుల్ని అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పు కాల రాసింది. ఢిల్లీ హైకోర్టు సైతం ఆ తోవనే వెళ్లటంతో కొందరు మహిళా సంఘ నేతలు మన సుప్రీంకోర్టు నిర్ణయంపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. కానీ తాజా తీర్పు మహిళలకు భరోసాగా నిలిచింది. మహిళకు తన శరీరంపై పూర్తి హక్కు ఉంటుందనీ, పిల్లల్ని కనాలో వద్దో నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆమెదేననీ చెప్పటం అత్యంత విలువైన మాట. అయితే గర్భవిచ్ఛిత్తి చట్టపరంగా మాత్రమే కాదు... సామాజికంగా కూడా ఆమోదనీయమయ్యేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ఎంటీపీ చట్ట నిబంధనల వెలుపల గర్భస్రావం చేయించుకోవటం ఇప్పటికీ నేరంగానే పరిగణిస్తున్నారు. జిందాల్ లా స్కూల్ నివేదిక సూచించినట్టు తగినంతమంది రేడియాలజిస్టులు, ప్రసూతి వైద్య నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు అందుబాటులో ఉండేలా చేస్తేనే గర్భస్రావం ప్రాణాంతకమయ్యే స్థితి నుంచి మహిళలు బయటపడతారు. ఆ దిశగా చర్యలు అవసరమని ప్రభుత్వాలు గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.8.39 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.01 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.10.39 నుండి 12.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.55 నుండి 7.30 వరకు **అమృతఘడియలు:** రా.7.41 నుండి 9.11 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : మ.1.30 నుంచి 3.00 వరకు

రెండు పనులు చేయడం తప్పేనా?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

ఒకచోట ఉద్యోగం చేస్తూనే రహస్యంగా మరొక ఉద్యోగం కూడా చేస్తుండటాన్ని 'మూన్‌లైటింగ్' అంటారు. మనదేశంలో వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల అప్రమేయంగా ఒనగూడుతున్న సమయ సదుపాయంతో ప్రస్తుతానికి కొన్ని ఐటీ కంపెనీల ఉద్యోగులు మాత్రమే 'మూన్‌లైటింగ్' చేస్తుండవచ్చు గానీ, భవిష్యత్తులో ఈ ధోరణి మరింతగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. ఒకే సమయంలో అనేక అసైన్‌మెంట్‌లపై పని చేయడం అన్నది ఉద్యోగ ఒప్పందాల సాంప్రదాయ ప్రమాణాలకు భిన్నమైనదిగా పరిగణన పొందవచ్చు. కానీ కోవిడ్ మహమ్మారి తరువాత మారిన పరిస్థితులలో కార్యస్థానాన్ని అనువైనదిగా మార్చుకున్నప్పుడు, మూన్‌లైటింగ్ అనే సమస్యపై దృక్కోణాన్ని మార్చుకోవడం కూడా అవసరమే.

'మూన్‌లైటింగ్' అన్నది పాతమాటే. అయితే ప్రసిద్ధ ఐటీ కంపెనీ 'విప్రో' ఇటీవల అనూహ్యంగా 300 మంది ఉద్యోగులను తొలగించడంతో ఈ మాట మళ్లీ కొత్తగా వినిపించడం మొదలైంది. ఒకచోట ఉద్యోగం చేస్తూనే రహస్యంగా మరొక ఉద్యోగం కూడా చేస్తుండటాన్ని 'మూన్‌లైటింగ్' అంటారు. పూర్వపు నానుడిగా చెప్పాలంటే... 'పగలొక ఉద్యోగం, రాత్రొక ఉద్యోగం'. వాస్తవానికి కూడా 'మూన్‌లైటింగ్' అనే మాట అలా పుట్టిందే. అయితే ఐటీ కంపెనీలు విస్తరించాక, ఐటీ ఉద్యోగాలకు పగలూ రాత్రీ లేకుండా పోయాక మూన్‌లైటింగ్ అనే మాట 'రహస్యంగా రెండో ఉద్యోగం' అనే అర్థానికి పర్యాయ పదం అయింది. కంపెనీల చట్టం ప్రకారం దొంగచాటుగా ఇంకో ఉద్యోగం చేయకూడదన్నది నిబంధన. ఆ నిబంధనను ఉల్లంఘించారన్న కారణంతోనే విప్రో తన ఉద్యోగులను తొలగించిందని అనుకోవాలి. అనూహ్యమైన ఆ చర్య భారతదేశంలోని 227 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ పరిశ్రమల రంగంలో ప్రకంపనలు పుట్టించి, ఆ ఐటీ దిగ్గజం చేసిన పని సమంజసమేనా అనే చర్చకు దారి తీసింది. ఈ విషయంలో కొన్ని ఐటీ కంపెనీల యజమానులు విప్రో వైపు ఉండగా, మరికొన్ని కంపెనీలు ''చెప్పి చేస్తే తప్పు కాదు'' అనే సర్దుబాటుతో మూన్‌లైటింగ్‌ను అంగీకరించేందుకు సైతం సిద్ధంగా ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా వృద్ధి చెందుతున్న ఉద్యోగ సంస్కృతిని పరిశీలించి చూస్తే కనుక మూన్‌లైటింగ్ అన్నది భిన్నమైన కోణాన్ని కలిగి ఉన్న ఒక పని నమూనాగా అవతరిస్తోంది. నిపుణులకు, నైపుణ్యానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే కంపెనీలకు మూన్‌లైటింగ్ అప్రధానమైన విషయమే. 'ఇంటి నుండి పని' (వర్క్ ఫ్రమ్ హోమ్) విధానంలో ఆమోదం పొందిన విధి నిబంధనలకు అనుగుణంగానే మూన్‌లైటింగ్ అనే దానికి అప్రకటిత ఆమోదం ఉంటుంది. ఎక్కడి నుంచైనా పని చేసే అవకాశం లభించాక యువ నిపుణులు తమ కార్యస్థావరాలను బీచ్‌లకు, పర్వతాలకు సైతం మార్చుకుని సమర్థంగా తమ కంపెనీ విధులను నిర్వహిస్తున్నప్పుడు పనిలో పనిగా బయటి కార్పొరేట్ కంపెనీల నుంచి ప్రాజెక్టులు స్వీకరించడానికి ఉన్న వెసులుబాటును ఉపయోగించుకోవడం వల్ల ఎవరికి నష్టం?

మనదేశంలో వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల అప్రమేయంగా ఒనగూడుతున్న సమయ సదుపాయంతో ప్రస్తుతానికి కొన్ని ఐటీ కంపెనీల ఉద్యోగులు మాత్రమే మూన్‌లైటింగ్ చేస్తుండవచ్చుగానీ, భవిష్యత్తులో ఈ ధోరణి మరింతగా వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. అక్కడితో ఆగకుండా, వర్క్ ఫ్రమ్ హోమ్‌కి మూన్‌లైటింగ్ ఒక విజయవంతమైన ప్రత్యామ్నాయ చోదకశక్తిగా కూడా యాజమాన్యాలకు, ఉద్యోగులకు కనిపించవచ్చు. అంటే ముందు ఐటీ కంపెనీలలో మూన్‌లైటింగ్ ఒక అంగీకారయోగ్యమైన పని విధానం కావచ్చు! జూనియర్ ఐటీ ఉద్యోగులకు జీతాలను పెంచే విషయంలో ఏమాత్రం ఔదార్యాన్ని ప్రదర్శించని ప్రముఖ టెక్ కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లకు,



కంపెనీ వ్యవస్థాపకులకైతే ఇది తప్పక ఆమోదయోగ్యం అవుతుంది. ఉద్యోగులకు వారు ఆశించిన స్థాయి జీతాలను పెంచలేనప్పుడు మూన్‌లైటింగ్‌కు కంపెనీలు చెప్పే అభ్యంతరం ఏముంటుంది?

ఐబీఎం, ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజాలు మూన్‌లైటింగ్‌ను పని సంప్రదాయానికి వ్యతిరేకమైన చట్టవిరుద్ధ చర్యగా పరిగణించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఆ కంపెనీల ఉద్యోగులు పూర్తి సమయం కంపెనీ పని మీదే ఉండాలి. కంపెనీల వ్యవహారాల పట్ల గోప్యత లేకుంటే పోటీ కంపెనీలు పైచేయి సాధించే ప్రమాదం ఉంటుందన్న ఆందోళన సహజమే కనుక నిస్సందేహంగా వారు మూన్‌లైటింగ్‌ను ఆమోదించరు. అయితే మూన్‌లైటింగ్‌ను ఆమోదించడం ద్వారా సమాచార గోప్యతకు సంబంధించిన ఆందోళనలు తగ్గే అవకాశం కూడా ఉంటుంది! ఉద్యోగులు తమ మూన్‌లైటింగ్ ప్రాజెక్టులు లేదా అసైన్‌మెంట్‌ల గురించిన సమాచారాన్ని దాచకుండా పంచుకుంటారు కనుక వారిపై అనుమానాలకు తావుండదు.

పని విధానాల వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించడానికి ఒక సంఘంగా ఏర్పడిన ఐటీ పరిశ్రమ ఉద్యోగులు కూడా మూన్‌లైటింగ్ కొత్తదేమీ కాదనీ, దశాబ్దాలుగా ఇది లాభదాయకమైన అంకుర సంస్థల ఆవిర్భావానికి దారి తీసిందనీ అంటున్నారు. ఈమాట నిజం. ఎందుకంటే చాలామంది అంకుర సంస్థల వ్యవస్థాపకులు కొత్త వెంచర్‌లను నెలకొల్పే అవకాశాలను అన్వేషించేటప్పుడు తమ 'పూర్తి సమయ' ఉద్యోగాలలో ఉన్నవారే. అంతమాత్రాన యాజమాన్యాలు తమ ఉద్యోగుల వల్ల తమకు భవిష్యత్తులో పోటీగా అవతరించబోయే స్టార్ట్-అప్‌ల గురించి కలత చెందనవసరం లేదు.

వాస్తవానికి ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు అదనంగా బయటి నుంచి అసైన్‌మెంట్‌లను తీసుకోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి.. పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు అవసరమైన నైపుణ్యాలకు మెరుగు పరచుకోవడమేనని ఇప్పటికే పలు నివేదికలలో వెల్లడయింది. ఈ రంగంలో సాంకేతికత త్వరత్వరగా పాతబడిపోతుంటుంది. అలాంటప్పుడు కొత్త నైపుణ్యాలతో ముందుకు వెళ్లడం అత్యవసరం. పైపెచ్చు ఈ మూన్‌లైటింగ్... కృత్రిమ మేధస్సు లేదా ఇతర హైటెక్ రంగాలలో ఉద్యోగాల పరంగా అయినా, దీర్ఘకాలంలో మరింత లాభదాయకమైన రంగాల్లో ఉపాధి పొందేందుకైనా వీలు కల్పిస్తుంది కాబట్టి, ఎక్కువ సంపాదించడం ముఖ్యం అయినప్పటికీ, ఇది కేవలం సంపాదించడానికే కాదు.

ఈ మొత్తం మూన్‌లైటింగ్ కథను గ్లోబల్ గిగ్ ఎకానమీ (స్వల్పకాలిక ఉపాధికి ప్రాధాన్య ఇచ్చే ఆర్థిక వ్యవస్థ) నేపథ్యంలో ప్రాధాన్యం పొందుతున్న విధానంగా భావించాలి. ఉద్యోగులు తమను తాము సంప్రదాయ 9-5 ఉద్యోగాలతో ముడిపెట్టుకోకుండా బహుళ క్లయింట్‌ల కోసం స్వల్పకాలిక ఆర్జన విధులు చేపడతారనే వాస్తవమే మూన్‌లైటింగ్‌కు పునాది. అదే సమయంలో, అదే గిగ్ ఎకానమీ భారతీయ వ్యవస్థలోకి మారి నప్పుడు చాలా భిన్నంగా ఉంటుందని గుర్తించాలి. ఉదాహరణకు, విదేశాలలో ఊబర్ డ్రైవర్లు తమ సొంత వాహనాలను రోజుకు కొన్ని గంటలపాటు ట్యాక్సీలుగా ఉపయోగించే వ్యక్తులు కావచ్చు. మన దేశంలో, ఊబర్‌ను నడపడం పూర్తి కాలపు ఉపాధి.

ఐటీ పరిశ్రమ విషయానికొస్తే, ప్రపంచ పరిస్థితులతో ఇక్కడ ఎక్కువ సారూప్యం ఉంది. భారతీయ టెక్ కార్మికులు విదేశాలలో ఉన్న వారి మాదిరిగానే ఎక్కువ లేదా తక్కువ పని చేస్తున్నారు. అంతే కాదు, ఇక్కడ చాలామంది విదేశీ అసైన్‌మెంట్‌లతో వ్యవహరించడంలో అనుభవజ్ఞులు. అయితే, ఈ రంగానికి సంబంధించిన సమస్యలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నందున వాటిని సున్నితంగా పరిష్కరించాలి. మెకిన్సే అధ్యయనం ప్రకారం, భారతీయ ఐటీ పరిశ్రమ వచ్చే ఐదేళ్లలో దాదాపు 10 శాతం వృద్ధి రేటుతో 300–350 బిలియన్ల మార్కును చేరుకోగలదని అంచనా.

ప్రస్తుత చట్టాలు వ్యక్తులు ఒకే సమయంలో అనేక ప్రదేశాలలో పనిచేయడానికి అనుమతించనందున ఈ ద్వంద్వ ఉపాధి సమస్య ఉండనే ఉంటుంది. కార్యాలయాలలో మారుతున్న వాస్తవికతకు అనుగుణంగా దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఐటీ పరిశ్రమలో... పనిచేస్తున్న వారు తమ నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోకుంటే లేదా నవీన సామర్థ్యాలను మెరుగుపరచుకోలేకపోతే, దేశీయ ఐటీ రంగం భారీగా నష్టపోతుంది. ఒకే సమయంలో అనేక అసైన్‌మెంట్‌లపై పని చేయడం అన్నది ఉద్యోగ ఒప్పందాల సంప్రదాయ ప్రమాణాలకు భిన్నమైనదిగా పరిగణన పొందవచ్చు. కానీ కోవిడ్ మహమ్మారి తరువాత మారిన పరిస్థితులలో కార్యస్థానాన్ని అనువైనదిగా మార్చుకున్నప్పుడు, మూన్‌లైటింగ్ అనే సమస్యపై దృక్కోణాన్ని మార్చుకోవడం కూడా అవసరమే. అనువైన పని గంటలు, వర్క్ ఫ్రమ్ హోమ్ ఇప్పుడు పని చేసే రంగానికి ఆమోదయోగ్యమైన విధానం. మూన్‌లైటింగ్‌కి కూడా అంతే సమానమైన ఆమోదం ఇవ్వాల్సిన సమయమిది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నటనాధ్యక్షుడు



కాంగ్రెస్ ఎన్నికలు అచ్చంగా పాకిస్తాన్ ఎన్నికల మాదిరే కనబడుతున్నాయి. జనరల్ ఆశీర్వాదం ఉన్న మనిషి చిట్టచివరకు, అధిపతిగా 'నటిస్తాడు'.

– వి. విజయసాయి రెడ్డి, రాజ్యసభ ఎంపీ

పార్టీ ప్రజాస్వామ్యం



నూటా యాభై ఏళ్ల పార్టీ చరిత్రలో కాంగ్రెస్‌కు 97 మంది అధ్యక్షులుగా పనిచేశారు. అదే 125 ఏళ్ల బీజేపీ+ఆర్ఎస్ఎస్+జనసంఘ్‌కు కేవలం 29 మంది మాత్రమే అధ్యక్షులుగా ఉన్నారు. కాంగ్రెస్‌కు 12 మంది మహిళలు అధ్యక్షులుగా పనిచేశారు. అదే బీజేపీకి సున్నా మంది మహిళలు.

– తారా కృష్ణస్వామి, రాజకీయ విశ్లేషకులు

దోచేస్తున్నారు



జార్ఖండ్‌కు చెందిన ఒక ఐఏఎస్ ఆఫీసర్ తన భర్త నిర్మిస్తున్న హాస్పిటల్ కోసం కోట్ల రూపాయలను నగదు రూపంలో చెల్లించారు. ఒక్క ఐఏఎస్ అధికారి కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే 200 కోట్ల రూపాయలు సంపాదించగలిగారంటే, అసలు దేశవ్యాప్తంగా ఏ రకమైన లూటీ జరుగుతున్నదో ఊహకు కూడా అందడం లేదు.

– అమిత్ తడానీ, సర్జన్

ఎటు మారుతారు?



బెంగళూరు నీట మునిగినప్పుడు భారతీయులం ఏడ్చాం. అయితే, అవి ఏవో కొన్ని కొత్త కాలనీలు. అయినా చాలామంది ఐటీ, ఇంకా ఇతర కంపెనీలు బెంగళూరు నుంచి పుణె, 'ఎన్సీఆర్'కు తరలిపోవాలని చెప్పారు. ఇప్పుడు అమెరికా నీట మునగడాన్ని చూస్తున్నా. మరి అమెరికా టెక్ కంపెనీలు అఫ్గానిస్తాన్‌కు తరలిపోవడం గురించి ఏమైనా ఆలోచిస్తున్నాయా?

– నార్బర్ట్ ఎలెకెస్, వ్యాఖ్యాత

స్పష్టమైన అ-న్యాయం



ఒకవేళ శశి థరూర్ అక్టోబర్ 8లోగా ఇది న్యాయంగా జరుగుతున్న ఎన్నిక కాదని చెప్పి (స్పష్టంగా అది తెలుస్తూనే ఉంది) వైదొలగితే, కాంగ్రెస్ పార్టీ మీద ఉన్న ఆ కొద్దిపాటి విశ్వసనీయత కూడా పోతుంది.

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

అమాయకులు బలి



అఫ్గానిస్తాన్‌లో విద్యా కేంద్రం మీద తీవ్రవాద దాడి జరిగింది. కాబూల్‌లో నిండిపోయి ఉన్న తరగతి గదిలో ఈ ఆత్మాహుతి దాడి చోటు చేసుకుంది. ఎందరో అమాయకులు, అందులో ఎక్కువమంది అమ్మాయిల ప్రాణాలు పోయాయి. హజారాల మీద జరుగుతున్న నరమేధం ఆపాలి.

– హబీబ్ ఖాన్, జర్నలిస్ట్

మనవాళ్లంతే!



రఫేల్ నాదల్ తన కిట్‌ను తనే మోసుకెళ్తాడు. కొరియన్ నటులు ఎప్పుడూ తమ లగేజీని తామే లాక్కెళ్తారు. ఇండియాలో బాలీవుడ్ స్టార్లకు తమ హ్యాండ్‌బ్యాగ్ మోయడానికి కూడా మరొకరు కావాలి; ఆఖరికి వాళ్లు ఏదైనా కింద పడేసుకున్నా తీయరు.

– జ్యోత్స్నా మోహన్, కాలమిస్ట్

ఇన్‌బాక్స్

అదే అభివృద్ధి మంత్రం

ప్రగతి నిరోధకమైన ఏకకేంద్ర అభివృద్ధి, సమగ్ర వికాసాన్ని కాంక్షించే వికేంద్రీకరణ మంత్రం... ప్రస్తుతం మన రాష్ట్రంలో వినిపిస్తున్నవి ఇవే! పార్లమెంట్ సాక్షిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన ఘట్టం ఎప్పటికీ భవిష్యత్ తరాలకు గుర్తుండిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం ఎంత చెప్పుకున్నా తక్కువే. ఉమ్మడి ఏపీ రాజధానిగా ఉన్న హైదరాబాద్ అభివృద్ధిపైనే పాలకులు దృష్టిపెట్టి మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా ఏపీలో... అంతగా అభివృద్ధి చెందిన నగరాలు లేవు. ఒక్క విశాఖపట్టణంలోనే తక్కువ ఖర్చుతో రాజధాని ఏర్పాటుకు అవకాశం ఉంది. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇవ్వకుండా అమరావతిలో రాజధాని ఏర్పాటుకు నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొత్తగా వచ్చిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి ఫలాలను ఉత్తరాంధ్ర, రాయలసీమ, మిగతా ఆంధ్ర ప్రాంతాలకు సమానంగా అందించడానికి మూడు రాజధానుల ఏర్పాటుకు ప్రతిపాదించింది. విశాఖలో పరిపాలక రాజధాని, అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయడం ద్వారా న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలనేది ఈ ప్రభుత్వ ఆకాంక్ష.

అయితే ప్రతిపక్ష టీడీపీ రైతులను రెచ్చగొట్టి పాదయాత్రల పేరుతో విద్వేషాలను, వైషమ్యాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఈ పాదయాత్రకు మద్దతు ఇస్తున్నారంటే అర్థం పెట్టుబడిదారులకు అండ నివ్వడమే. కోట్ల రూపాయలు లాభాలు వస్తాయని భూమిపై పెట్టుబడులు పెట్టిన వ్యాపారస్తులు అమరావతిలో రాజధానిని కొనసాగిస్తే తమ భూములు ధరలు పెరుగుతాయని భావిస్తున్నారే కానీ... వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రల గురించి పట్టించుకోకపోవడం లేదు. పరిపాలనా వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రంలోని మూడు ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయనేది నిర్వివాదాంశం. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా మరింత గట్టిగా ప్రయత్నాలు చేయాలి.

– డాక్టర్ టి. షారోన్ రాజు
ఎడ్యుకేషన్ విభాగం అధిపతి, ఏయూ, విశాఖపట్టణం

హాస్య దళానికి కులపతి

తెలుగు సినిమా చరిత్రలో భావి తరాల వారిని ప్రభావితం చేయగలిగిన నటీనటులు వేళ్లమీద లెక్క పెడితే అందులో తప్పనిసరిగా నిలిచే పేరు అల్లు రామలింగయ్య. హాస్యంలోంచి విలనీ, విలనీ లోంచి హాస్యం సాధించిన విశిష్ట నటుడు. అందుకే ఎన్ని తరాలు మారినా తరగని కీర్తిని సొంతం చేసుకుని ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు.

1953లో తొలిచిత్రం పుట్టిల్లులో పోషించిన శాస్త్రులు, వద్దంటే డబ్బులో టీచరు, దొంగరాముడులో హాస్టలు వార్డెను పాత్రల్ని పునాదులుగా చేసుకుని భాగ్యరేఖ, మాయాబజార్ చిత్రాలతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. 2004 నాటికి 1,000కి పైగా చిత్రాల్లో విలక్షణ భూమికల్ని పోషించారు.

'పుట్టిల్లు', 'మాయాబజార్'లలోని శాస్త్రులు పాత్ర ఆకట్టుకుంది. అందుకే ఆ తర్వాత అనేక చిత్రాల్లో శాస్త్రి పాత్ర ఆయన్నే వరించింది. ఒక్కో చిత్రంలో 'శాస్త్రి' పాత్ర ఒక్కోలా ఉండడమే అల్లు సాధించిన పరిపూర్ణత. ఆ పాత్రకు తాను నిజ జీవితంలో చూసిన సూరి భొట్ల నారాయణమూర్తి స్ఫూర్తి అనీ, అయితే ఆయా చిత్రాల్లో పాత్రౌచిత్యాన్ని బట్టి రసాల కూర్పు చేసుకునేవాడిననీ ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. అలాగే హాస్యపాత్రలు పోషించాల్సి వచ్చినప్పుడల్లా మునిమాణిక్యం నరసింహారావు, భమిడిపాటి కామేశ్వరరావు వంటి వారి రచనలు చదివి స్ఫూర్తి చెందేవాడిననీ, ఆ ఇద్దరూ తన అభిమాన రచయితలనీ అల్లు పేర్కొన్నారు.

ఎప్పుడో దొంగ రాముడు షూటింగ్ సమయంలో అల్లు అప్రయత్నంగా డైలాగ్ మరిచి పోవడం వలన వెలువడిన 'ఆమ్యామ్యా'ని, బుద్ధిమంతుడు, బాలరాజు కథ, అందాల రాముడు చిత్రాల్లో చెప్పగా చెప్పగా 'ఆమ్యామ్యా' కాస్తా తెలుగు నాట లంచానికి పర్యాయ పదంగా స్థిరపడిపోయి, దినపత్రికల్లో పతాక శీర్షిక అయ్యింది. ముళ్ళపూడి వెంకట రమణని ఓ జర్నలిస్ట్ 'ఆమ్యామ్యా' సృష్టికర్త మీరే కదా?! అని ప్రశ్నిస్తే 'ఆమ్యామ్యా సృష్టికర్త అల్లు రామలింగయ్య గారు, ఆమ్యామ్యా మీద పేటెంట్ హక్కులన్నీ వారివే' అని ధృవీకరించారు. ముత్యాల ముగ్గులో అల్లు దివాన్ జోగినాథంగా గొప్పగా నటించాడా లేక కోతి కరిచాక కోతిలా గొప్పగా నటించాడా అంటే చెప్పడం తేలిక కానే కాదు.



నేడు 'పద్మశ్రీ' అల్లు రామలింగయ్య శతజయంతి

చాలా ఏళ్లపాటు పాత్రలకోసం ప్రొడక్షన్ హౌస్‌లకి ర్యాలీ సైకిలు మీద తిరిగిన అల్లు రామలింగయ్య 'మూగ మనసులు'తో ట్యాక్సీలో తిరిగే దశ కొచ్చారు. వెయ్యి రూపాయలు పారితోషికం కాస్తా రెండువేల ఐదొందలు అయ్యింది. అల్లు 2003 నాటికి గానీ అత్యధిక పారితోషికం లక్ష రూపాయలు అందుకోలేదు. ఏ నిర్మాతను ఏనాడూ తన పారితోషికం ఎంతని అడగలేదు. తన పాత్ర ఏమిటని మాత్రమే అడిగిన నిర్మాతల ఆర్టిస్ట్ కావడంతోనే... ఆయన వెయ్యి చిత్రాల వైపు విల్లు ఎక్కు పెట్టగలిగారు.

పాలకొల్లులో నాటకాలాడటం, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జైలు శిక్షలను అనుభవించడం, ప్రజా నాట్య మండలితో అనుబంధం వంటి అనేక దశలు రామలింగయ్య జీవితంలో ఉన్నాయనే విషయం చాలామందికి తెలియదు.

అల్లు జననీ జనకులు అల్లు వెంకయ్య, సత్తెమ్మ. మొత్తం ఏడుగురు సంతానం. క్షీరా రామ లింగేశ్వరుడి పేరు ఆయనకు పెట్టారు.

ఆ రోజుల్లో అధికారులు 40 ఏళ్ళని బర్త్ సర్టిఫికెట్ తీసుకువస్తే ప్రవేశ పరీక్ష రాయక్కర్లేదని ఆర్ఎంపీ సర్టిఫికెట్ ఇస్తామని చెబితే... 'లేదు నాకు 39 ఏళ్ళే, నేను పరీక్ష రాస్తా'నని చెప్పి పరీక్ష రాసి ఉత్తీర్ణుడై హోమియోపతి డాక్టరుగా అల్లు సాధించిన కీర్తి ఇంతా అంతా కాదు. అల్లు నుండి వైద్యసేవలు అందుకున్నవారిలో నందమూరి బసవ తారకంతో పాటు నూతన నటీనటుల వరకూ ఉండే వారంటే అతిశయోక్తి కాదు.

రాజమండ్రిలో బోడా వెంకటరత్నం, చింతవారి జానకి రామయ్య తదితర ప్రముఖులతో స్థాపించబడిన హోమియో కళాశాల ఆర్థిక అస్థిర పరిస్థితుల్లో ఉంటే అల్లు కృషితో ఆంధ్ర దేశంలో పేరెన్నిక గన్న కళాశాలగా ఎదిగింది. ఇప్పుడది డా॥ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి కళాశాల. గత ఏడాది ఇక్కడ అక్టోబర్ ఒకటిన వారి అల్లుడు మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా కాంస్య విగ్రహ ప్రతిష్ఠ జరగడం ఓ మధురఘట్టం.

ప్రతి కార్యక్రమానికీ అర్ధాంగి అల్లు కనక రత్నం, పెద్దకుమార్తె అల్లు నవ భారతీదేవి తప్పనిసరిగా వచ్చే వారు, జాతీయోద్యమంలో నూలు వడకడంలో జిల్లాలోనే మొదటి బహుమతి పొందిన కారణంగా కనకరత్నంని కోరి మరీ పెళ్ళాడారు రామలింగయ్య. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కలిగిన సంతానం కావడంతో తమ కుమార్తెకు నవభారతి అని అల్లు దంప తులు పేరు పెట్టుకున్నారంటే ఆయన దేశభక్తి ఏమిటో అర్థమవుతుంది.

అల్లు అరవింద్ అగ్ర నిర్మాతగా అవతరించాక 'నాన్నగారూ కొంచెం మీరు విశ్రాంతి తీసుకోవచ్చు కదా! ఇంకా నటించడం ఎందుకండి, సంవత్సరంలో మీరెంత సంపాదిస్తారో అంతా మీకు ఒక్కసారిగా నేనిచ్చేస్తాను' అంటే... 'నటించడం లోనే నా తృప్తి, సరదా, సంతోషం అన్నీ ఉన్నాయి, కాబట్టి ఓపిక నశించే వరకూ నటిస్తా. ఊపిరి ఉండే వరకూ నటిస్తా. మరణించాక కూడా నటిస్తా' అన్నారు అల్లు రామలింగయ్య. 'మరణించాక నటిస్తారా? అదెలాగ నాన్నగారూ?' అన్నారు అరవింద్. 'నేను పోయాక నన్ను పాడెమీద పడుకోబెట్టాక నువ్వా దృశ్యాలన్నిటినీ కెమెరాతో షూట్ చేయిస్తావని నాకు తెలుసు, అంటే నేను పోయాక కూడా నటిస్తున్నాననే కదా!' అన్నారు రామలింగయ్య.

ఇంత చెప్పీ అల్లు రామలింగయ్య బాల్యం నుండే అస్పృశ్యత, అంటరాని తనంపై పోరాడారని చెప్పకపోతే తప్పే అవుతుంది.

'కుక్కను జూచి గురుతర భక్తితో భైరవుండని ప్రేమ బరగుమండే/ పాముని జూచి సుబ్బారాయుడని మ్రొక్కి పాలుపోసి పెంతురు భక్తి గల్గి/గద్దను జూచి విష్ణు వాహనం బనుచు కదు ముదముతో వినుతి జేసి/కోతి హనుమంతుదనుచు కూర్మి మీర తాకెదరు గాదె మమ్మేల తాకరయ్యా?! జంతువుల కన్నా అధముడా సాటి నరుడు'

అనే పద్యంతో ధ్వజమెత్తిన అల్లు రామలింగయ్య జీవిత పర్యంతమూ ఈ సిద్ధాంతానికే కట్టుబడిన మహర్షి!

– చిల్లగట్టు శ్రీకాంత్ కుమార్
రచయిత


SMART BAZAAR
SMART SUPERSTORE
స్మార్ట్ దసరా సేల్
1st - 5th Oct
SMART BAZAAR
గుంటూరు : శివ సిటీ సెంటర్, 7 వ లేన్, రింగ్ రోడ్, చంద్రమౌళి నగర్, ● కర్నూలు: రిలయన్స్ పెట్రోల్ స్టేషన్ పక్కన, నంద్యాల రోడ్, ● నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్, ● రాజమండ్రి: శ్యామలాంబ ఆలయ వీధి, ● తిరుపతి: BNR SV మాల్, STV నగర్, ఎయిర్ బై-పాస్ రోడ్.
వద్ద కూడా లభ్యం
JioMart.com
మీరు ఇప్పుడు వాట్సాప్ లో జియో మార్ట్ నుండి ఆర్డర్ చేసుకోవచ్చు
షాపింగ్ ప్రారంభించడానికి వాట్సాప్ పై
79770 79770 కి 'Hi' అని సెండ్ చేయండి
షాపింగ్ ప్రారంభించడానికి
QR కోడ్ స్కాన్ చేయండి
స్వీట్స్
BUY1 GET1 FREE
గులాబ్ జామున్ / రసగుల్లా 1 kg (సెలెక్ట్ వేరియంట్స్) (బికాజీ/స్నాక్‌టాక్/దేశీ ఫుడీస్) ఎమ్ఆర్‌పి ₹289 మొదలుకుని
సోన్‌పాప్‌డీ / బేసన్‌లాడూ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) (బికాజీ / స్నాక్‌టాక్ / దేశీ ఫుడీస్ / కరాచి) ఎమ్ఆర్‌పి ₹120 మొదలుకుని
మైసూర్ పాక్ / కాజు కత్రి 200 g (లాల్ / కరాచి) ఎమ్ఆర్‌పి ₹150 మొదలుకుని
డ్రై ఫ్రూట్
BUY1 GET1 FREE
దివాలి డ్రై ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్ 225 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) (గుడ్ లైఫ్ / నట్రాజ్ / వండర్‌ల్యాండ్) ఎమ్ఆర్‌పి ₹499 మొదలుకుని
₹399 గుడ్ లైఫ్ పోట్లీ ప్యాక్ 400 g ఎమ్ఆర్‌పి ₹499 ఆదాచేసుకోండి ₹100
పండుగ అత్యవసరాలు
BUY1 GET1 FREE
మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ / దలియా 500 g / 1 kg ఎమ్ఆర్‌పి ₹45 మొదలుకుని
₹205 (₹41 /kg) ప్యారీస్ వైట్ లేబల్ షుగర్ 5 kg ఎమ్ఆర్‌పి ₹275 ఆదాచేసుకోండి ₹70
₹152 హలో లైఫ్ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్ 1 ℓ ఎమ్ఆర్‌పి ₹198 ఆదాచేసుకోండి ₹46
ఫార్చ్యూన్ ఎవ్రీడే బాస్మతి రైస్ 5 kg + ఫార్చ్యూన్ రిఫైన్డ్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 5 ℓ + ప్యారీస్ వైట్ లేబల్ షుగర్ 5 kg
మా ధర ₹1299
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹2060 ఆదాచేసుకోండి ₹761
డైలీ రైస్ 25 kg
మా ధర ₹1069 (₹42.76 /kg)
ఎమ్ఆర్‌పి ₹1200 ఆదాచేసుకోండి ₹131
చక్కి ఆటా 5 kg
CHAKKI ATTA
మా ధర ₹175
ఎమ్ఆర్‌పి ₹245 ఆదాచేసుకోండి ₹70
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
మా ధర ₹349/ ₹399
ఎమ్ఆర్‌పి ₹549 / ₹499 ఆదాచేసుకోండి ₹200 / ₹100
తూర్ / అర్‌హర్ దాల్ (కందిపప్పు) 2 kg
మా ధర ₹240 (₹120 /kg)
ఎమ్ఆర్‌పి ₹300 ఆదాచేసుకోండి ₹60
హెరిటేజ్ అగ్‌మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 ℓ
మా ధర ₹515
ఎమ్ఆర్‌పి ₹630 ఆదాచేసుకోండి ₹115
తాజ్ మహల్ లీఫ్ టీ 500 g
ఆదాచేసుకోండి ₹70
ఎమ్ఆర్‌పి ₹410 మొదలుకుని మా ధర ₹340 మొదలుకుని
కోకో కోలా / స్ప్రైట్ / థమ్స్‌అప్ / మాజా 1.2 ℓ మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
30% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹70 మొదలుకుని ఆదాచేసుకోండి ₹49 మొదలుకుని
బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹130 మొదలుకుని
క్యాడ్బరీ సెలబ్రేషన్స్ 130.9 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
20% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని ఆదాచేసుకోండి ₹108 మొదలుకుని
మెకెన్ ఫ్రెంచ్ ఫ్రైస్ 750 g / 1.25 kg
BUY2 GET1 FREE
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹195 మొదలుకుని
గ్లిమ్మెర్ యాక్సెసరీస్ / నేల్ ఎనామెల్/ లూఫా / కాజల్ / మిరాబెల్ షీట్ మాస్క్ (సెలెక్ట్ వేరియంట్స్)
BUY1 GET1 FREE
ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని
డవ్ / పేర్స్ / ఫియామా 125 g x 4 + 1 / లక్స్ 150 g x 3 సోప్ (సెలెక్ట్ వేరియంట్స్)
33% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹198 మొదలుకుని
మెన్స్ / వుమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY1 GET1 FREE
ఎమ్ఆర్‌పి ₹225 మొదలుకుని
డవ్ / హెడ్ అండ్ షోల్డర్ / లోరియల్ షాంపు 650 ml మొదలుకుని
BUY1 GET1 FREE
ఎమ్ఆర్‌పి ₹740 మొదలుకుని
సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ 5 kg / టైడ్ 6 kg పౌడర్ (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదాచేసుకోండి ₹150
ఎమ్ఆర్‌పి ₹685 మొదలుకుని మా ధర ₹535 మొదలుకుని
హ్యాపీ లివింగ్ డబల్ బెడ్ షీట్
BUY1 GET2 FREE
ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
బ్రాండెడ్ లగేజ్ ట్రాలీ
70% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹7500 మొదలుకుని ఆదాచేసుకోండి ₹2250 మొదలుకుని
వద్ద కూడా లభ్యం
SMART POINT
Pay using Paytm
Paytm GET UP TO ₹300 CASH BACK T&C apply.
Valid till 05th Oct 2022 on min. payment of ₹1000
లో మాత్రమే ఆఫర్స్ వెల్లుతాయి:
నియమ నిబంధనలు వర్తిస్తాయి. కార్డ్ పార్ట్‌నర్స్ మరియు వాలెట్ ఆఫర్లు స్మార్ట్ బజార్, స్మార్ట్ సూపర్‌స్టోర్ మరియు స్మార్ట్ పాయింట్‌లో మాత్రమే చెల్లుతాయి. స్టాక్స్ ఉన్నంత వరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీసు ఇవ్వకుండానే మార్చబడగలవు. ఉత్పాదనల యొక్క బొమ్మలు/చిత్రాలు కేవలం ప్రదర్శన ఉద్దేశం కోసం మాత్రమే. ఉత్పాదనలన్నిటి ఎమ్ఆర్ పిలో పన్నులన్నీ కలుపబడి ఉన్నాయి. మిగతా ఆఫర్లన్నీ 5 అక్టోబరు 2022 వరకు చెల్లుతాయి. వివాదాలన్నీ కేవలం ముంబయిలోని కోర్టుల ప్రత్యేక అధికార పరిధికి లోబడి ఉంటాయి.

యాత్ర మినహా మాకు మార్గం లేదు



భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ

సాక్షి, బెంగళూరు: చట్ట సభలు, ప్రసార, ప్రచార మాధ్యమాలు తదితర వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాల గొంతుకను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండడంతో తమకు పాదయాత్ర తప్పలేదని ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలిపారు. యాత్ర శుక్రవారం తమిళనాడులోని గుడలూర్ నుంచి చామరాజనగర్ జిల్లా గుండ్లుపేట వద్ద కర్ణాటకలో ప్రవేశించింది. గుండ్లుపేటలోని అంబేడ్కర్ భవన్ మైదానంలో జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర ఎందుకు అనే ప్రశ్న తమకు అడుగడుగునా ఉత్పన్నమవుతోందని రాహుల్ చెప్పారు. ప్రజాస్వామ్యంలో మీడియా, పార్లమెంట్, అసెంబ్లీ వంటివి ఉన్నాయని, అయితే అక్కడ ఎక్కడా తమ వాణి వినిపించకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని చెప్పారు. పార్లమెంట్‌లో తాము మాట్లాడుతుండగా మైక్ బంద్ చేస్తున్నారని, అసెంబ్లీల్లోనూ అదే పరిస్థితి ఉందన్నారు. మీడియాను సైతం అధికార పార్టీ గుప్పిట్లో పెట్టుకుందన్నారు. వారి చర్యలకు నిరసనగా ఆందోళన చేపడితే అరెస్టులు చేస్తున్నారని, తమకున్న ఏకైక మార్గం ప్రజల ముందుకు వెళ్లి వారితో కలసి అడుగు వేయడమేనని చెప్పారు. తమ యాత్రను ఎవరూ అడ్డుకోలేరన్నారు. కర్ణాటకలోజరిగే ఈ పాదయాత్రలో ధరల పెంపు, అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యల గురించి ప్రజలు తమ బాధలను చెప్పుకుంటున్నారన్నారు.

బరిలోకి ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో ఊహించని మలుపు

- దక్షిణాది దళిత నాయకుడి వైపే అధిష్టానం మొగ్గు
- చివరి నిమిషంలో వెనక్కి తగ్గిన దిగ్విజయ్ సింగ్
- నామినేషన్లు దాఖలు చేసిన మల్లికార్జున ఖర్గే, శశి థరూర్, కేఎన్ త్రిపాఠి
- పార్టీ పెద్దల ఆశీస్సులుండడంతో ఖర్గే విజయం ఇక లాంఛనమే



నామినేషన్ అందజేస్తున్న ఖర్గే, పక్కన దిగ్విజయ్, గెహ్లాట్



నామినేషన్ పత్రాలను చూపిస్తున్న శశి థరూర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పోరు చివరి క్షణంలో అనూహ్యమైన మలుపు తిరిగింది. సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ స్థానంలోకి సోనియా గాంధీ కుటుంబానికి విధేయుడు, దక్షిణాది దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే వచ్చిచేరారు. సోనియా ఆశీస్సులతో ఆయన అధ్యక్ష బరిలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. ఖర్గేతోపాటు తిరువనంతపురం ఎంపీ శశి థరూర్, జార్ఖండ్ మాజీ మంత్రి కేఎన్ త్రిపాఠి శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీకి అందజేశారు. రకరకాల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ పోటీలో చివరకు ముగ్గురు మిగిలారు. అభ్యర్థిగా మల్లికార్జున ఖర్గే పేరును అశోక్ గెహ్లాట్, దిగ్విజయ్ సింగ్, ప్రమోద్ తివారీ, పీఎల్ పూనియా, ఏకే ఆంటోనీ, పవన్‌కుమార్ బన్సల్, ముకుల్ వాస్నిక్‌తోపాటు జి–23 గ్రూప్‌లోని ఆనంద్ శర్మ, మనీశ్ తివారీ ప్రతిపాదించారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఖర్గే వెంట పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు కనిపించారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో ఆయన విజయం ఖాయమేనని స్పష్టమవుతోంది. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు శశి థరూర్ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. నామినేషన్ల కార్యక్రమానికి సోనియా గాంధీ కుటుంబ సభ్యులెవరూ హాజరుకాలేదు. వాస్తవానికి ఈ ఎన్నికలో పోటీ చేయడానికి దిగ్విజయ్ సింగ్ అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నామినేషన్ పత్రాలను సైతం పార్టీ కార్యాలయం నుంచి తీసుకున్నారు. నామినేషన్ దాఖలు చేయబోతున్నానని గురువారం ప్రకటించారు. ఇంతలోనే పార్టీ అధిష్టానం వ్యూహం మార్చేసింది. దళిత నాయకుడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దాంతో దిగ్విజయ్ వెనక్కి తగ్గారు. తాను పోటీ చేయడం లేదని విస్పష్టంగా ప్రకటించారు. నామినేషన్లకు గడువు శుక్రవారం ముగిసింది. అక్టోబర్ 17న జరగనున్న ఎన్నికలో ఓటు వేయడానికి 9,100 మందికిపైగా ప్రతినిధులను అర్హులుగా గుర్తించారు. అక్టోబర్ 19న ఫలితాలను ప్రకటిస్తారు.

ఖర్గేకు సీనియర్ల మద్దతు: గెహ్లాట్

అధ్యక్ష ఎన్నికలో ఖర్గేకు మద్దతు ఇవ్వాలని పార్టీ సీనియర్లంతా కలిసి నిర్ణయించారని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ చెప్పారు. తన మద్దతు ఖర్గేకే ఉంటుందని తెలిపారు. పోటీలో ఎవరు నిలిచినప్పటికీ ఎన్నిక పూర్తయ్యాక అసలు విజేత కాంగ్రెస్సేనని అన్నారు.

పార్టీలో మార్పు కోసమే నా పోరాటం: ఖర్గే

కాంగ్రెస్ పార్టీలో భారీ మార్పు కోసం తాను పోరాడుతానని, నేతలు, కార్యకర్తలంతా మద్దతివ్వాలని ఖర్గే విజ్ఞప్తి చేశారు. అధ్యక్ష ఎన్నికలో తనకు ఓటు వేసి గెలిపించాలని పార్టీ డెలిగేట్లను కోరారు. ఈ ఎన్నికలో పోటీ చేయడానికి తనను ప్రోత్సహించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బాల్యం నుంచే కాంగ్రెస్‌తో తనకు అనుబంధం ఉందని, పార్టీ ఆదర్శాలను కాపాడుకోవడానికి మరింత ఉధృతంగా పోరాడుతానని అన్నారు. కాంగ్రెస్‌లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు మల్లికార్జున ఖర్గే అని సీనియర్ నేత ప్రమోద్ తివారీ కొనియాడారు.

మార్పు కావాలనుకుంటే నాకు ఓటేయండి: థరూర్

కాంగ్రెస్‌కు ఖర్గే 'భీష్మ పితామహుడు' అని శశి థరూర్ ప్రశంసించారు. భారత్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో అధ్యక్షుడిని ఎన్నుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్‌కు సేవలందించడం గర్వకారణంగా భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ఖర్గే, తాను ప్రత్యర్థులం, శత్రువులం కాదని.. తమ మధ్య స్నేహపూర్వక పోటీ జరగబోతోందని చెప్పారు. ఖర్గే పట్ల తనకు గౌరవం ఉందన్నారు. కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి తనకు ఒక విజన్ ఉందని ఉద్ఘాటించారు. ఖర్గే 'యథాతథ స్థితి కొనసాగింపు నాయకుడేనని' అన్నారు. పార్టీలో యథాతథ స్థితి కొనసాగాలనుకుంటే ఖర్గేకు, మార్పు కావాలనుకుంటే తనకు ఓటు వేయాలని థరూర్ పిలుపునిచ్చారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోబోనని తేల్చిచెప్పారు. 12 రాష్ట్రాల నాయకులు, కార్యకర్తలు తనకు మద్దతుగా సంతకాలు చేశారన్నారు. పార్టీని బలోపేతం చేసి, దేశాన్ని ముందుకు తీసుకెళ్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్ష ఎన్నికలో సోనియా గాంధీ కుటుంబం ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎవరికీ మద్దతు ఇవ్వబోదని అన్నారు.

గాంధీ కుటుంబానికి వీరవిధేయుడు

బెంగళూరు: సోలిల్లాదా సర్దార(ఓటమి తెలియని నాయకుడు)గా స్వరాష్ట్రం కర్ణాటకలో పేరుగాంచిన మల్లికార్జున ఖర్గే(80) కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికలో విజయం సాధిస్తే కర్ణాటక నుంచి ఎస్.నిజలింగప్ప తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడైన రెండో నేతగా రికార్డుకెక్కుతారు. అలాగే బాబూ జగ్జీవన్ రామ్ తర్వాత పార్టీ అధ్యక్షుడైన రెండో దళిత నాయకుడిగా మరో రికార్డు సృష్టిస్తారు. గాంధీ కుటుంబానికి వీరవిధేయుడైన ఖర్గే 50 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కార్మిక నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించారు. 1969లో కాంగ్రెస్‌లో చేరారు. తొలుత గుల్బర్గా సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. కర్ణాటకలోని గుర్మిత్కల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా 9 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో మొదటిసారిగా గుల్బర్గా నుంచి లోక్‌సభకు పోటీ చేసి, విజయం సాధించారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభంజనంలోనూ భారీ మెజార్టీతో గెలిచారు. 2014 నుంచి 2019 దాకా లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేతగా వ్యవహరించారు. 2019లో తొలిసారిగా ఓటమి చవిచూశారు. 2020 జూన్‌లో కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఎగువసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ, రైల్వే, సామాజిక న్యాయం, సాధికారత శాఖల మంత్రిగా సేవలందించారు. ఖర్గేకు కర్ణాటక సీఎం అయ్యే అవకాశం పలుమార్లు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆయన 1942 జూలై 21న బీదర్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. బీఏ, న్యాయ శాస్త్రం అభ్యసించారు. 1968 మే 13న రాధాబాయిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు ప్రియాంక్ ఖర్గే ప్రస్తుతం కర్ణాటక ఎమ్మెల్యే. గతంలో మంత్రిగా పనిచేశారు.

ఐక్యరాజ్యసమితి నుంచి రాజకీయాల్లోకి..

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష బరిలో నిలిచిన మాటల మాంత్రికుడు శశి థరూర్ (66) అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాను ఎవరో ఆడించినట్లు ఆడే తోలుబొమ్మను కాదని చెబుతున్నారు. విభిన్న రాజకీయవేత్తగా థరూర్‌కు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన చుట్టూ వివాదాలకు లెక్కలేదు. శశి థరూర్ 1956 మార్చి 9న లండన్‌లో జన్మించారు. ఢిల్లీలోని ప్రఖ్యాత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో హిస్టరీలో ఆనర్స్ పూర్తిచేశారు. విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. అమెరికాలోని మెడ్‌ఫోర్డ్‌లో ఫ్లెచర్ స్కూల్ ఆఫ్ లా అండ్ డిప్లొమసీ నుంచి మాస్టర్స్ డిగ్రీ అభ్యసించారు. అక్కడే 1978లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. అనంతరం ఐక్యరాజ్యసమితిలో చేరారు. రష్యా–పశ్చిమ దేశాల నడుమ ప్రచ్ఛన్న యుద్ధం ముగిశాక శాంతి స్థాపన కోసం కృషి చేశారు. ఐరాస ప్రధాన కార్యదర్శికి సీనియర్ సలహాదారుగా సేవలందించారు. ఐరాసలో కమ్యూనికేషన్స్ అండ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అండర్ సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించారు. 2006లో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌గా భారత్ తరఫున అధికారిక అభ్యర్థిగా పోటీపడ్డారు. రెండో స్థానంలో నిలిచారు. అప్పట్లో సెక్రెటరీ జనరల్‌గా దక్షిణ కొరియా రాజకీయ నాయకుడు బాన్ కీ మూన్ విజయం సాధించారు. 2009లో అంతర్జాతీయ సివిల్ సర్వెంట్‌గా థరూర్ పదవీ విరమణ పొందారు. ఇండియాలో అడుగుపెట్టారు. అదే ఏడాది రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో తొలిసారిగా కాంగ్రెస్ టికెట్‌పై కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. యూపీఏ సర్కారు హయాంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2010 ఏప్రిల్‌లో రాజీనామా చేశారు. 2014 జనవరిలో ఆయన భార్య సునంద పుష్కర్ ఓ హోటల్‌లో శవమై కనిపించడం దేశంలో సంచలనం సృష్టించింది. ఆయనపై ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారు. సునంద పుష్కర్ మృతి కేసులో ఢిల్లీ కోర్టు గత ఏడాది థరూర్‌ను నిర్దోషిగా ప్రకటించింది. 2014, 2019 ఎన్నికల్లోనూ తిరువనంతపురం నుంచి ఆయన విజయం సాధించారు. రచయితగా థరూర్‌కు అంతర్జాతీయంగా పేరుప్రతిష్టలు ఉన్నాయి. 23 పుస్తకాలు రాశారు. పలు పురస్కారాలు అందుకున్నారు. ఇందులో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పురస్కారాలు సైతం ఉండడం విశేషం. థరూర్ ఒక దశలో కాంగ్రెస్ నాయకత్వం తీరుపై నిప్పులు చెరిగారు. జి–23 గ్రూప్ నేతల్లో ఒకరిగా అధిష్టానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో సంస్కరణల ఆవశ్యకతను నొక్కిచెప్పారు. సోషల్ మీడియాను ఉపయోగించుకోవడంలో థరూర్ దిట్ట. 2013 దాకా ట్విట్టర్‌లో అత్యధిక ప్రజాదరణ ఉన్న ఇండియన్ లీడర్ థరూరే కావడం గమనార్హం. ఆ తర్వాత ఆ స్థానాన్ని నరేంద్ర మోదీ ఆక్రమించారు.

ఉక్రెయిన్ నగరాలపై రష్యా దాడులు

జపోరిజియాలో మానవతా కాన్వాయ్‌పై జరిగిన దాడిలో 30 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లో నాలుగు ప్రాంతాల విలీనం ఒప్పందంపై సంతకాలు చేయడానికి కొన్ని గంటల ముందే రష్యా క్షిపణులు, రాకెట్లు, డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు నగరాలపై విరుచుకుపడింది. జపోరిజియా నగరంలోని మానవతా కాన్వాయ్‌పై జరిపిన దాడిలో 30 మంది మరణించారు. రష్యా ఆక్రమిత భూభాగంలో ఉన్న తమ బంధువులకి వస్తు సామాగ్రిని అందించడం కోసం వెళుతుండగా ఆ మానవతా కాన్వాయ్‌పై దాడులు జరిగాయి. రష్యాలో తయారైన ఎస్–300 క్షిపణులతో ఈ దాడులు జరిగాయని పోలీసులు వెల్లడించారు.

విలీన ఒప్పందంపై పుతిన్ సంతకం

ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను రష్యాలో విలీనం చేసుకునే ఒప్పందంపై అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం సంతకాలు చేశారు. డొంటెస్క్, లుహాన్స్క్, ఖెర్సాన్, జపోరిజియా ప్రాంతాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరిపామని ఆ ప్రాంత ప్రజలు రష్యాలో విలీనమవడానికి అంగీకరించాయని ఇప్పటికే రష్యా ప్రకటించింది. ఆయా ప్రాంతాలకు చెందిన రష్యా అనుకూల పాలకులు హాజరవగా క్రెమ్లిన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పుతిన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ తమ దేశంలో విలీనమైన ప్రాంతాలను అన్ని విధాల కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. ఏడు నెలలుగా సాగుతున్న యుద్ధంపై ఉక్రెయిన్ వెంటనే శాంతి చర్చలకు రావాలని కోరారు. తమ దేశంలో విలీనమైన ప్రాంతాలను మళ్లీ వెనక్కి ఇచ్చే ప్రసక్తే లేదని పుతిన్ తేల్చి చెప్పారు.తమ దేశాన్ని ఒక కాలనీగా మార్చి, తమ ప్రజల్ని పిరికివాళ్లయిన బానిసలుగా మార్చడానికి పశ్చిమ దేశాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని ఆరోపించారు. ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్, పశ్చిమ దేశాలు ఆ విలీనాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశాయి. ప్రజాభిప్రాయం పేరుతో వారిపై తుపాకులు పెట్టి బలవంతంగా విలీనం చేసుకున్నారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నాయి. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ నాటో కూటమిలో తమ దేశాన్ని చేర్చుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రష్యాకి చెందిన వెయ్యి మంది ప్రజలు, సంస్థలు తమ దేశానికి రాకుండా అమెరికా వారి వీసాలపై నియంత్రణ విధించింది.

సీడీఎస్‌గా జనరల్ చౌహాన్ బాధ్యతలు



న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత సీనియర్ కమాండర్, ఈస్టర్న్ ఆర్మీ మాజీ కమాండర్ జనరల్ చౌహాన్ కొత్త చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) అయ్యారు. దేశ మొట్టమొదటి సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ 9 నెలల క్రితం తమిళనాడులో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన స్థానం జనరల్ చౌహాన్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దేశం ముందున్న భవిష్యత్ భద్రతా సవాళ్లకు త్రివిధ దళాలను సన్నద్ధం చేయడం, ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన థియేటర్ ప్లాన్‌ను అమలు చేయడం జనరల్ అనిల్ చౌహాన్ ప్రధాన లక్ష్యాలు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలటరీ ఎఫైర్స్‌కు సెక్రటరీగాను ఆయన వ్యవహరిస్తారు. సరిహద్దుల్లోని తూర్పు లద్దాఖ్‌లో డ్రాగన్ దేశంతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా పేరున్న జనరల్ చౌహాన్‌ను అత్యున్నత హోదాలో కేంద్రం నియమించడం గమనార్హం. 'భారత సైనిక బలగాల్లో అత్యున్నత హోదాను చేపట్టినందుకు గర్వంగా ఉంది. త్రివిధ దళాలు నాపై ఉంచిన అంచనాలను అందుకునేందుకు నా వంతు కృషి చేస్తాను. అన్ని సవాళ్లను, ఇబ్బందులను కలిసికట్టుగా ఎదుర్కొంటాం' అని ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ అన్నారు. రైజినా హిల్స్‌లోని సౌత్ బ్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలో జనరల్ చౌహాన్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. 1961లో జన్మించిన జనరల్ చౌహాన్ 1981లో భారత సైన్యంలోని 11 గూర్ఖా రైఫిల్స్‌లో చేరారు.

పీడీ.. వ్యక్తిగత స్వేచ్ఛపై దండయాత్రే: సుప్రీం

న్యూఢిల్లీ: ముందస్తు నిర్బంధం(పీడీ) అనేది పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛపై తీవ్రమైన దండయాత్రేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇలాంటి చర్యలు చేపట్టే విషయంలో రాజ్యాంగం, చట్టాలు కల్పించిన రక్షణలు, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది. 2021 నవంబర్ 12న త్రిపుర ప్రభుత్వం జారీ చేసిన పీడీ ఉత్తర్వును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ జేబీ పార్దీవాలాల ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. పీఐటీఎన్‌డీపీఎస్ చట్టం–1988 కింద అరెస్టు చేసిన నిందితుడిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. పీడీ చట్టం కింద అరెస్టు చేస్తే నిందితులు ఏడాదిపాటు జైల్లోనే ఉండాల్సి వస్తోందని, దీనివల్ల వారికి తమపై నమోదైన కేసుల్లో నిరపరాధినని నిరూపించుకొనే అవకాశం లేకుండా పోతోందంది.

ప్రచారం కోసం ఇక్కడికి రావొద్దు

కేవలం ప్రచారం కోసం న్యాయస్థానానికి రావొద్దని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎంల)ను ఎన్నికల సంఘం (ఈసీ) కాకుండా కొన్ని కంపెనీలు నియంత్రిస్తున్నాయంటూ మధ్యప్రదేశ్‌కు చెందిన జన్ వికాస్ పార్టీ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకాల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'దేశంలో దశాబ్దాలుగా ఈవీఎంలు వాడకంలో ఉన్నాయి. కానీ, ఎప్పటికప్పుడు సమస్యలు లేవనెత్తేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అటువంటిదే ఇది. ఓటర్ల ఆదరణ పెద్దగా పొందలేని ఓ రాజకీయ పార్టీ ఇటువంటి పిటిషన్ల ద్వారా గుర్తింపు పొందాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది'అని ధర్మాసనం పేర్కొంది. నాలుగు వారాల్లోగా సుప్రీంకోర్టు గ్రూప్–సి ఉద్యోగుల సంక్షేమ సంఘంలో రూ.50 వేలు జమ చేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

దేశ భవితను తీర్చిదిద్దేది నగరాలే



వందేభారత్ రైలులో ప్రయాణిస్తున్న ప్రధాని మోదీ

- గాంధీనగర్–ముంబై మధ్య వందేభారత్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ
- దేశంలో ఇది మూడో రైలు

అహ్మదాబాద్: భారత్ భవిష్యత్‌ను నగరాలే తీర్చిదిద్దుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చడానికి నగరాలే కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్య డిమాండ్‌కి అనుగుణంగా కొత్త నగరాలను దేశంలో నిర్మిస్తున్నామని చెప్పారు. గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి మహారాష్ట్రలో ముంబై మధ్య నడిచే సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్, అహ్మదాబాద్ మెట్రో రైలు ఫేజ్–1ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం అక్కడికి వచ్చిన జన సందోహాన్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. గాంధీనగర్–అహ్మదాబాద్ జంట నగరాలుగా మారి అద్భుతమైన అభివృద్ధిని సాధించాయన్నారు. ''మారుతున్న కాలానికి తగ్గట్టుగా నగరాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలోని నగరాల్లో అధికంగా దృష్టి సారించి పెట్టుబడులు భారీగా పెడుతున్నాము. వచ్చే 25 ఏళ్లలో ఈ నగరాలే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుపుతాయి'' అని మోదీ అన్నారు. నగరాల అభివృద్ధితో పాటు ఎంపిక చేసిన పట్టణాలను స్మార్ట్ సిటీలుగా రూపురేఖలు మార్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గాంధీ నగర్‌లో ఉదయం 10.30 గంటలకి మోదీ పచ్చ జెండా ఊపి వందేభారత్ రైలుని ప్రారంభించారు. ఆ తర్వాత అదే రైల్లో నగరంలోని అహ్మదాబాద్‌లోని కాలూపూర్ రైల్వే స్టేషన్ వరకు మోదీ ప్రయాణించారు. ''వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రధాని మోదీ ప్రయాణించారు. రైల్వే సిబ్బంది కుటుంబసభ్యులు, మహిళా వ్యాపారవేత్తలు, యువతీయువకులు ఆయన తోటి ప్రయాణికులుగా ఉన్నారు'' అని ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. దేశంలో ఇది మూడో వందేభారత్ రైలు. 2019లో మొట్టమొదటి రైలు న్యూఢిల్లీ–వారణాసి మధ్య ప్రారంభం కాగా, రెండో రైలు న్యూఢిల్లీ–శ్రీమాతా వైష్ణోదేవి కాత్రా మార్గంలో ప్రారంభమైంది. అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కి ప్రధాని మోదీ తిరుగు ప్రయాణంలో ఒక అంబులెన్స్‌కి దారి ఇవ్వడానికి ఆయన కాన్వాయ్‌ని నిలిపివేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కవచ్ టెక్నాలజీతో భద్రతా వ్యవస్థ

వందేభారత్ రైలులో రైళ్లు ఢీకొట్టుకునే ప్రమాదాన్ని నివారించడానికి దేశీయ కవచ్ టెక్నాలజీని వినియోగించారు. పూర్తి ఎయిర్ కండిషన్ సదుపాయంతో పాటు ఆటోమేటిక్ తలుపులు, ప్రతీ సీటు దగ్గర మొబైల్ చార్జింగ్ పాయింట్లు,అటెండెంట్‌ను పిలవడానికి కాల్ బటన్, బయో టాయిలెట్లు, సీసీ కెమెరాలున్నాయి. గంటకి 160 కి.మీ. గరిష్ట వేగంతో రైలు ప్రయాణించగలదు. శుక్రవారం ఈ రైలు అయిదున్నర గంటల్లో ముంబైకి చేరింది.

క్లుప్తంగా...

కేజ్రీవాల్‌కు ఆతిథ్యం.. ఆ తర్వాత మోదీకి జై!

అహ్మదాబాద్: రెండు వారాల క్రితం కేజ్రీవాల్‌ను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించి వార్తల్లో నిలిచిన అహ్మదాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ విక్రమ్ దంతానీ మాట మార్చాడు. తాను ప్రధాని మోదీకి పెద్ద అభిమానినని, మొదట్నుంచీ బీజేపీకి గట్టి మద్దతుదారునని చెప్పుకున్నాడు. శుక్రవారం తాల్టెజ్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న సభలో విక్రమ్ కాషాయ కండువా, బీజేపీ టోపీతో ప్రత్యక్షమయ్యాడు. ఆటో యూనియన్ నేతలు చెప్పినందుకే కేజ్రీవాల్‌ను ఇంటికి భోజనానికి ఆహ్వానించానని మీడియాకు చెప్పాడు. ఆప్‌తో ఏ విధమైన సంబంధం లేదని చెప్పుకొచ్చాడు.

అఫ్గాన్‌లో విద్యా సంస్థపై ఆత్మాహుతి దాడి

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లోని ఓ విద్యా సంస్థలో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో 19 మంది చనిపోగా మరో 27 మంది గాయపడ్డారు. మైనారిటీ షియాలు ఎక్కువగా ఉండే దస్తిబార్చి ప్రాంతంలోని కాజ్ హయ్యర్ ఎడ్యుకేషనల్ సెంటర్‌లో ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం విద్యార్థినీ విద్యార్థులంతా ఒకే చోట కూర్చుని పరీక్షలకు ప్రిపేరవుతుండగా పేలుడు జరిగినట్లు పోలీసులు చెప్పారు. తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి షియాలే లక్ష్యంగా ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్) హింసాత్మక చర్యలకు పాల్పడుతోంది.

రాఘవ్ చద్దా అరెస్ట్‌కు ప్రయత్నాలు: కేజ్రీవాల్

ఢిల్లీ: గుజరాత్ వ్యవహారాల పార్టీ ఇన్‌చార్జిగా ఇటీవల నియమితులైన ఆప్ నేత రాఘవ్ చద్దాను అరెస్ట్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న చద్దాపైనే ఇప్పుడు దృష్టి పడిందన్నారు. అయితే, ఏ ఆరోపణలపై అరెస్ట్ చేసేందుకు ఎవరు ప్రయత్నిస్తున్నారనే విషయం ఆయన వివరించలేదు. ఆప్ నేతలను అరెస్ట్ చేయడం ద్వారా గుజరాత్‌లో తమను ఓడించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేర్కొన్నారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘన విజయంలో చద్దా కీలకంగా వ్యవహరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ కోసమే పీఎఫ్‌ఐపై నిషేధం: మాయావతి

లక్నో: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడం పట్ల బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)కు సంతోషం కలిగించడంతోపాటు రాజకీయ స్వార్థంతోనే ఈ సంస్థను నిషేధించారని మండిపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందడానికే నిషేధ నాటకం ఆడుతున్నారని ట్వీట్ చేశారు.

వ్యాపమ్ కేసులో ఐదుగురికి ఏడేళ్ల కఠిన కారాగారం

భోపాల్: సంచలనం సృష్టించిన వ్యాపమ్ కుంభకోణం కేసులో ఐదుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ భోపాల్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. 2013లో మధ్యప్రదేశ్ వ్యావసాయిక్ పరీక్ష మండల్(వ్యాపమ్) చేపట్టిన పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో ఐదుగురికి ప్రత్యేక కోర్టు జడ్జి నీతిరాజ్ సింగ్ సిసోడియా రూ.10 వేల చొప్పున జరిమానా కూడా విధించారు.

కాంగి'రేసు'

కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలపైనే అందరి దృష్టి

- స్వాతంత్య్రం వచ్చాక నాలుగోసారి ఎన్నిక
- 40 ఏళ్లు గాంధీ కుటుంబం చేతిలోనే కాంగ్రెస్
- 24 ఏళ్ల తర్వాత ఇతరులకి అవకాశం రావడంతో ప్రాధాన్యం

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. గాంధీ కుటుంబానికి చెందిన సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలు అధ్యక్ష పగ్గాలు చేపట్టడానికి విముఖంగా ఉండడంతో పోటీ అనివార్యమైంది. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక జరగడం ఇది నాలుగోసారి.1998లో సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టాక అన్నిసార్లు ఏకగ్రీవంగానే ఎన్నిక జరిగింది. ఈ సారే అధ్యక్ష ఎన్నికకు పోటీ జరుగుతోంది.

ఎన్నిక ప్రక్రియ సాగేదిలా..

కాంగ్రెస్ పార్టీ నియమావళిలోని సెక్షన్ XVIII ప్రకారం అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. సోనియా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడే సంస్థాగతంగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. పార్టీ అధ్యక్ష ఎన్నిక నిర్వహణకు స్వతంత్రంగా వ్యవహరించే సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ (సీఈఏ) ఏర్పాటు చేశారు. గుజరాత్ మాజీ ఎంపీ మధుసూదన్ మిస్త్రీ ప్రస్తుతం సీఈఏ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దీని ఆధ్వర్యంలోనే అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. పార్టీ ఎలక్టోరల్ కాలేజీలో 9 వేల మందికిపైగా ప్రతినిధులు ఉన్నారు. వీరందరికీ ఓటు వేసే హక్కు ఉంది. పార్టీలో ప్రతినిధుల్ని ఎన్నుకొనే ప్రక్రియ కూడా ఒక క్రమ పద్ధతిలో సాగుతుంది. క్షేత్రస్థాయిలో ఉన్న బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు పీసీసీ ప్రతినిధుల్ని ఎన్నుకుంటారు. పీసీసీ ప్రతినిధులు ఏఐసీసీ ప్రతినిధుల్ని ఎన్నుకుంటారు. వీరితో పాటు పీసీసీ అధ్యక్షులుగా కనీసం ఒక సంవత్సరం పదవిలో ఉన్న వారు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించే ఏఐసీసీ సభ్యులు, పార్టీ ఎమ్మెల్యేలు, పీసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యులందరూ ప్రతినిధులుగానే ఉంటారు. అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకునే వారు తప్పనిసరిగా పార్టీలో ప్రతినిధి అయి ఉండాలి. పార్టీ ప్రతినిధుల్లో 10 మంది వారిని ప్రతిపాదించాల్సి ఉంటుంది. నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ముగిశాక ఇద్దరు పోటీలో ఉంటే ఎన్నిక నిర్వహిస్తారు. ఒక్కరే ఉంటే వారి ఎన్నిక ఏకగ్రీవమవుతుంది.

అధ్యక్ష ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరిగాయంటే

- 1950లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆచార్య కృపలాని, పురుషోత్తమ్ దాస్ టాండన్ మధ్య గట్టి పోటీ జరిగింది. అప్పట్లో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మద్దతునిచ్చిన కృపలాని ఓడిపోయారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ అనుచరుడిగా ముద్ర పడిన టాండన్ అధ్యక్షుడయ్యారు. టాండన్‌కు 1,306 ఓట్లు వస్తే, కృపలానీకి 1,092 ఓట్లు వచ్చాయి.
- ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లో 47 ఏళ్ల తర్వాత ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. 1997లో జరిగిన ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగింది. సీతారామ్ కేసరి, శరద్ పవార్, రాజేశ్ పైలట్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో సీతారాం కేసరి బంపర్ మెజార్టీ సాధించారు. మహారాష్ట్ర, యూపీ మినహాయించి అన్ని రాష్ట్రాల యూనిట్లు కేసరికే జై కొట్టారు. కేసరికి 6,224 ఓట్లు వస్తే, పవార్‌కు 882, పైలెట్‌కు 354 ఓట్లు వచ్చాయి.
- 2000లో కూడా అధ్యక్ష ఎన్నిక జరిగింది. సోనియాగాంధీపైన జితేంద్ర ప్రసాద సవాల్ విసిరారు. ప్రసాద ఘోరమైన ఓటమి చవిచూడాల్సి వచ్చింది. సోనియాకు 7,400 ఓట్లు లభిస్తే జితేంద్ర ప్రసాదకి 94 ఓట్లు వచ్చాయి.
- 22 ఏళ్ల తర్వాత ఇప్పుడు మరోసారి అధ్యక్ష ఎన్నిక అనివార్యంగా మారింది.

నామినేషన్ల ఉపసంహరణకు గడువు : అక్టోబర్ 8	
పోలింగ్ తేదీ : అక్టోబర్ 17	
ఫలితాల ప్రకటన : అక్టోబర్ 19	

– నేషనల్ డెస్క్, సాక్షి

75 ఏళ్లలో 16 మంది అధ్యక్షులు

ఈ 75 ఏళ్లలో 40 ఏళ్లపాటు గాంధీ కుటుంబమే పార్టీని నడిపించింది.స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌కి 16 మంది అధ్యక్షులైతే వారిలో అయిదుగురు గాంధీ కుటుంబానికి చెందినవారే. నలుగురు తెలుగువాళ్లు పట్టాభి సీతారామయ్య, దామోదరం సంజీవయ్య, నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు అధ్యక్షులుగా వ్యవహరించారు. 1947లో ఆచార్య కృపలాని, 1948–49లో పట్టాభి సీతారామయ్య ఆ తర్వాత టాండన్ అధ్యక్షుడిగా ఉన్నారు. నెహ్రూ 1951–55 వరకు, ఆ తర్వాత యూఎన్ ఢేబర్ పగ్గాలు చేపట్టారు. 1959లో ఇందిరతొలిసారి అధ్యక్షురాలయ్యారు. ఆ తర్వాత నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కామరాజ్, నిజలింగప్ప, జగజ్జీవన్ రామ్, శంకర్ దయాళ్ శర్మ, దేవకాంత్ బారువా అధ్యక్షులుగా ఉన్నారు. 1978–1984 సంవత్సరాల మధ్యలో ఇందిర మళ్లీ పగ్గాలు చేపట్టారు. ఇందిర హత్యానంతరం రాజీవ్ గాంధీ అధ్యక్ష పగ్గాలు చేపట్టి 1991 వరకు ఉన్నారు. రాజీవ్ హత్యానంతరం పీవీ నరసింహారావు పగ్గాలు చేపట్టి 1996 వరకు కొనసాగారు. 1996–98 మధ్య సీతారాం కేసరి అధ్యక్షుడిగా ఉన్నారు. 1998లో అధ్యక్షురాలైన సోనియా 19 ఏళ్ల పదవిలో ఉండి రికార్డు సృష్టించారు. 2017–2019 కాలంలో రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2019 నుంచి సోనియా కొనసాగుతున్నారు.

క్లుప్తంగా

కారుణ్య నియామక ఉత్తర్వులపై వీఆర్వోల హర్షం

- 15 వేల మందికి సీఎం వైఎస్ జగన్ భరోసా
- సజ్జలను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వీఆర్వో సంఘాలు

సాక్షి, అమరావతి: గ్రేడ్‌-1, 2 వీఆర్వోలుగా పనిచేస్తూ మరణించిన వారి వారసులలో డిగ్రీ విద్యార్హత కలిగిన ఒకరికి రెవెన్యూ శాఖలో జూనియర్ సహాయకుడు లేదా తత్సమాన పోస్టులో కారుణ్య నియామకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వీఆర్వోలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 15 వేల మంది వీఆర్వోల జీవితాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని కొనియాడారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీఆర్వోల సంఘం, గ్రేడ్‌-2 వీఆర్వోల సంఘం, డైరెక్ట్ రిక్రూట్మెంట్ వీఆర్వోల సంఘం అధ్యక్షులు కె.ఆంజనేయకుమార్, పి.అనుపమ, పి.ప్రసన్న శుక్రవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం జగన్‌కు తాము రుణపడి ఉంటామని చెప్పారు.

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు నోటిఫికేషన్

- వైద్య విద్య పీజీ, ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ, ఎండీఎస్ కోర్సుల్లో 2022–23 విద్యా సంవత్సరానికి యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాల తొలి దశ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్‌ల నమోదుకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు శనివారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటలలోగా ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆప్షన్‌ల నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే 74165 63063, 74162 53073 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేటి నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఓటర్ల నమోదు

- త్వరలో గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- కొత్త ఓటర్ల నమోదుకు నవంబర్ 7తో గడువు పూర్తి

సాక్షి, అమరావతి: త్వరలో ఎన్నికలు జరగనున్న మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, రెండు టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానుంది. ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, కడప–అనంతపురం–కర్నూలు, శ్రీకాకుళం–విజయనగరం–విశాఖపట్నం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు, ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, కడప–అనంతపురం–కర్నూలు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనుండటంతో ఈ స్థానాల్లో కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. అక్టోబర్ 1న పత్రికా ప్రకటన విడుదల చేస్తామని, టీచర్ నియోజకవర్గంలో ఓటరు నమోదుకు ఫారం 19, గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఫారం18 వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కోరారు. సీఈవో ఆంధ్రా వెబ్‌సైట్‌లో ఈ ఫారాలను దరఖాస్తు చేయడం ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది. కొత్త ఓటర్ల నమోదుకు నవంబర్ 7 చివరి తేదీగా నిర్ణయించారు. నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించి, డిసెంబర్ 12 వరకు వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.

‘ఫేషియల్ అథంటికేషన్’కు అనుమతి

- దేశంలో ఈ అవకాశం పొందిన తొలి రాష్ట్రం ఏపీనే
- ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఇకపై తేలికగా గుర్తింపు
- ఉద్యోగుల హాజరు సహా అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ వినియోగానికి వీలు
- ఇప్పటిదాకా కొన్ని కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల్లోనే అమలు
- రెండు నెలలపాటు ‘పైలెట్’ నిర్వహణ అనంతరం యూఐడీఏఐ ఆమోదం

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపు, ఉద్యోగుల హాజరు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆధార్ అనుసంధానంతో కూడిన ‘ఫేషియల్ అథెంటికేషన్’ వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందింది. దేశంలో ఇలా ఆమోదం పొందిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో మాత్రమే ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫార్మాటిక్స్ సెంటర్) ద్వారా నిర్వహించే పలు కార్యక్రమాల్లో ఆధార్ ఫేషియల్ అథంటికేషన్ వినియోగిస్తున్నారు. నిజానికి.. మన రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో, ప్రభుత్వోద్యోగుల హాజరులో ఆధార్ బయోమెట్రిక్ విధానాన్ని మాత్రమే అమలుచేస్తున్నారు. అయితే.. ఈ విధానంలో లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించడానికి, ఉద్యోగుల హాజరు నమోదుకు మొబైల్ ఫోన్లు, యాప్‌లకు తోడు ప్రత్యేక వేలిముద్రల నమోదు యంత్రాలను ఉపయోగిస్తారు. సంక్షేమ పథకాల కోసం ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడు లక్షల బయోమెట్రిక్ పరికరాలను ప్రభుత్వ యంత్రాంగం వినియోగిస్తోంది. ఇవి సున్నితమైనవి కావడంతో.. ఏటా 30–40 వేల పరికరాలు కొత్తవి కొనుగోలు చేయాల్సి ఉంటోంది. ఇందుకు ఏటా రూ.10–12 కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు.. వేలిముద్ర సరిపోక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు



పడుతున్నారు. ఫేషియల్ అథంటికేషన్ విధానంలో అయితే అదనంగా ఎలాంటి పరికరాలు అక్కర్లేదని అధికారులు వెల్లడించారు. మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుని ముఖాన్ని స్కాన్ చేయగానే అది ఆధార్‌కు అనుసంధానమై లబ్ధిదారుణ్ణి గుర్తిస్తుందని అధికారులు తెలిపారు.

80 వేల మందికి పింఛన్ల పంపిణీకి రూ.కోటి ఖర్చు..

ఇక ప్రస్తుతం అమలుచేస్తున్న బయోమెట్రిక్ విధానంలో ప్రతినెలా పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల వేలిముద్రలు సరిపోక అనేకచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వృద్ధులు, ఎక్కువ కాయకష్టం పనులు చేసుకునే వాళ్ల వేలిముద్రలు అరిగిపోవడంతో బయోమెట్రిక్ సమయంలో ఇచ్చే వేలిముద్రలకు ఆధార్ నమోదు సమయంలో ఇచ్చిన వేలిముద్రలతో సరిపోక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బయోమెట్రిక్ స్థానంలో ఐరిస్ విధానం అమలుచేసినా.. కళ్ల శుక్లం ఆపరేషన్ చేసుకున్న వారితోనూ సమస్యలు ఏర్పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇలా పింఛన్ల పంపిణీలో వేలిముద్రలు సరిపోక ప్రతినెలా 80 వేల మందికి ఆధార్‌తో సంబంధం లేకుండా పంపిణీ జరుగుతోంది. ఇలాంటి వారి ఫొటోలను స్థానిక సిబ్బందే ముందుగా యాప్‌లో నమోదుచేసి, పంపిణీ చేసే సమయంలో ఆ లబ్ధిదారుని ఫొటో సరిపోల్చుకుని పంపిణీ చేస్తున్నారు. నిజానికి.. ఒక లబ్ధిదారునికి ఒక విడత పంపిణీ చేస్తే రూ.10 చొప్పున సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌కు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇప్పుడు పింఛన్ల పంపిణీలో ఆధార్ ఫేషియల్ విధానాన్ని ప్రవేశపెడితే మధ్యలో సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్‌కు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆధార్ బేస్డ్ ‘ఫేషియల్ అథంటికేషన్’లో కొద్దిపాటి అవినీతికీ ఆస్కారముండదని అధికార వర్గాలు వివరించాయి.

ప్రయోగాత్మకంగా అమలుచేశాకే పూర్తిస్థాయిలో..

ఈ రెండు విధానాలు ఆధార్ డేటాతో అనుసంధానం అవుతున్నప్పటికీ బయోమెట్రిక్ విధానంలో తలెత్తే ఇబ్బందులన్నింటినీ ఫేషియల్ అథంటికేషన్ విధానంతో అధిగమించడంతోపాటు పూర్తి పారదర్శకంగానూ అమలుచెయ్యొచ్చని అధికారులు అంటున్నారు. అలాగే, బయోమెట్రిక్ స్థానంలో ఫేషియల్ అథంటికేషన్ అమలుచేయాలంటే కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆమోదంతోపాటు యూఐడీఏఐ విభాగం అనుమతి తప్పనిసరి. దీంతో రాష్ట్రంలో ఫేషియల్ అథంటికేషన్ విధానం అమలుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫరేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, యూఐడీఏఐ అనుమతిని గ్రామ, వార్డు సచివాలయ శాఖ కోరింది. ఆయా సంస్థల సూచనల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రధాన కార్యాలయంలో అమలుచేశారు. ఆ తర్వాతే ఆధార్ ఫేషియల్ అథంటికేషన్ వినియోగానికి ఆమోదం లభించింది.

సచివాలయ ఉద్యోగులకు ‘ఫేషియల్’

ఇక గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా శుక్రవారం నుంచి ఆధార్ అనుసంధానంతో కూడిన ఫేషియల్ (ముఖం గుర్తింపు) ద్వారా కూడా హాజరు నమోదుచేసుకునే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొబైల్ యాప్‌లో శుక్రవారం కొత్తగా ఈ సౌకర్యాన్ని కల్పించారు. ఇక నుంచి సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు బయోమెట్రిక్ (వేలిముద్రలు) విధానంతోపాటు ఐరిస్ (కళ్ల గుర్తింపు) విధానం, కొత్తగా ఫేషియల్ విధానంలోనూ హాజరు నమోదుకు వీలు కల్పించారు. ఈ మూడింట్లో దేని ద్వారానైనా హాజరు నమోదు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

ట్రిపుల్ ఐటీ సీట్లలో అగ్రభాగంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా



నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్లకు సంబంధించి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి అత్యధికంగా, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అత్యల్పంగా విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 4,400 సీట్లు ఉండగా, వీటిలో 400 సీట్లు ఈడబ్ల్యూఎస్ సీట్లు కాగా, ప్రత్యేక కేటగిరి కింద 280 సీట్లు మినహా 4,120 సీట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. వీటిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 463 మంది, గుంటూరులో 434 మంది, నెల్లూరులో 393 మంది, పశ్చిమ గోదావరిలో 128 మంది, శ్రీకాకుళంలో 391 మంది, విజయనగరంలో 337 మంది, విశాఖలో 244 మంది, తూర్పు గోదావరిలో 275 మంది, కృష్ణాలో 269 మంది, కడపలో 231 మంది, కర్నూలో 260 మంది, చిత్తూరులో 357 మంది, అనంతపురంలో 232 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో బాలికలే అధికంగా ఉన్నారు. బాలికలు 2,721 మంది ఎంపికవ్వగా, బాలురు 1,399 మంది మాత్రమే ఎంపికయ్యారు. మొత్తం సీట్లలో ఎంపికైన బాలికల శాతం 66.04, బాలుర శాతం 33.96గా ఉంది. బాలికలు నూజివీడు ట్రిపుల్ ఐటీకి 677 మంది, ఇడుపులపాయకు 676 మంది, ఒంగోలుకు 680 మంది, శ్రీకాకుళానికి 688 మంది ఎంపికయ్యారు. ఏపీ నుంచి 4,014 మంది, తెలంగాణ నుంచి 106 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో ఉన్నారు.

ముగిసిన ట్రిపుల్ ఐటీ ప్రత్యేక కేటగిరి సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం నిర్వహిస్తోన్న అడ్మిషన్లలో భాగంగా సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి దివ్యాంగులకు 120 సీట్లు, సైనికోద్యోగుల పిల్లలకు 80, ఎన్‌సీసీ 40, స్పోర్ట్స్ కోటా 20, స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 20 సీట్లు ఉన్నాయి. ఆయా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్.ఎస్.ఎస్.వి.గోపాలరాజు పర్యవేక్షణలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించారు. క్రీడా కోటాకు 622 మంది, ఎన్‌సీసీ కోటాకు 1,267 మంది, సైనికోద్యోగుల పిల్లల కోటాకు 272 మంది, వికలాంగుల కోటాకు 198 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాకు 63 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు 392 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: పేద విద్యార్థులకు పెద్ద చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యాదీవెన కోసం 392 దరఖాస్తులు వచ్చాయి. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఈ పథకంలో దరఖాస్తులకు సెప్టెంబర్ 30 వరకు ఇచ్చిన గడువు శుక్రవారం ముగిసింది. ప్రభుత్వ ఆర్థికసాయంతో విదేశాల్లో ఉన్నత చదువుల కోసం ఉద్దేశించిన ఈ పథకం రాష్ట్రంలో అగ్రవర్ణ పేదలు (ఈబీసీ), బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వర్తిస్తుంది. వచ్చిన దరఖాస్తులు, వాటికి జతచేసిన ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించిన తరువాత ప్రత్యక్ష ఇంటర్వ్యూల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెనను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటుగా ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారందరికీ వర్తింపజేయడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా ఒకటి నుంచి 200 క్యూఎస్ ర్యాంకులు కలిగిన విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ఇది మేలు చేస్తుంది. ఒకటి నుంచి వంద క్యూఎస్ ర్యాంకింగ్ కలిగిన యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకున్న వారికి ఫీజు రూ.కోటి అయినా నూరుశాతం ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. 101 నుంచి 200 క్యూఎస్ ర్యాంకులున్న యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకుంటే రూ.50 లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. ఈ పథకానికి వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షల వరకు పెంచడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత ఉన్న ఎంతమందికైనా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుడు కె.హర్షవర్ధన్ తెలిపారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనకు కేటగిరీల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

కేటగిరి	దరఖాస్తుదారులు
ఈబీసీ	143
కాపు	70
ఎస్సీ	30
ఎస్టీ	3
బీసీ	109
మైనారిటీ	37
మొత్తం	392



అన్ని ప్రాంతాల మేలుకే 3 రాజధానులు

- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన పేరేచర్ల వాసి మస్తాన్ వలి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారి ప్రయోజనాల కోసమే ప్రభుత్వం మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందని, దానికి అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మార్చి మూడో తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రామానికి చెందిన మస్తాన్ వలి తరఫున న్యాయవాది శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం అధికార వికేంద్రీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచే విధంగా ఈ నిర్ణయం ఉందని పిటిషన్‌లో తెలిపారు. ఏపీ సీఆర్‌డీఏ చట్టం రద్దు చేసినప్పటికీ అధికార పరిధికి మించి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. పిటిషనర్ కోరని ఉపశమనాన్ని మంజూరు చేయడానికి కోర్టుకు అర్హత లేదని సుప్రీంకోర్టు గతంలో పేర్కొన్న విషయాన్ని ఈ పిటిషన్‌లో ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల వారికి న్యాయం జరిగేలా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.

150 ఎంబీబీఎస్ సీట్లతో ‘శ్రీబాలాజీ’లో అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: తిరుపతి జిల్లా రేణిగుంటలో నూతనంగా ఏర్పాటైన శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి 150 ఎంబీబీఎస్ సీట్లతో అడ్మిషన్‌లు మొదలుపెట్టడానికి ఎన్ఎంసీ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ)ని ఎన్ఎంసీ జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరానికి (2022–23) రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 5,210 చేరనుంది.

మీ సర్క్యులర్లు అమలయ్యేలా చర్యలు తీసుకోండి

- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి హైకోర్టు ఆదేశం
- నిత్యావసరాల అక్రమ రవాణా వాహనాలను స్థాయి ఉన్న అధికారులే జప్తు చేయాలి
- ఇతరులు జప్తు చేయడమంటే అక్రమార్కులను ప్రోత్సహించినట్టే
- ఇలాంటివి పునరావృతం కాకూడదు
- ఇకపై ఉల్లంఘనలు జరగవని హైకోర్టుకు నివేదించిన డీజీపీ

సాక్షి, అమరావతి: నిత్యావసరాలను అక్రమంగా రవాణా చేసే వాహనాల జప్తు విషయంలో మీరిచ్చిన సర్క్యులర్‌ను కిందిస్థాయి పోలీసులు అమలు చేసేలా గట్టి చర్యలు తీసుకోవాలని డీజీపీకి హైకోర్టు స్పష్టంచేసింది. చట్టం నిర్దేశించిన అధికారులు కాకుండా ఇతరులు జప్తు చేయడం, పంచనామాను స్వతంత్ర వ్యక్తులు కాకుండా ప్రభుత్వాధికారులే చేపట్టడం వల్ల 90 శాతం కేసులు వీగిపోతున్నాయని చెప్పింది. పట్టబడిన వాహనాల్లోని నిత్యావసరాలు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నవేనని తెలిపింది. చట్ట ప్రకారం వ్యవహరించకపోతే వాటిని జప్తు చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించింది. పోలీసుల తీరు చూస్తుంటే అక్రమ రవాణాదారులతో కుమ్మక్కవుతున్నట్లు ఉందని తెలిపింది. ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని డీజీపీకి స్పష్టం చేసింది. నిత్యావసరాల అక్రమ రవాణా వాహనాలను ఇకపై ఎస్ఐ స్థాయికి తగ్గని అధికారే జప్తు చేస్తారని, ఈ విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు తానిచ్చిన సర్క్యులర్లు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా గట్టి చర్యలు తీసుకుంటానని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. ఈ బాధ్యతలను జిల్లా ఎస్పీలు తీసుకుంటారని, వారే పర్యవేక్షిస్తారని తెలిపారు. ఇకపై ఉల్లంఘనలకు ఆస్కారం ఉండదని వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా పాములపాడు పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నామంటూ తన వాహనాన్ని జప్తు చేసిన వ్యవహారంపై షేక్ మహ్మద్ దాఖలు చేసిన వ్యాజ్యంపై ఈ నెల 28న విచారణ జరిపిన జస్టిస్ దేవానంద్.. స్వయంగా తమ ముందు హాజరవ్వాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం జస్టిస్ దేవానంద్ ముందు హాజరయ్యారు. డీజీపీ తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. డీజీపీ సర్క్యులర్ ప్రకారం నడుచుకోనందుకు పాములపాడు ఎస్ఐ, ఏఎస్ఐలను సస్పెండ్ చేశామన్నారు. ఇకపై ఏ ఉల్లంఘన జరిగినా అందుకు బాధ్యులైన అధికారులను డిస్మిస్ చేస్తామని డీజీపీ చెప్పారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, ఇలా అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని, ఏ పోర్టుకు చేరుతుందో పోలీసు బాస్‌గా మీకు తెలిసే ఉంటుందని వ్యాఖ్యానించారు.

‘బిగ్‌బాస్’లపై చర్యలు తీసుకోరా?

- ఇలాంటి షోలను కట్టడిచేసేందుకు చట్టం తెచ్చే ఉద్దేశం ఉందా, లేదా?
- సామాజిక సమస్యలపై స్పందించరా?
- కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. పలు శాఖలకు నోటీసులు
- కుటుంబ సభ్యులంతా కలిసిచూసేలా ఉంటున్నాయా?
- బూతులు, కొట్టుకోవడం, తిట్టుకోవడం తప్ప ఏముంటున్నాయి?
- హైకోర్టు ధర్మాసనం ఆవేదన
- విచారణ అక్టోబర్ 11కి వాయిదా



సాక్షి, అమరావతి: ఎలాంటి సెన్సార్‌షిప్ లేకుండా ప్రసారం అవుతున్న బిగ్‌బాస్ వంటి షోల విషయంలో ఏం చర్యలు తీసుకోరా? అంటూ హైకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇలాంటి షోలను కట్టడి చేసేందుకు ఏదైనా చట్టం తెచ్చే ఉద్దేశం ఉందా.. సామాజిక సమస్యలపై స్పందించే ఉద్దేశం మీకుందా? అంటూ నిలదీసింది. ప్రజలు చైతన్యవంతంగా లేరని భావించవద్దని, ఈ రోజు చైతన్యంగా లేకపోయినా, రేపు ఓ రోజు ప్రజలు తమ చైతన్యాన్ని కచ్చితంగా చూపుతారని పేర్కొంది. ఈ విషయాన్ని విస్మరించవద్దని సూచించింది. బిగ్‌బాస్ షోపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషనర్ 2019లోనే ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినా ఇప్పటివరకు ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ప్రశ్నించింది. బిగ్‌బాస్ వంటి షోల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర ప్రసార, సమాచారశాఖ కార్యదర్శి, కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ తదితరులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. బిగ్‌బాస్ వంటి షోల ద్వారా వాటి నిర్వాహకులు ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ధర్మాసనం ప్రశ్నించింది.

బిగ్‌బాస్ షోను నిలిపేసేలా ఆదేశాలివ్వండి..

అశ్లీల, అసభ్య, అనైతిక, హింసాత్మక చర్యలను ప్రోత్సహించడంతోపాటు యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ షో ప్రసారాన్ని నిలిపేస్తూ ఆదేశాలివ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ శేషసాయి ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బిగ్‌బాస్ షో అశ్లీలత, అసభ్యతను ప్రోత్సహిస్తోందన్నారు. సెన్సార్‌షిప్ లేకుండానే ఈ షోను ప్రసారం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం బిగ్‌బాస్ 6వ సీజన్ జరుగుతోందని, ఇలాంటి షోల విషయంలో కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు.

మంచి సందేశాలిచ్చే కార్యక్రమం ఒక్కటైనా ఉంటుందా?

ధర్మాసనం స్పందిస్తూ.. ‘సమాజంలో ఏం జరుగుతోంది? టీవీల్లో గతంలో దేశభక్తుల చరిత్రలు ప్రసారం చేసేవారు. ఇప్పుడు ఎలాంటి కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. ప్రజలకు మంచి సందేశాలిచ్చే కార్యక్రమం ఒక్కటైనా ఉంటోందా? ఏ కార్యక్రమంలో కూడా సృజనాత్మకత ఉండటం లేదు. ఇలాంటి షోల విషయంలో ఏం చేయబోతున్నారో చెప్పండి..’ అంటూ కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. శివప్రసాద్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. బిగ్‌బాస్ షోలో పాల్గొనేవారు జుగుప్సాకరంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇలాంటి షోల విషయంలో ఎలా వ్యవహరించాలో ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్ మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయంటూ వాటిని చదివి వినిపించారు. ఈ మార్గదర్శకాలను పరిశీలించిన ధర్మాసనం.. ‘పాతకాలంలో గొప్ప సినిమాలొచ్చేవి. సందేశాత్మక చిత్రాలొచ్చేవి. ఇప్పుడు కుటుంబసభ్యులంతా కలిసి చూసేలా సినిమాలు, టీవీ కార్యక్రమాలు ఉంటున్నాయా? ఇప్పుడు బూతులు తప్ప ఏముంటున్నాయి? కొట్టుకోవడం, తిట్టుకోవడం, విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప సినిమాల్లో ఏముంటోంది? ఇలాంటివాటికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది. సమాజంలో ఉన్నత వర్గం మౌనంగా ఉంటోంది. సమస్యల విషయంలో వారేమీ మాట్లాడటం లేదు. ఏం జరిగినా స్పందించడం లేదు. మేము, మా కుటుంబాలు బాగుంటే చాలు అనుకుంటున్నారు. ఇది సరైన వైఖరి కాదు..’ అని వ్యాఖ్యానించింది. బిగ్‌బాస్ షో విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని కేంద్ర ప్రభుతాన్ని ధర్మాసనం ఆదేశించింది.

పారదర్శకంగా సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ

- కోర్టు స్టేతో తుది ఫలితాల వాయిదా
- ప్రస్తుత నోటిఫికేషన్ రద్దుపై న్యాయనిపుణుల సలహా తీసుకుంటాం
- మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి అనూరాధ

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ (గ్రేడ్‌–2) పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇవ్వడంతో తుది ఫలితాలు వాయిదా వేశామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనూరాధ చెప్పారు. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దుచేయాలా, కొనసాగించాలా.. అనే విషయమై న్యాయనిపుణుల సలహా తీసుకుంటున్నట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 2013లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి రాతపరీక్షలు నిర్వహించారని, అప్పట్లో పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నియామకాల్లో కొద్దినెలలు జాప్యం జరిగిందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని తెలిపారు. 25 అంగన్‌వాడీ కేంద్రాలను ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షించాల్సి ఉండగా.. పోస్టుల భర్తీ లేకపోవడంతో 60కి పైగా కేంద్రాలను ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షించాల్సి వస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాల నుంచి ఏళ్ల తరబడి జాప్యం జరిగిన సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని తెలిపారు.

అపోహలు సరికాదు

రాష్ట్రంలో 560 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడంతో 21 వేలమందికి పైగా పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. గతంలో రాత పరీక్ష మాత్రమే ఉండేది కాబట్టి ఆ ప్రక్రియ పూర్తికాగానే కీ విడుదల చేసేవారన్నారు. ఈసారి రాతపరీక్షకు 45 మార్కులు, స్పోకెన్ ఇంగ్లిష్‌కు 5 మార్కులు కేటాయించినట్టు చెప్పారు. ఓఎంఆర్ షీట్లను ఒకే చోట వాల్యుయేషన్ చేసినట్లు చెప్పారు. ఇంగ్లిష్ స్పోకెన్ వీడియో తీసుకునేదానిపై ప్రభావం పడకూడదనే ముందుగా కీ విడుదల చేయలేదన్నారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక కీ విడుదల చేస్తామన్నారు. 560 పోస్టులకు సంబంధించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ 1,194 మంది మెరిట్ లిస్ట్ తీసుకుని, వారి స్పోకెన్ ఇంగ్లిష్ వీడియోలతో కలెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందంతో ఎంపిక ప్రక్రియ పూర్తిచేశామన్నారు. ఇప్పుడు కీ కూడా విడుదల చేశామని, మార్కులు వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. ఫలితాలు విడుదల చేసే దశలో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, దీనిపై అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. దీనిపై సీఎం జగన్ తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, అవసరమైతే ఆ నోటిఫికేషన్ రద్దుచేసి మళ్లీ ఇవ్వమని కూడా చెప్పారని పేర్కొన్నారు. కోర్టు కేసు నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన ప్రక్రియను రద్దుచేసి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలా, పరీక్ష విధానం మార్చాలా, ఇదే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలా.. అనేదానిపై న్యాయనిపుణులను సంప్రదిస్తున్నామన్నారు.

గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌పై 10న ఉత్తర్వులు

సాక్షి, న్యూఢిల్లీ: బళ్లారి వెళ్లడానికి అనుమతి కోరుతూ కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై అక్టోబర్ 10న ఉత్తర్వులిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. జనార్దన్‌రెడ్డి పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల సమయంలో గాలి తరఫు సీనియర్ న్యాయవాదిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. గురువారం కోర్టులో విచారణ అనంతరం హడావుడిగా గాలి కుమార్తెను బెంగళూరు నుంచి బళ్లారికి తరలించారని సీబీఐ తరఫు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. బళ్లారిలో తగిన ఆసుపత్రులు లేనందున గాలి కుమార్తెను సిజేరియన్ నిమిత్తం బెంగళూరు ఆసుపత్రిలో చేర్చారని సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా చెప్పారు. గురువారం విచారణ తర్వాతే ఎందుకు బళ్లారి పంపాల్సి వచ్చిందంటూ ప్రశ్నించింది.

కూతురిపై లైంగికదాడి కేసులో తల్లిదండ్రులకు జీవిత ఖైదు

చిత్తూరు అర్బన్/దేవీపట్నం (అల్లూరి సీతారామరాజు జిల్లా): కన్న కూతురిపైనే లైంగికదాడికి పాల్పడిన తండ్రికి, అతనికి సహకరించిన తల్లికి బతికి ఉన్నంతవరకు జైలు శిక్ష(జీవిత ఖైదు) విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక మహిళా న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లీలావతి కథనం మేరకు.. 2018, నవంబర్ 3వ తేదీన పలమనేరుకు చెందిన కృష్ణమూర్తి, ధనమ్మ దంపతుల కుమార్తె(13 ఏళ్ల బాలిక) ఇంట్లో నిద్రిస్తోంది. మద్యం మత్తులో ఉన్న కృష్ణమూర్తి తన కుమార్తెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇందుకు బాలిక తల్లి సహకరించింది. బాధిత బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి డీఎస్పీ రామ్‌కుమార్ కేసు నమోదు చేసి కృష్ణమూర్తి, ధనమ్మను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై నేరం రుజువుకావడంతో ఇద్దరూ జీవించి ఉన్నంత వరకు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు

కూతురిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు, రూ.2,500 జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు తీర్పు చెప్పిందని ఎస్ఐ నాగార్జున శుక్రవారం తెలిపారు. దేవీపట్నం మండలంలో తున్నూరు గ్రామానికి చెందిన ఎ.రాజేశ్వరరెడ్డి తన కూతురు (మైనర్)పై లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. ఈ విషయం గమనించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చోడి వీర్రాఘవ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న రాజేశ్వరరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ పోక్సో కోర్టు జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.2,500 జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

తణుకులో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన ప్రారంభం



తణుకు అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు క్రీడా ప్రాంగణంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని తెలిపారు. ఆర్బీకేల ద్వారా రైతాంగానికి అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. అనంతరం పోటీలను ఏర్పాటు చేసిన మంత్రి కారుమూరిని అభినందించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతాంగానికి ఇస్తున్న ప్రాధాన్యత స్ఫూర్తిగానే ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

డగ్స్ దందాలో నేపాలీలు, నైజీరియన్లు టాప్

సాక్షి, అమరావతి: దేశంలో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్న విదేశీయుల్లో నేపాలీలు, నైజీరియన్లు అత్యధికంగా ఉన్నారు. వివిధ రకాల డ్రగ్స్ అక్రమ రవాణా, అమ్మకాల్లో 25దేశాలకు చెందినవారు క్రియాశీలకంగా వ్యవహరించారని 'నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో'(ఎన్‌సీబీ) నివేదిక-2021 వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2021లో ఏకంగా 345 మంది విదేశీయులను అరెస్ట్ చేశారు. వారిలో నేపాలీలు, నైజీరియన్లు మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. అరెస్టయిన వారిలో నేపాలీలు 115 మంది, నైజీరియన్లు 87మంది ఉన్నారు. మయన్మార్ వాసులు 22 మంది, శ్రీలంక-17, ఉగాండా-15, ఆఫ్గానిస్తాన్-14, ఇరాన్-13, టాంజానియా-12, పాకిస్తాన్-10, జాంబియా-7, దక్షిణాఫ్రికా-5, జింబాబ్వే-5, ఘనా-5, కెనా-3, ఐవరీ కోస్ట్-3, జర్మనీ-2, మొజాంబిక్-2 ఉండగా, కామెరూన్, కాంగో, కోటే డిలోవైర్, గునియా, మాలవీ, రష్యా, స్విట్జర్లాండ్, యూకేలకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

నేటి నుంచి విశాఖలో ఇన్ఫోసిస్ సేవలు

తొలి దశలో వెయ్యి మందికి ఉపాధి అవకాశం

- జనవరి నుంచి పూర్తిస్థాయిలో పని
- ఇన్ఫోసిస్ రాక.. విశాఖ అభివృద్ధికి సంకేతం
- బీచ్ ఐటీ నినాదంతో విశాఖలో ఐటీ అభివృద్ధి
- త్వరలో కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు
- మీడియాతో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా నేటి నుంచి (అక్టోబర్ 1) ఇన్ఫోసిస్ సేవలు ప్రారంభమవుతున్నాయని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. తొలిదశలో 1,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పూర్తిస్థాయి సేవలు మొదలవుతాయన్నారు. ఇక్కడి సర్క్యూట్ హౌస్‌లో ఇన్ఫోసిస్ సంస్థకు చెందిన ఆరుగురు ప్రతినిధులతో మంత్రి శుక్రవారం భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రంలో ఓ మంచి వాతావరణంలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఇప్పటికే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ నంబర్‌వన్ స్థానంతోపాటు పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల కల్పనలోనూ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ఉమ్మడి ఏపీలో మహానేత వైఎస్సార్ విశాఖలో వేసిన ఐటీ మొక్క ఇప్పుడు వృక్షంలా మారిందని మంత్రి అమర్‌నాథ్ అన్నారు.

హరీష్ ఎవరి మనిషి?

అనంతరం.. తెలంగాణ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించడంతో గుడివాడ అమర్‌నాథ్ ఇలా స్పందించారు.. 'తెలంగాణ మంత్రి హరీష్‌రావు కేసీఆర్ మనిషా లేదా రామోజీరావు మనిషా? ప్రజలకు చెప్పాలి. మీ మేనమామ కేసీఆర్‌తో ఏదైనా గొడవ ఉంటే మీరిద్దరూ చూసుకోండి. మీరు మమ్మల్ని తిడితే మేం కేసీఆర్‌ని తిడతాం కదా? హరీష్‌రావుకు అదే కావాల్సినట్లు ఉంది. మా రాష్ట్రం గురించి, మా గురించి మీకెందుకు? టీఆర్ఎస్ మంత్రులు మా రాష్ట్రానికి నీతులు, సూచనలు చెప్పాల్సిన అవసరంలేదు. తెలంగాణ ఉద్యమంలో ఏపీ భవన్‌లో పోలీసులను బూటు కాళ్లతో తన్నిన ఘటన మరిచిపోయి మాట్లాడుతున్నారా? ఉద్యోగులను ఎవరు ఎలా చూస్తారో ఈ ఘటనే నిదర్శనం. ఎనిమిదేళ్లుగా తెలంగాణలో టీఆర్ఎస్ చేసింది ఏమీలేదు. మేం మూడున్నరేళ్లలో మా రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పోల్చి చూడండి.. మీకే తెలుస్తుంది. గతంలో కూడా మరో మంత్రి కేటీఆర్ మాపై మాట్లాడారు. చివరకు ఆ మాటలను ఆయన ఉపసంహరించుకున్నారు'.. అని గుర్తుచేశారు.

భవిష్యత్తులో మరిన్ని ఐటీ సంస్థలు

ఇన్ఫోసిస్ రాక విశాఖ అభివృద్ధికి సంకేతమన్నారు. ఇప్పటికే కొన్ని ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వీరికి కావాల్సిన ఫెసిలిటీ మేనేజ్‌మెంట్‌లో ప్రభుత్వం నుంచి ఏ సహాయం కావాలన్నా అందించమని సీఎం జగన్ ఆదేశించారన్నారు. వారు కోరిన విధంగా అన్ని సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తాజా ఉద్యోగులతో పాటు త్వరలో కళాశాలల్లోనే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా కొత్త ఉద్యోగులను ఇన్ఫోసిస్ తీసుకుంటుందన్నారు. ఇక బీచ్ ఐటీ నినాదంతో విశాఖలో ఐటీ రంగం మరింత అభివృద్ధి చెందనుందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. రానున్న కాలంలో మైక్రోసాఫ్ట్, ఐబీఎం, టీసీఎస్ లాంటి సంస్థలు కూడా విశాఖ నుంచి సేవలందించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆ దిశగా ప్రభుత్వం నుంచి అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. దీనిపై కొందరు టీడీపీ పెద్దలు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని, స్వయాన లోకేశ్ ఐటీ మంత్రిగా పనిచేసి విశాఖకు చేసింది శూన్యమని మంత్రి కౌంటర్ ఇచ్చారు.

కాకినాడ పోర్టుకు మహర్దశ

- సాగరమాల కింద రూ.100 కోట్లతో అభివృద్ధి
- పోర్టు సామర్థ్యం రెట్టింపు చేయాలని లక్ష్యం
- టెండర్లు ఖరారు... త్వరలో పనులు ప్రారంభం



కాకినాడ యాంకరేజ్‌పోర్టు

సాక్షిప్రతినిధి, కాకినాడ: తూర్పు తీరంలో వందేళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ కాకినాడ యాంకరేజ్ పోర్టుకు మహర్దశ పట్టనుంది. సాగరమాల పథకం కింద ఈ పోర్టును రూ.100 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ప్రధానంగా బియ్యం విదేశాలకు ఎగుమతి అవుతాయి. బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఈ పోర్టు నిలిచింది. ఇప్పుడు ఉన్న కనీస సౌకర్యాలతోనే ఏటా 30 లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతి, దిగుమతులు జరుగుతున్నాయి. మరిన్ని సదుపాయాలను కల్పించి ఎగుమతి, దిగుమతి సామర్థ్యాన్ని రెట్టింపు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అభివృద్ధి పనుల వ్యయంలో 50 శాతం భరించేందుకు సిద్ధమని ప్రకటించింది. దీంతో సాగరమాల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎస్‌డీసీఎల్) ద్వారా పోర్టులో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే బృహత్తర కార్యక్రమానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. పోర్టు అభివృద్ధిపై ఎల్ అండ్ టీ సంస్థ సమర్పించిన డీపీఆర్‌కు కేంద్ర పోర్టుల మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. టెండర్లు కూడా ఖరారయ్యాయి. టెండర్ దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన విశ్వసముద్ర హోల్డింగ్స్ సంస్థ త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

ఇవీ పోర్టులో చేపట్టనున్న అభివృద్ధి పనులు

న్యూ పోర్టు ఏరియాలో లోడింగ్ పాయింట్‌ను బలోపేతం చేస్తారు. మనుషులతో ఎగుమతి, దిగుమతి స్థానంలో యంత్రాలను వినియోగించేలా వసతులు కల్పిస్తారు. పోర్టుకు అనుసంధానంగా కాకినాడ ఏడీబీ రోడ్డు నుంచి నాలుగు లేన్ల రహదారి, 110, 90 మీటర్ల వార్ఫ్‌వాల్ నిర్మిస్తారు. రెండు దశాబ్దాల కిందట పోర్టులో నిర్మించిన అంతర్గత రహదారులు ఆధునీకీకరిస్తారు. గ్రోయిన్‌లు, రివిట్‌మెంట్ పనులు చేస్తారు. పోర్టుకు అనుసంధానంగా 61 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతు ఉన్న కమర్షియల్ కెనాల్‌ను అభివృద్ధి చేస్తారు. కమర్షియల్ కెనాల్, అప్రోచ్ కెనాల్‌లను డ్రెడ్జింగ్ చేస్తారు.

సీఎం చొరవతో సాధ్యమైంది

కేంద్రంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన ఒత్తిడి ఫలితంగానే పోర్టు అభివృద్ధికి ఇన్ని నిధులు మంజూరయ్యాయి. యాంకరేజ్ పోర్టు మొదటి నుంచి నిర్లక్ష్యానికి గురైంది. ఓడరేవుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక దృష్టి కారణంగా ప్రాజెక్టులు పట్టాలెక్కుతున్నాయి.

– వంగా గీత, ఎంపీ, కాకినాడ

ఎప్పుడూ ఇన్ని నిధులు రాలేదు

వందేళ్ల చరిత్ర కలిగిన యాంకరేజ్ పోర్టుకు ఎప్పుడూ ఈ స్థాయిలో నిధులు రాలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే పోర్టు ఆధునీకీకరణకు అడుగులు పడుతున్నాయి. ఈ పోర్టుపై ఆధారపడిన వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయి. పోర్టులో ఎగుమతి, దిగుమతిలు పెరిగే దిశగా పనులు చేపడుతున్నారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ సిటీ

యాంకరేజ్ పోర్టుకు మంచి రోజులు

కాకినాడ యాంకరేజ్ పోర్టుకు మంచి రోజులు వస్తున్నాయి. పోర్టు ఏరియాలో రహదారులు, గ్రోయిన్స్, కమర్షియల్ కెనాల్ పూర్తిగా పాడైపోయాయి. వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇంతకాలానికి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఈ పోర్టుకు మంచి రోజులు వస్తున్నాయి.

– ఆర్.ధర్మశాస్త్ర, పోర్టు అధికారి, కాకినాడ.

షిప్ రిపేర్ హబ్‌గా విశాఖపట్నం

- హిందుస్థాన్ షిప్‌యార్డ్ సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రీ
- 2024లో తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ తయారీకి ప్రణాళిక
- ఇందుకోసం భారీ స్లిప్ వే, క్రేన్
- దీని ద్వారా విశాఖకు బూమ్
- 25 ఎకరాల్లో షిప్‌యార్డ్ విస్తరణ, ఎంఎస్ఎంఈ పార్క్
- నాలుగేళ్లలో నంబర్ వన్ స్థానం లక్ష్యం



మీడియాతో మాట్లాడుతున్న హెచ్ఎస్ఎల్ సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రీ, డైరెక్టర్ గుప్తా

సాక్షి, విశాఖపట్నం : విశాఖను షిప్ రిపేర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని హిందుస్థాన్ షిప్‌యార్డ్ (హెచ్ఎస్ఎల్) సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రి తెలిపారు. ఓఎన్జీసీ, షిప్పింగ్ కార్పొరేషన్, విదేశీ కంపెనీలు వారి ఓడల మరమ్మతుల ఆర్డర్లు హెచ్ఎస్ఎల్‌కు ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నాయని చెప్పారు. హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ జీపీ గుప్తాతో కలిసి ఆయన శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. నౌకల తయారీ, మరమ్మతుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎస్ఎల్‌లో ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ (యుద్ధ నౌకల) తయారీకి సిద్ధమవుతున్నామన్నారు. దీనికి త్వరలోనే అనుమతులు వస్తాయని తెలిపారు. ఇది వస్తే విశాఖపట్నం బూమ్ ఒక్కసారిగా పెరుగుతుందని చెప్పారు. ఈ నౌకల తయారీకి 300 మీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పుతో భారీ స్లిప్‌వేని 2024 ఆగస్టుకి పూర్తి చేస్తున్నామన్నారు. రూ.420 కోట్ల విలువైన 300 టన్నుల గోలియత్ క్రేన్‌ని సిద్ధం చేశామని చెప్పారు. 2024లో మొదటి ఎఫ్ఎస్ఎస్ తయారీకి సిద్ధమవుతున్నట్లు చెప్పారు. షిప్‌యార్డు చరిత్రలో తొలిసారిగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.755 కోట్ల టర్నోవర్ సాధించగా.. రూ.50.78 కోట్లు నికర లాభం పొందినట్లు తెలిపారు. 2022–23లో రూ1000 కోట్లు టర్నోవర్ చేరుకుంటామని అన్నారు. దేశంలోని షిప్‌యార్డుల్లో హెచ్ఎస్ఎల్ నాలుగో స్థానంలో ఉందని, నాలుగేళ్లలో నంబర్ వన్ స్థానంలో నిలవాలన్నది లక్ష్యమని చెప్పారు. షిప్‌యార్డును మరో 25 ఎకరాల్లో విస్తరిస్తున్నామని, ఇందులోనే ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నాలుగు నౌకలు ఒకేసారి తయారు చేసేలా మరో స్లిప్‌వే నిర్మించనున్నట్లు తెలిపారు.

రూ.20వేల కోట్లతో ఎల్‌పీడీలు

సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నుంచి ఓషన్ సబ్‌మెర్స్‌డ్ వెసల్స్ తయారీకి ఆర్డర్లు రాబోతున్నాయని చెప్పారు. రూ. 20 వేల కోట్ల విలువైన లెంగ్త్ ప్లాట్‌ఫామ్ డాక్స్ (ఎల్‌పీడీ) షిప్స్ నిర్మాణానికి నామినేషన్ ఆర్డర్లు వేస్తున్నామన్నారు. ఇటీవలే మరో సింధుఘోష్ క్లాస్ సబ్‌మెరైన్ మరమ్మతు పనుల్ని సుమారు రూ.620 కోట్లతో భారత నౌకాదళం అప్పగించిందని, దీన్ని 24 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

గడప గడపలో దరహాసం

- ప్రతిచోటా అపూర్వ స్పందనతో ఎమ్మెల్యేల్లో రెట్టింపు ఆత్మవిశ్వాసం: సజ్జల
- రాష్ట్ర ప్రయోజనాలే వైఎస్సార్‌సీపీకి ప్రధానం.. ఏ ఫ్రంట్‌తోనూ కలవం
- ఉద్యోగుల విషయంలో హరీష్‌రావు వ్యాఖ్యలు వ్యక్తిగతమని భావిస్తున్నాం
- ఆయనకు కేసీఆర్‌తో సమస్యలుంటే పరిష్కరించుకోవాలేగానీ మాపై పడితే ఎలా?

సాక్షి, అమరావతి: ఎన్నికల హామీల్లో 98.4 శాతాన్ని అమలు చేసి సంక్షేమ పథకాలతో నేరుగా రూ.1.71 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చిన సీఎం జగన్ ప్రభుత్వానికి గడప గడపలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. అపూర్వ స్పందనతో ఎమ్మెల్యేల్లో ఆత్మ విశ్వాసం రెట్టింపు అయిందన్నారు. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థి వందకు వంద మార్కుల కోసం శ్రమించే రీతిలో 175 స్థానాలను సాధించాలంటే గడప గడపకూ కార్యక్రమాన్ని పరిపూర్ణంగా విజయవంతం చేయాలని సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తే విపక్షాలతోపాటు, ఎల్లో మీడియా వక్రీకరిస్తోందని మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.



▲ మా ఎమ్మెల్యే మాకు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకే గడప గడపకూ చేపట్టాం. చేతనైతే టీడీపీ నేతలు, పవన్ కల్యాణ్‌ను తిరగమనండి. పోటీతత్వం ఉంటే మంచి ఫలితాలుంటాయి.

▲ రాజకీయాలను పవిత్రమైన వృత్తిగా స్వీకరించే వారసులకు మాత్రమే అవకాశం ఉంటుంది కానీ వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తామంటే కుదరదని సీఎం జగన్ చెప్పారు. ఏ పార్టీలోనైనా వారసత్వ రాజకీయం గురించి ఇంత స్పష్టంగా మాట్లాడిన నేత ఎవరైనా ఉన్నారా?

రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం

▲ వైఎస్సార్‌సీపీకి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రధానం. అందుకే కేసీఆర్, బీజేపీ సహా ఎవరూ మమ్మల్ని ఏ ఫ్రంట్? అని అడగటం లేదు. ఏ పార్టీ అయినా మేమిది చేస్తామని చెప్పి ప్రజల ఆశీర్వాదం పొందాలే కానీ అధికారం కోసం అతుకుల బొంతలా పొత్తులు పెట్టుకోకూడన్నదే సీఎం వైఎస్ జగన్ విధానం.

▲ ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు భంగం కలిగితే సంతోషించే రీతిలో 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్' పని చేస్తున్నాయి. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు మేరకే పోలవరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తోందని కేంద్రం స్పష్టం చేస్తుంటే పక్క రాష్ట్రాల వాదనలతో దుష్ప్రచారం చేయడం వాటి దిగజారుడుతనానికి పరాకాష్ట. పోలవరానికి 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తే వెనక్కి ఎగదన్నుతుందని తెలంగాణ చెబుతోంది. ఆ ప్రాజెక్టు సామర్థ్యమే 194.6 టీఎంసీలు. వరదలు వస్తే డ్యామ్‌లో నీళ్లను నిలువ చేయకుండా దిగువకు వదిలేస్తాం కదా?

హరీష్‌కు సమస్యలుంటే మాపై పడితే ఎలా?

సీఎం జగన్‌పై దుష్ట చతుష్టయం ఒక పథకం ప్రకారం దాడి చేస్తోంది. తెలంగాణ మంత్రి హరీష్‌రావు వారికి తగ్గట్లే వ్యవహరిస్తూ ఏపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నట్లు కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధమైన వాతావరణం ఉంది. అధికారంలో ఉన్నవాళ్లు అక్కడి సమస్యలను పరిష్కరించుకోవాలే కానీ పక్క రాష్ట్రం గురించి వారికెందుకు? ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని అంశాలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. ఉద్యోగుల విషయంలో ఏపీ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలను ఆయన వ్యక్తిగతంగా పరిగణిస్తాం. హరీష్‌రావుకు, కేసీఆర్‌కు వ్యక్తిగతంగా ఏమైనా సమస్యలుంటే వాళ్లిద్దరూ చూసుకోవాలి కానీ మాపై పడితే ఎలా? మమ్మల్ని విమర్శిస్తే మేం తిరిగి కేసీఆర్‌ను తిడతామని హరీష్‌రావు అలా మాట్లాడి ఉండవచ్చు. మేం ఆ ఉచ్చులో పడం.

టీడీపీకి టిడ్కో ఇళ్లపై మాట్లాడే హక్కు లేదు

టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు ఎందుకు కట్టలేదు? అన్న ప్రశ్నకు టీడీపీ నుంచి గానీ అనుబంధ మీడియా నుంచి గానీ సమాధానం లేదు. మౌలిక సదుపాయాలు లేకపోతే ఎవరైనా ఎలా నివసిస్తారు? టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ అవినీతికి పాల్పడింది. టిడ్కో ఇళ్లు వద్దని తిరస్కరించిన వారు ఏకంగా 51 వేల మంది ఉన్నారు. కారణం ఏమిటి? సీఎం జగన్ ఇళ్ల స్థలంతోపాటు ఇండిపెండెంట్ ఇళ్లు కట్టించి ఇస్తున్నారు.

ఉచిత విద్యుత్‌పై పేటెంట్ మాదే..

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది దివంగత వైఎస్సార్. ఆ పథకంపై పేటెంట్ మాదే. ఉచిత విద్యుత్‌ను రైతులకు హక్కుగా కల్పించడానికి మీటర్లు బిగించేలా సంస్కరణలు తెస్తే చంద్రబాబును మించిన రీతిలో ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ విమర్శలు చేస్తున్నారు. వాళ్లే ఒక రాజకీయ పార్టీ పెట్టుకుంటే బాగుండేది. శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా మీటర్లు పెట్టాం. అక్కడ ఎలాంటి ఫిర్యాదులేదు. దీని ద్వారా ఎఫ్ఆర్‌బీఎం పరిధి పెరగడం అదనపు ప్రయోజనమే. అదనంగా రూ.రెండు వేలకోట్ల నుంచి రూ.మూడు వేలకోట్ల రుణం వస్తుంది.

మెడికల్ కాలేజీలు మేమే కడతాం..

గ్రాఫిక్స్‌లో చంద్రబాబు అమరావతి కట్టారు. మెడికల్ కాలేజీలను రియల్‌గా కడుతున్నాం. రాత్రికి రాత్రే నిర్మాణాలు పూర్తికావు కదా! చంద్రబాబు కాగితాలపై మినహా ఏ పనీ చేయలేదు. సీఎం జగన్ మెడికల్ కాలేజీలకు సంబంధించి టెండర్లు పిలిచారు, పని ప్రారంభించారు. ఇల్లు కట్టడానికే ఏడాది పడితే మెడికల్ కాలేజీ పూర్తవడానికి నాలుగైదేళ్లు పడుతుంది. మేం పనులు పక్కన పెడితే కదా ప్రశ్నించాల్సింది? 2024లోనూ మేమే గెలుస్తాం.

గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- అక్టోబర్ 13 నుంచి నవంబర్ 2 వరకు దరఖాస్తులకు గడువు
- ఎంవీఐ పోస్టులకు నవంబర్ 2 నుంచి 22 వరకు..
- ఇంటర్వ్యూల విధానం పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ
- గరిష్ట వయోపరిమితి మరో రెండేళ్లు పొడిగింపు

సాక్షి, అమరావతి :రాష్ట్రంలో గ్రూప్-1 కేడర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే నోటిఫికేషన్‌లో గ్రూప్-1 పోస్టులతో పాటు అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను కూడా భర్తీ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్. అరుణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పోస్టులు 92 ఉండగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 17 ఉన్నాయి. ఇక గ్రూప్-1 పోస్టుల దరఖాస్తుకు అక్టోబర్ 13 నుంచి నవంబర్ 2 వరకు, ఎఎంవిఐ పోస్టులకు నవంబర్ 2 నుంచి 22 వరకు గడువు విధించారు. పూర్తి వివరాలను కమిషన్ వెబ్‌సైట్ https:// psc. ap. gov. in/ లో చూడొచ్చని కార్యదర్శి పేర్కొన్నారు.

గ్రూప్-1 సహా అత్యున్నత కేడర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఇలా ఉండగా.. ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్-1 సహా ఇతర అత్యున్నత కేడర్ పోస్టులకు రాత పరీక్షలతో పాటు ఇంటర్వ్యూలను కూడా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రద్దు చేసిన ఇంటర్వ్యూల విధానాన్ని పునరుద్ధరించింది. ఈ అత్యున్నత పోస్టులన్నింటికీ ప్రిలిమ్స్, మెయిన్స్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించేలా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోపక్క.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి గరిష్ట వయో పరిమితి రెండేళ్లకు పెంచుతూ గతంలో జారీచేసిన జీఓ 105 అమలును మరో రెండేళ్లు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. గతంలో 34ఏళ్ల వయోపరిమితిని 42ఏళ్లకు పెంచి జీఓ 105 జారీచేశారు. తాజా ఉత్తర్వులతో ఈ 42ఏళ్ల గరిష్ట వయోపరిమితి 2023 సెప్టెంబర్ 30వరకు అమల్లో ఉంటుంది.

'ఆహారభద్రత'లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- తప్పు జరిగితే సుమోటోగా కేసుల నమోదు
- ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నంబరు 94905 51117
- లక్ష కరపత్రాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన
- ఆహారభద్రత కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆహారభద్రత చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆహారభద్రత కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆకలి మరణాలు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాపంపిణీ వ్యవస్థతోపాటు అంగన్‌వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకానికి రూ.వేలకోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. పేదలకు పెట్టే అన్నం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సుమోటోగా కేసులు పెట్టడంతోపాటు జరిమానా, అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 155235తో పాటు ప్రత్యేక వాట్సాప్ నంబర్ 94905 51117ను అందుబాటులోకి తెచ్చామన్నారు. లక్ష కరపత్రాలతో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా కమిషన్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆరునెలల కాలంలో 15 జిల్లాల్లో 273 యూనిట్లను తాను పరిశీలించినట్టు తెలిపారు. త్వరలోనే మిగిలిన జిల్లాల్లో పర్యటించి ఆహారభద్రత అమలవుతున్న తీరుపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. జిల్లాల్లో ఆహారభద్రత అమలు పర్యవేక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థలో ఏడు జిల్లాలతో పాటు మొత్తం విద్యార్థులందరికీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహారంగా అందిస్తున్నట్టు చెప్పారు. కొందరు వీటిని ప్లాస్టిక్ బియ్యం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

గ్రామ గ్రామానా అదే ఆదరణ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వం అందించే పథకాల వివరాలు తెలుసుకుంటున్నందుకు స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో శుక్రవారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.



కర్నూలు జిల్లా బిల్లేకల్లులో మంత్రి జయరాం



ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం

విద్యుత్ వినియోగదారులకు సీజీఆర్ఎఫ్ అండ

- ఎలాంటి ఫిర్యాదు అయినా విచారణ చేస్తున్న ఫోరం
- సత్వర సాయానికి సిఫార్సు..
- తప్పు చేస్తే ఉద్యోగులకు జరిమానా
- మూడు డిస్కంలలో 'సీజీఆర్ఎఫ్'కు ముగ్గురు చైర్‌పర్సన్లు

సాక్షి, అమరావతి: విద్యుత్ సేవలను సకాలంలో నిబంధనల మేరకు పొందడం వినియోగదారుని ప్రాథమిక హక్కు. దానికి కూడా అనేక మెలికలు పెట్టి నిర్లక్ష్యం చేసే ఉద్యోగులు కొందరుంటారు. అలాంటి వారిని గాడిన పెట్టేందుకు, వినియోగదారులకు న్యాయం చేసేందుకు కన్జ్యూమర్ గ్రీవెన్ రెడ్రెసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) కృషి చేస్తోంది. రాష్ట్రంలోని 1.92 కోట్ల సర్వీసులకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వేర్వేరుగా సీజీఆర్ఎఫ్ విభాగాలు ఉన్నాయి. ప్రతి సీజీఆర్ఎఫ్‌కు ఒక చైర్‌పర్సన్, ముగ్గురు సభ్యులు ఉన్నారు. వినియోగదారుల సమస్యలు తెలుసుకుని వారికి న్యాయం జరిగేలా చేయడమే ఈ ఫోరం ప్రధాన విధి. రాష్ట్రంలో 2006 నుంచి ఇప్పటి వరకు దాదాపు 12 వేల ఫిర్యాదులు అందగా, వీటిలో 90 శాతం కేసులను ఫోరం పరిష్కరించింది.

ఫోరం ఏం చేస్తుందంటే...

విద్యుత్ వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఎలాంటి ఫిర్యాదు అయినా చేసే అవకాశం ఉంది. ఆ నంబర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించకపోతే సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించవచ్చు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటర్ రీడింగ్ సరిగా చూడకపోవడం, బిల్లులు, కొత్త సర్వీసులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చు. కొత్త సర్వీసుల కోసం దరఖాస్తు చేసినా కేటాయించకపోయినా, విద్యుత్ ప్రమాదంలో మనుషులు, పశువులు మరణించినప్పుడు నష్టపరిహారం కోసం కూడా సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించవచ్చు. వినియోగదారుడికి జరిగిన నష్టంపై ఫోరం విచారణ చేసి పరిహారాన్ని సూచిస్తుంది. ఒకవేళ విద్యుత్ శాఖ అధికారుల తప్పిదమని తేలితే వారికి అపరాధ రుసుం విధిస్తుంది. కొన్ని కేసుల్లో శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తుంది. సమస్యను నిర్ణీత సమయంలోపు పరిష్కరించకపోతే కాలపరిమితి ప్రకారం ఏపీఈఆర్‌సీ రెగ్యులేషన్ 9/2013లో షెడ్యూల్-2 ప్రకారం వినియోగదారులకు పరిహారం చెల్లించేలా తీర్పు ఇస్తుంది. ఈ సేవల కోసం వినియోగదారులు తమ సమస్య, సర్వీసు నంబర్, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ రాసి సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా గానీ, పోస్టు ద్వారా గానీ ఫిర్యాదును అందజేయాలి. ఎలాంటి రుసుము లేదు. న్యాయవాదితో అవసరం లేకుండా సీజీఆర్ఎఫ్ విచారణ చేపడుతుంది.

మాకు చెప్పండి

'విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలకు ఆదేశిస్తున్నాం. విద్యుదాఘాతంతో మరణించిన వారి కుటుంబాలు పరిహారం అందకపోతే ఎఫ్ఎస్ఐఆర్, ఆధార్ కార్డు, పోస్ట్ మార్టం రిపోర్టుతో సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తాం. సీజీఆర్ఎఫ్ సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు క్యాంపులు నిర్వహిస్తున్నాం.'

– బి.సత్యనారాయణ, ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

సంక్షేమం, అభివృద్ధే మోదీ లక్ష్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



అచ్యుతాపురం (అనకాపల్లి): బలమైన ఆలోచన, బలమైన సంక్షేమం, బలమైన అభివృద్ధి ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని తంతడిలో శుక్రవారం ప్రజా పోరు సభలో ఆయన పాల్గొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రూ.9 లక్షల కోట్లతో పోర్టులు, రైల్వేలు, ఇతర వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. కేంద్రం అందిస్తున్న నిధులను మళ్లించడంతో పాటు, కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు అంటించుకుని ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. కేంద్రం అందిస్తున్న పథకాలను వివరించేందుకే ఈ సభల్ని నిర్వహిస్తున్నట్టు సోము వీర్రాజు తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీని దెబ్బతీసేందుకు కుట్ర

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఏపీలో తమ పార్టీని దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. కాకినాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీని నైతికంగా దెబ్బతీసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రైల్వే జోన్, పోలవరం, విభజన హామీలపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలు బీజేపీని ఏమీ చేయలేవన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో బీజేపీ ప్రచార రథాన్ని కొందరు తగులబెట్టారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ అన్ని పార్టీలకు సమానంగా రక్షణ కల్పించాలన్నారు. కేవలం అధికార పార్టీకి మాత్రమే పోలీసులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. విజయనగరంలో రాముని విగ్రహాలు ధ్వంసం చేసిన ఘటనలో నేరస్తులను ఇప్పటికీ పట్టుకోలేదని, అధికార పార్టీ నాయకులను విమర్శిస్తే మాత్రం వెంటనే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తెల్లబంగారం వెలుగులు

పత్తి రైతు కళ్లల్లో కాంతులు

- ఏడేళ్ల తర్వాత రికార్డుస్థాయిలో సాగు
- ఐదేళ్ల కంటే మిన్నగా దిగుబడులు
- గతేడాది 13.32 లక్షల ఎకరాల్లో సాగు.. 12.29 లక్షల టన్నుల దిగుబడి
- ఈ ఏడాది 16.50 లక్షల ఎకరాల్లో సాగు
- 17.85 లక్షల టన్నుల దిగుబడి అంచనా.. కానీ 20 లక్షల టన్నులు దాటే అవకాశం
- ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.9,501
- ఎమ్మెస్పీ కంటే కనీసం రూ.3 వేలు అదనం

సాక్షి, అమరావతి: పత్తి రైతు పంట పండింది. తెల్ల బంగారం వెలుగులీనుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రికార్డుస్థాయిలో సాగవడమే కాదు.. దిగుబడులు కూడా భారీగా వచ్చేలా కనిపిస్తోంది. చరిత్రలో ముందెన్నడు లేని రీతిలో గతేడాది క్వింటాల్ రూ.13 వేలకుపైగా పలకడంతో ఈ ఏడాది రెట్టించిన ఉత్సాహంతో రైతులు పత్తిసాగు వైపు మళ్లారు. వేరుశనగ సాగుచేసే రైతులు సైతం ఈ ఏడాది పత్తి సాగుచేశారు. ఫలితంగా సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే రూ.3 వేలకుపైగా ఎక్కువగా పలుకుతున్న ధర నిలకడగా ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

రాష్ట్రంలో పత్తి సాధారణ సాగువిస్తీర్ణం 14.73 లక్షల ఎకరాలు. 2019–20లో 16 లక్షల ఎకరాల్లో సాగవగా, 2020–21లో 14.50 లక్షల ఎకరాల్లో, 2021–22లో 13.32 లక్షల ఎకరాల్లో సాగైంది.



గతేడాది అకాల వర్షాలు, తెగుళ్ల ప్రభావంతో 12.29 లక్షల టన్నుల దిగుబడులు నమోదయ్యాయి. 2022–23 ఖరీఫ్ సీజన్‌లో రికార్డు స్థాయిలో 16.50 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి చరిత్రలో 2014–15లో 16.35 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇప్పటివరకు అదే రికార్డు. ఈ రికార్డును అధిగమించే స్థాయిలో ఈ ఏడాది 16.50 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. 2014–15లో 15.50 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 17.85 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని మొదటి ముందస్తు అంచనాగా లెక్కించారు. సీజన్ పూర్తయ్యేనాటికి దిగుబడి 20 లక్షల టన్నులకుపైగానే రావచ్చని భావిస్తున్నారు. నిజంగా ఆ స్థాయిలో వస్తే దిగుబడుల్లో కూడా కొత్త రికార్డు నమోదయ్యే అవకాశం ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సమయానుకూలంగా కురుస్తున్న వర్షాలు పత్తికి మేలు చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉందని చెబుతున్నారు. ఏటా కలవరపెట్టే గులాబీ తెగులు కూడా ఈ ఏడాది కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడం రైతులకు కలిసొచ్చింది. పత్తి ఎక్కువగా సాగయ్యే కర్నూలు, గుంటూరు ప్రాంతాల్లో బోర్లకింద ఈసారి ఎకరాకు 15–20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్ కనీస మద్దతు ధర.. పొడుగుపింజ పత్తికి రూ.6,380, మధ్యస్థ పత్తికి రూ.6,080గా ప్రకటించింది. గతేడాది క్వింటాల్ రూ.13 వేల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.9,501 ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో నిలకడగా ఉన్న ధర సీజన్ పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యే నాటికి మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రెండేళ్లపాటు పత్తికి కనీస మద్దతు ధర లభించకపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా 2019–20లో 13 లక్షల క్వింటాళ్లు, 2020–21లో 18 లక్షల క్వింటాళ్ల చొప్పున రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలుచేసింది. గతేడాది కూడా 50 మార్కెట్ యార్డులతోపాటు 73 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. సాగువిస్తీర్ణం తగ్గడం, అంతర్జాతీయంగా కాటన్ యార్న్ ధరలు పెరగడంతో పత్తికి రికార్డుస్థాయి ధర పలికింది. ఫలితంగా రైతులు ఈ కేంద్రాల వైపు కన్నెత్తి చూడలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన పత్తి మార్కెట్‌గా పేరొందిన కర్నూలు జిల్లా ఆదోని యార్డుకు వ్యాపారులు క్యూ కట్టారు. గతేడాది 6.13 లక్షల క్వింటాళ్ల పత్తి యార్డుకు రాగా ఈ ఏడాది ఇప్పటికే 1.80 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చింది. ప్రస్తుతం సగటున రోజుకు ఆరువేల క్వింటాళ్ల చొప్పున ఈ యార్డుకు వస్తోంది. సీజన్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే రోజుకు 15 వేల నుంచి 20 వేల క్వింటాళ్ల వరకు వస్తుందని అంచనా వేస్తున్నారు. కనీసం ఈసారి 7–10 లక్షల క్వింటాళ్ల వరకు వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఎకరాకు 15 క్వింటాళ్లు వస్తుంది



నేను ఐదెకరాల్లో బోరుకింద పత్తి సాగుచేస్తున్నా. సకాలంలో వర్షాలు కురవడంతో గులాబీ తెగులుతో పాటు ఇతర తెగుళ్లు పెద్దగా సోకలేదు. దీంతో పంట ఏపుగా ఎదిగింది. ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగానే దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో కూడా మంచి రేటు పలుకుతోంది. రేటు ఇలాగే నిలకడగా ఉంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా.

– ఎ.నాగభూషణ్‌రెడ్డి, కర్నూలు జిల్లా

ధర నిలకడగా ఉంది



గత సీజన్‌లో రికార్డుస్థాయిలో ధర పలికింది. గరిష్టంగా క్వింటాల్ రూ.13 వేలకుపైగా పలికింది. ఆ తర్వాత కాస్త తగ్గినప్పటికీ ప్రస్తుతం ధర రూ.9,501 వద్ద ఉంది. యార్డుకు రోజుకు సగటున ఆరువేల క్వింటాళ్ల చొప్పున పత్తి వస్తోంది. ఈరోజు 1,044 లాట్స్ (4,957 క్వింటాళ్లు) పత్తి వచ్చింది.

– బి.శ్రీకాంతరెడ్డి, కార్యదర్శి, ఆదోని మార్కెట్‌యార్డు, కర్నూలు జిల్లా

అవసరం ఉండదనుకుంటున్నాం



ప్రభుత్వాదేశాలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. మార్కెట్‌లో రికార్డుస్థాయిలో ధర పలకడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. రైతులెవరు మా కేంద్రాలను ఆశ్రయించలేదు. ఫలితంగా క్వింటా పత్తి కూడా కొనుగోలు చేయలేదు. గతేడాది రికార్డుస్థాయిలో రూ.13 వేలకుపైగా పలికింది. ప్రస్తుతం 9,500 వరకు పలుకుతోంది. గత సీజన్ మాదిరిగానే ధర పెరిగే అవకాశం ఉంది. ఈసారి కూడా కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదనే భావిస్తున్నాం.

– జి.సాయిఆదిత్య, ఏజీఎం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

తెలంగాణలో విద్య, ఆరోగ్య రంగాలు అధ్వానం

- ఏపీ ప్రభుత్వ సలహాదారు మురళి
- స్వరాష్ట్రంలో సేవలందించేందుకు వీలుగా పదవికి రాజీనామా

సాక్షి, అమరావతి: తెలంగాణలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని, ముఖ్యంగా విద్య, ఆరోగ్యరంగాలు మరీ అధ్వానంగా మారాయని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పాఠశాల విద్య మౌలిక సదుపాయాలు), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎ.మురళి వ్యాఖ్యానించారు. తన స్వరాష్ట్రమైన తెలంగాణలోని ఈ పరిస్థితుల దృష్ట్యా తన సేవలను పూర్తిగా తెలంగాణలో అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏపీ ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. తెలంగాణలో తనసేవలు అందించడం కోసం రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అక్టోబర్ 31వ తేదీ వరకు తాను ఈ పదవిలో కొనసాగుతానని, దయచేసి తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. 'గత మూడు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యలో సలహాదారునిగా పనిచేయడం చాలా సంతోషం. గొప్ప అనుభూతి. గౌరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పాఠశాల విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత ఇప్పటివరకు ఈ దేశంలో ఎవరూ ఇచ్చి ఉండరు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల విద్యకు ముఖ్యంగా నాడు–నేడు పథకానికి ఇచ్చిన ప్రాధాన్యత, పూర్తి స్వతంత్రతకు ఈ సందర్భంగా ధన్యవాదాలు చెబుతున్నాను..' అని మురళి పేర్కొన్నారు.

ప్లీజ్.. తమ్ముళ్లూ ప్లీజ్..

- టీడీపీ నేతలకు బాబు లాలింపు
- పార్టీ ఇన్‌చార్జిలతో సమావేశాలు
- నియోజకవర్గాల్లో పని చేయాలని వేడుకోలు
- అయినా స్పందించని నేతలు
- ఎంత పనిచేసినా గెలవలేమనే ముఖ్య నేతల వెనకడుగు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధఃపాతాళానికి కూరుకుపోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ దారుణ ఓటములు. విపక్ష పార్టీగా అన్నీ వైఫల్యాలు. పార్టీ, అగ్రనేతలపై జనం ఏవగింపు. వచ్చే ఎన్నికల్లోనూ గెలిచే అవకాశాల్లేవని అర్థం చేసుకున్న నేతలు. నియోజకవర్గాల వైపు చూడని వైనం. ఏతావాతా 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబులో తీవ్ర ఆందోళన. దయచేసి నియోజకవర్గాలకు వెళ్లాలని వేడుకొంటున్నారు.



వారిని పిలిచి బుజ్జగిస్తున్నారు. పార్టీ కోసం పని చేయాలని, ముమ్ముందు పార్టీకి ఊపు వస్తుందని నమ్మబలుకుతున్నారు. అయినా నేతల్లో పెద్దగా మార్పు కనిపించడంలేదని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి. 2019 ఎన్నికల్లో, ఆ తర్వాత స్థానిక ఎన్నికల దెబ్బకు టీడీపీ ముఖ్య నేతలందరూ ప్రజల్లోకి వెళ్లడం మానేశారు. మూడేళ్లుగా వారంతా స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు మరీ ఒత్తిడి తెస్తే అప్పుడప్పుడు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి, తాము ఉన్నామని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో తనకు అనుకూలంగా ఉండే ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారానే చంద్రబాబు పార్టీని నడుపుకుంటూ వస్తున్నారు. రకరకాల అంశాలపై ఆందోళనలు చేయాలని ఇస్తున్న పిలుపులకు కూడా పార్టీ నేతల నుంచి అస్సలు స్పందన ఉండడంలేదని సమాచారం. బాదుడే బాదుడు పేరుతో అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా ఆందోళనలు చేయాలని చంద్రబాబు పదేపదే చెప్పినా నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. మీడియాలో కనపడటం కోసం చేసే హడావుడి తప్ప ప్రజల్లోకి వెళ్లడంలేదని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు యువతకు 40 శాతం సీట్లిస్తామనే పల్లవి అందుకున్నారు. యువతను ప్రోత్సాహించేందుకు ఈ నిర్ణయమని బయటకు చెప్పుకుంటున్నా.. నాయకుల కొరత వల్లే నిర్ణయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గాల్లో స్పందన కరువు

ఈ మూడేళ్లలో చంద్రబాబు ఇచ్చిన కార్యక్రమాలకు కనీసం సగం నియోజకవర్గాల నుంచి కూడా స్పందన రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 175 నియోజకవర్గాలకుగాను 70కి పైగా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలే లేరు. కొన్నిచోట్ల ఇన్‌చార్జిలు ఉన్నా అలంకారం కోసమే. కృష్ణా జిల్లా గన్నవరం ఇన్‌చార్జిగా ఉన్న పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు అసలు నియోజకవర్గానికి వెళ్లడమే లేదని పార్టీ నేతలే చెబుతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి బాధ్యుడి నియామకమే జరగలేదు. టీడీపీకి పట్టున్నట్లుగా చెప్పుకునే ఈ రెండు కీలక నియోజకవర్గాల్లోనే పార్టీ పరిస్థితి ఇలా ఉంటే మిగతా నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చని అంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చక్రం తిప్పిన ప్రత్తిపాటి పుల్లారావు, గంటా శ్రీనివాసరావు, నారాయణ వంటి అనేక మంది నేతలు ఇప్పుడు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మెజారిటీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి దయనీయంగా ఉందని చంద్రబాబు చేయించిన సర్వేల్లో కూడా తేలినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రోజుకు 4 నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశమవుతున్నారు. పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని, నియోజకవర్గంలో పని చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆందోళనలు చేయాలని సూచిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ మీదేనంటూ ఇన్‌చార్జిలకు హామీ ఇస్తున్నారు. ఇప్పటివరకు 60కి పైగా నియోజకవర్గాల నేతలతో చంద్రబాబు సమావేశమయ్యారు. అయినా, పెద్దగా ఉపయోగం కనిపించడంలేదని, చంద్రబాబు ఎంత బతిమిలాడినా భవిష్యత్తుపై నమ్మకం లేక ముఖ్య నేతలు నియోజకవర్గాలకు రావడంలేదని కొందరు నేతలు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 461 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 461 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP), Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2006/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.